

అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



నిరుద్యోగంపై ఏ నివేదికలను నమ్మాలి? కెటిఆర్‌కు 'జూబ్లీహిల్స్' పరీక్ష? 06
ఉత్తరాఖండ్‌లో విరిగిపడిన కొండచరియలు 05



సంపుటి 28, సంచిక: 90 | శుక్రవారం | 19-09-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


ప్రోటోకాల్ ఉల్లంఘన

## సిరిసిల్ల కలెక్టర్‌కు నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల కలెక్టర్ ప్రోటోకాల్ ఉల్లంఘించిన సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. అధికారికంగా నిర్వహించిన కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ నిబంధనలు పాటించకుండా వ్యవహరించిన తీరును ప్రభుత్వం తప్పుబట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు నోటీసులు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల లోపు తన సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్‌ను సిఎస్ అదేశించారు. కలెక్టర్ ఇచ్చే వివరణను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ఓటు దొంగలకు ఇసి రక్షణ

- ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తున్న వారిని జ్ఞానేష్ కుమార్ కాపాడుతున్నారు
- సాఫ్ట్‌వేర్ ద్వారా ఓటు ఐడిలను తొలగిస్తున్నారు
- ఎన్నికల కమిషన్‌పై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు
- ఓట్ల దొంగలను రక్షించడం ఆపేసి కర్నాటక సిఐడి కోరిన సమాచారాన్ని వారంలోపు అందించాలని డిమాండ్
- లేనిపక్షంలో రాజ్యాంగం ఖూనీలో భాగస్వామిగా భావించాల్సి వస్తుందని హెచ్చరిక

'ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి మోసపూరిత పద్ధతిలో ఓటర్లను చేర్చారు. మహారాష్ట్రలోని రాజురా నియోజకవర్గమే ఇందుకు ఉదాహరణ. ఇదే వ్యవస్థ ద్వారా కర్నాటకలోనే కాకుండా మహారాష్ట్ర, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో కూడా ఇదే పద్ధతి పాటించారు. వీటికి సంబంధించి మా వద్ద రుజువులు ఉన్నాయి. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మాదిరిగా సిఇసి జ్ఞానేష్ కుమార్ తన పని తాను చేయాలి. ఆధారాలను తప్పకుండా కర్నాటక సిఐడికి ఇవ్వాలన్నదే మా డిమాండ్. ఇప్పటివరకు వెల్లడైన విషయాలు నేను చెప్పిన హైడ్రోజన్ బాంబు కాదు. అది త్వరలోనే ఉంటుంది.
– రాహుల్ గాంధీ




**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘంపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారిని ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రక్షిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మద్దతుదారుల ఓట్లను క్రమపద్ధతిలో తొలగిస్తున్నారని కర్ణాటక అసెంబ్లీ నియోజకవర్గం డేటాను ఉదహరించారు. ఓట్ల దొంగతనానికి సంబంధించి ఎన్నికల కమిషన్‌పై విమర్శలను ముమ్మరం చేశారు. ఎన్నికల సంఘం ఓట్ల దొంగలను రక్షించడం ఆపివేసి ఓటర్ల తొలగింపుపై దర్యాప్తులో కర్ణాటక సిఐడి కోరిన సమాచారాన్ని వారంలోపు అందించాలని రాహుల్‌గాంధీ సూచించారు. లేకపోతే రాజ్యాంగం ఖూనీలో భాగస్వామి అని కచ్చితంగా భావించాల్సివస్తోందన్నారు. గురువారం ఆయన కాంగ్రెస్ ఇందిరా భవన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు వెల్లడైన విషయాలు తాను చెప్పినట్లు హైడ్రోజన్ బాంబు కాదని, అది త్వరలోనే పేలుతుందని స్పష్టం చేశారు. తాను పునాదిని ఏర్పాటు చేస్తున్నానని, ఇది 10–15 ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. భారతదేశ ప్రజాస్వామ్యం హైజాక్ అయిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని భారత ప్రజలు మాత్రమే కాపాడగలరని, రాహుల్ గాంధీ నిజం చూపిస్తారన్నారు. ప్రజలు తమ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం దొంగిలించబడిందని గ్రహించిన రోజు పని పూర్తవుతుందన్నారు. 2023 ఎన్నికలకు ముందు కర్ణాటకలోని అలంద్ తరువాయి 2లో

### రాహుల్ వ్యాఖ్యలు నిరాధారం: ఇసి

సిఇసి జ్ఞానేష్ కుమార్ 'ఓటు దొంగలను' రక్షిస్తున్నారని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల కమిషన్ ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని పేర్కొంది. బాధిత వ్యక్తికి తన వాదనను వినిపించే అవకాశం ఇవ్వకుండా ఎటువంటి తొలగింపు జరగదని ఇసి వెల్లడించింది. రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, ఆయన తప్పుగా భావిస్తున్నారని, ఇతరులు ఎవరు కూడా ఆన్‌లైన్‌లో ఏ ఒక్క ఓటును కూడా తొలగించలేరన్నారు. 2023లో, కర్నాటక అలంద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించడానికి కొన్ని విఫల ప్రయత్నాలు జరిగాయని, ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ఇసి యంత్రాంగం స్వయంగా ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసిందని ఎన్నికల సంఘం పేర్కొంది.



## మెరిట్ విద్యార్థులకు చెవెనింగ్ స్కాలర్‌షిప్

- కో ఫండింగ్ ప్రాతిపదికన అందించేందుకు బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ సూత్రప్రాయ అంగీకారం
- మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధిలో భాగస్వామ్యానికి సానుకూల వైఖరి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మర్యాదపూర్వక భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇంగ్లండ్ (యూకె) ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే 'చెవెనింగ్ అంతర్జాతీయ స్కాలర్‌షిప్' విషయంలో కోఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ సూత్రప్రాయంగా ఆంగీకరించారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తికి బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ సానుకూలంగా స్పందించారు. భారతలో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. కామెరాన్‌తో పాటు యుకె డిప్యూటీ హైకమిషనర్ (హైదరాబాద్) గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమీ సలహాదారు నళిని రఘురామన్ కూడా ఉన్నారు. యుకె ప్రభుత్వం అంతర్జాతీయ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ లో భాగంగా అందిస్తున్న చెవెనింగ్ స్కాలర్‌షిప్‌లను కోఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణకు చెందిన మెరిట్ విద్యార్థులకు అందించడానికి ఈ సందర్భంగా అంగీకరించారు. విద్య, సాంకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి ఆయన వివరించారు. యూకెలోని యూనివర్సిటీలలో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం అక్కడి వర్సిటీలు అడ్మిషన్లు, ఇతరత్రా కార్యక్రమాలను హైదరాబాద్ నుంచి ఆపరేట్ చేసే విధంగా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో కొత్తగా తీసుకురానున్న ఎడ్యుకేషన్ పాలసీ ముసాయిదా గురించి ముఖ్యమంత్రి బ్రిటిష్ హైకమిషనర్‌కు తరువాయి 2లో


రైతు సంక్షేమానికి రూ.2 కోట్లు విరాళం
సిఎం రేవంత్‌రెడ్డికి చెక్కు అందజేసిన మిర్యాలగూడ ఎమ్మెల్యే 03


ఎపిలో మద్యం స్కాం

## ఐదు రాష్ట్రాలలో ఇడి సోదాలు

హైదరాబాద్/అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ పరిపాలనాకాలంలో జరిగిన మద్యం అవినీతి కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఐదు రాష్ట్రాలలో సోదాలు చేసింది. రూ.3,500 కోట్ల మేరకు మద్యం అవినీతి జరిగిందని ఆనాడు తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో ధనాన్ని లెక్కల్లో చూపించకుండా అక్రమ మార్గాలలో తరించారన్న ఆరోపణలపై దర్యాప్తు సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తరువాయి 12లో

## హైదరాబాద్ ఇక యాప్ డిజైన్ లీడర్

- ప్రభుత్వం కృషి చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- 21వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ యూజర్ ఎక్స్‌పీరియన్స్- ప్రోడక్ట్ డిజైన్ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

యాప్ డిజైన్ లీడర్ గా హైదరాబాద్ ను నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. యుఎంఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హైటెక్ సిటీ లోని ట్రైడెంట్ హోటల్‌లో 'యుఎక్స్ ఇండియా 25' పేరిట ఏర్పాటు చేసిన 21వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ యూజర్ ఎక్స్పీరియన్స్ ప్రోడక్ట్ డిజైన్' ను ఐటి మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి లాంఛనంగా ప్రారంభించిన అనంతరం డిప్యూటీ సిఎం మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం ఎటువంటి టెక్నాలజీ నైనా అందిపుచ్చుకొని లీడర్ గా ఎదుగుతుంది అన్నారు. ఎఐ టెక్నాలజీకి హైదరాబాద్ మహానగరాన్ని గ్లోబల్ సెంటర్ గా నిలబెట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ పట్టుదలతో ఉందన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన ప్రతినిధులు హైదరాబాద్ వాతావరణం, సంస్కృతి, కళలు, ఆహారం అన్నిటిని ఆస్వాదించాలని, ప్రతినిధులు తరువాయి 2లో



## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో సత్తా చాటు



- ముందు నీ ఇంటినీ, పార్టీని చక్కబెట్టుకో
- ట్విట్టర్ టిల్లులా సొల్లు కబుర్లు వద్దు
- మూడున్నరేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల నాటికి నువ్వెక్కడుంటావో సందేహమే
- కెటిఆర్‌పై మంత్రి పొంగులేటి ఫైర్

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో దమ్ముంటే సత్తా చాటాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్‌కు సవాల్ విసిరారు. గురువారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌పార్టీ గద్దెను ఆవిష్కరించారు. పార్టీలో చేరిన పలు కుటుంబాలకు జెండా కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ముందు నీ ఇంటిని నీ పార్టీని చక్కబెట్టుకోవాలని అంతేగానే ట్విట్టర్ టిల్లులా సొల్లు మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. మూడున్నరేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో నువ్వు అమెరికాలో ఉంటావో? ఇండియాలో ఉంటావో? అన్నది కూడా రాష్ట్ర ప్రజలకు సందేహమేనన్నారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ తరువాయి 2లో



మావోయిస్టుల చర్చల ప్రతిపాదనపై

## కేంద్రం ఆలోచించాలి

కాల్పుల విరమణ ప్రకటించాలి
శాంతి చర్చల కమిటీ విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

"హింస రాజ్యాంగ విరుద్ధం. ప్రాణం తీయాలనడం రాజ్యాంగంలో ఎక్కడా లేదు. కేంద్ర ప్రభుత్వం కనీసం వంద రోజుల పాటు కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలకు అనువైన వాతావరణం కల్పించాలి. అప్పుడే ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలు కాపాడబడతాయి" అని శాంతి చర్చల కమిటీ కోరింది. హైదరాబాద్‌లో గురువారం మీడియాతో శాంతి చర్చల కమిటీ అధ్యక్షులు జస్టిస్ బి.చంద్రకుమార్, ఉపాధ్యక్షులు కందిమళ్ల ప్రతాప రెడ్డి, ప్రొఫెసర్‌లు జి.హరగోపాల్, అన్వర్‌ఖాన్ మాట్లాడారు. మావోయిస్టుల నుంచి చర్చల ప్రతిపాదన వచ్చినప్పుడు కేంద్రం ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. ఇరువైపుల ప్రాణనష్టం జరగకుండా కేంద్ర ప్రభుత్వం సాయుధ బలగాలను ఉపసంహరించుకుని మావోయిస్టులను చర్చలకు పిలువాలని, అప్పుడే ప్రజాస్వామిక వాతావరణం ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని విజ్ఞప్తి చేశారు. ఒక వైపు మావోయిస్టులు, మరోవైపు పోలీసుల మధ్య హింసకు, ప్రాణ నష్టానికి దారితీసిన పరిస్థితులలో పౌర సమాజం నిశ్శబ్దం వీడాలని వారు సూచించారు. రాజ్యాంగం జీవించే హక్కును అందరికీ ఇచ్చిందని, ఎవరి ప్రాణం కూడా చట్టవిరుద్ధంగా తీసేయడం సరి కాదన్నారు. శాంతిచర్చల సందర్భంగా తరువాయి 12లో

# కాలనీలా.. కాలువలా?

- భాగ్యనగరాన్ని ముంచెత్తిన భారీ వర్షం
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- నదులను తలపించిన రహదారులు
- భారీగా ట్రాఫిక్ జామ్
- అత్యధికంగా ముషీరాబాద్‌లో 19 సెం.మీ. వర్షపాతం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగరాన్ని వర్షం వీడటం లేదు. ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిగా నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి హైదరాబాద్ నగరాన్ని అల్లాకల్లోలం చేసిన వర్షం, వరదలు కాస్త విరామమిచ్చిందనుకునేలోపు గురువారం సాయంత్రం మళ్లీ భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి బల్కంపేట్ అండర్ గ్రౌండ్ రైల్వే బ్రిడ్జి దగ్గర వర్షపు నీటిలో పడి వాహనదారుడు మృతి తరువాయి 2లో

### మరో మూడురోజులు భారీ వర్షాలు



## విషజ్వరాల విజృంభణ



- ముంచుకొస్తున్న డెంగీ ముప్పు
- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- ఏజెన్సీ ప్రాంతాలలో మరింత తీవ్రం

ప్రజాపక్షం/హనుమకొండ

వర్షాకాలంలో సాధారణంగా వచ్చే సీజనల్ వ్యాధులకు తోడు ఈ ఏడాది విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గడిచిన కొద్ది రోజులుగా విష జ్వరాల కేసులు రోజురోజుకూ వందల సంఖ్యలో నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో విష జ్వరాలు సోకి మృత్యువాత పడుతున్నారు. డెంగీ,మలేరియాకు తోడు ప్రజలు విషజ్వరాల భారిన పడుతుండడంతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. వాతావరణ మార్పులతో విజృంభిస్తున్న విష జ్వరాలతో తరువాయి 2లో



ఫ్రాన్స్‌లో బడ్జెట్ కోతలపై

## జాతీయ సమ్మె

- దేశవ్యాప్తంగా పది లక్షలమంది ప్రదర్శనలు
- పలువురి అరెస్టు
- స్తంభించిన జనజీవనం

**పారిస్ :** ఫ్రాన్స్‌లో ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా బడ్జెట్‌లో కోతలు పెడుతున్న మేక్రాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గురువారం పలు కార్మిక సంఘాలు, ప్రజలు జాతీయ సమ్మె చేశారు. వామపక్షాలు సహా పలు ప్రతిపక్షాల కార్యకర్తలు వీధుల్లోకి వచ్చారు. పోలీసులు అనేకమందిని అరెస్టు చేశారు. 2023 జూన్ తర్వాత మళ్ళీ మొదటిసారి తొమ్మిది కార్మిక సంఘాలు ఐక్యంగా ఈ జాతీయసమ్మెలో పాల్గొన్నాయి. గడచిన 12 నెలలకాలంలో ముగ్గురు ప్రధానమంత్రులు రాజీనామా చేయడం ఫ్రాన్స్ ఆర్థిక సంక్షోభానికి ఒక అతిపెద్ద ఉదాహరణగా మారింది. దేశంలో తరచు ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలియజేస్తున్న తరుణంలో 2026 ప్రజావ్యతిరేక బడ్జెట్ ప్రతిపాదలను ప్రతిఘటిస్తున్న ఈ జాతీయసమ్మెకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. సంపన్నులపై భారీగా పన్నులు విధించాలని, ప్రజాసేవలపై వ్యయాలను గణనీయంగా పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పెన్షన్ సంస్కరణలను వెనక్కు మళ్ళించాలని డిమాండ్ చేస్తున్నారు. దక్షిణ ఫ్రాన్స్ మార్సియెల్లీలోని తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పెన్సిల్వేనియాలో ముగ్గురు పోలీసు అధికారుల కాల్చివేత

**హ్యారిస్‌బర్గ్ :** అమెరికా పెన్సిల్వేనియారాష్ట్రం స్ప్రింగ్ గ్రోవ్ టౌన్‌జిల్లాలో గురువారం ఉదయం ఒక గన్‌మన్ కాల్పుల్లో ముగ్గురు పోలీసు అధికారులు మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారిని తక్షణం మెడికల్ హెలికాప్టర్‌లో చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఉత్తర కోడోరస్ టౌన్‌షిప్ యోర్క్ కౌంటీ గ్రామీణ ప్రాంతంలోని స్కూలు సమీపంలో కాల్పులు జరిగాయి. స్కూలులో పిల్లలకు ఎలాంటి హానీ జరగలేదు. అధికారులు రంగంలోకి దిగి కాల్పుల ఘటనకు గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడికోసం గాలింపు మొదలెట్టారని పెన్సిల్వేనియా రాష్ట్ర పోలీస్ కమీషనర్ కల్నల్ క్రిస్టోఫర్ పారిస్ చెప్పారు. ఈ ఘటన గురించి తెలియగానే పెన్సిల్వేనియా గవర్నర్ జోష్ షాపిరో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గొప్ప సేవలు అందించే విలువైన అధికారులను తాము కోల్పోయామని ఆయన మృతులకు నివాళులు అర్పించారు. ఈ విధమైన సమాజాన్ని అమెరికా కోరుకోవడంలేదని, మరింత మేలైన, ఉత్తమ సమాజాన్ని పౌరులు కోరుకుంటున్నారన్నారు.

## దోహా దాడిలో తప్పించుకున్న హమాస్ నేత హమద్ బీరూట్‌లో ప్రత్యక్షం



**బీరూట్ :** దోహాలో ఈనెల తొమ్మిదోతేదీన ఇజ్రాయెల్ సైన్యం చేసిన బాంబు దాడులు విఫలమైన తర్వాత ఆ దాడుల నుండి తప్పించుకున్న హమాస్ సంస్థ సీనియర్ నాయకుడు ఘాజీహమద్ గురువారం బాహ్యప్రపంచానికి కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. బీరూట్‌లో అల్‌జజీరా న్యూస్ ఛానల్‌కు ఒక ఇంటర్వ్యూ ఇస్తూ, దోహాలో ఇజ్రాయెల్ సైన్యం బాంబు దాడులు చేసినప్పుడు చర్చలు జరిగిన భవంతిలో తాను ఉన్నానని ధృవీకరించి చెప్పారు. దోహాలో తమ ప్రయత్నం విఫలమైనప్పటికీ తర్వాత హమాస్ నాయకులు ఎక్కడ కనిపించినా మరో సందర్భంలో వారిని హతమారుస్తామని ఇజ్రాయెల్ సైన్యం ప్రతిజ్ఞ చేసింది. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందంపై ఆరోజు తాము గంటకుపైగా చర్చలు జరిపామని, ఆ తర్వాత తమకు సమీపంలోనే భారీ పేలుడు శబ్దాలు వినపడటంతో తామందరం అప్రమత్తమయ్యామని ఘాజీ హమద్ చెప్పారు. ఆ శబ్దాలు వినిపించిన వెంటనే తమకు అర్థమైందని, ఇజ్రాయెల్ తమపై దాడి చేసిందని గ్రహించి క్షణాల్లో ఆ ప్రాంతాన్ని ఖాళీచేసి వెళ్ళిపోయామని చెప్పారు. ఈ దాడుల్లో ఖతార్ ప్రభుత్వ అధికారులు సహా ఆరుగురు మరణించారు. ఈ దాడులను ఖతార్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. తమ దేశ సార్వభౌమాధికారాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని విమర్శించింది. అప్పటినుండి ఐక్యరాజ్యసమితి సహా అంతర్జాతీయ ప్రపంచం మద్దతును ఖతార్ కూడగడుతున్నది.

## షేక్ హసీనా ఓటుహక్కు
# జాతీయ గుర్తింపు కార్డులపై నిషేధం



**ఢాకా :** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా ఓటు హక్కును, ఆమెకు ఉన్న ఇతర జాతీయ గుర్తింపు కార్డులను ఆ దేశ ఎన్నికల సంఘం నిషేధించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి,మార్చి నెలల్లో బంగ్లాదేశ్‌లో 13వ పార్లమెంటుకు సార్వత్రిక ఎన్నికలకు సన్నాహాలు జరుగుతున్న తరుణంలో అమెను ఎన్నికల ప్రక్రియల నుండి నిషేధిస్తూ ఎన్నికల సంఘం గురువారం ఈ చర్యలు తీసుకుంది. నిర్వచన్ భవన్‌లో ఎన్నికల సంఘం కార్యదర్శి అఖ్తర్ అహ్మద్ పాత్రికేయులకు ఈ విషయం చెప్పారు. ఆమె (హసీనా) ఎఐడి (జాతీయ గుర్తింపు)ను స్తంభింపజేశామని చెప్పారు. ఆమె పేరు తప్ప ఇతర పేర్లు ఆయన వెల్లడించలేదు. ఐతే హసీనా చిన్న కుమార్తె షేక్ రెహానా, కుమారుడు సజీబ్ వాజెద్ జాయ్, మరో కుమార్తె సైమా వాజెడ్ పుతుల్‌లకు చెందిన గుర్తింపు కార్డులను కూడా నిషేధించినట్లు స్థానిక వార్తాసంస్థలు తెలిపాయి. రెహానా పిల్లలు ఇద్దరు, ఆమె మేనల్లుడు, మరిది, హసీనా మాజీ భద్రతాసలహాదారు మేజర్ జనరల్ తారిఖ్ అహ్మద్ సిద్ధిఖీ, ఆయన భార్య షాహిన్‌ల గుర్తింపు కార్డులపై కూడా నిషేధం విధించారు. గత ఏడాది ఆగస్టు ఐదో తేదీన పెల్లుబికిన ప్రజా ఉద్యమంలో హసీనా పదవి వదులుకుని భారత్‌కు వచ్చి తలదాచుకున్నారు.

**144 కొత్త పార్టీల దరఖాస్తు**

ప్రజాస్వామ్య ఉద్యమం తర్వాత బంగ్లాదేశ్‌లో గుర్తింపుకోసం కొత్తగా 144 రాజకీయపార్టీలు ఆ దేశ ఎన్నికల సంఘానికి దరఖాస్తులు పెట్టుకున్నాయి. తమ పార్టీ పేర్లు రిజిస్ట్రేషన్ చేయాలని అడుగుతున్నాయి. ఈ పార్టీలకు గుర్తింపు ఇవ్వాలా?వద్దా? అనే విషయంపై ఎన్నికల సంఘం వచ్చే వారం నిర్ణయం ప్రకటిస్తుందని ఇసి కార్యదర్శి అఖ్తర్ అహ్మద్ చెప్పారు. రాబోయే ఆదివారం,సోమవారాలలో జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని, ఇప్పటికే 22 రాజకీయపార్టీల పని విధానం గురించి సమాచారం సేకరించామని చెప్పారు. అదేవిధంగా బంగ్లాదేశ్ 13వ పార్లమెంటు ఎన్నికల నిమిత్తం ఓటర్ల తుది జాబితాను నవంబరు 18వ తేదీన విడుదల చేస్తామని కూడా ఆయన చెప్పారు. ముసాయిదా ఓటర్ల జాబితా నవంబరు ఒకటో తేదీన విడుదల చేస్తారు. గడచిన ఆగస్టునెలలో విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం బంగ్లాదేశ్‌లో 12.63 కోట్లమంది ఓటర్లు ఉండగా, 6.41 కోట్లమంది మగవారు, 6.22 కోట్లమంది మహిళలు ఉన్నారు. మరో 1,230 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు.

## గాజా నుండి వేలాదిగా కొనసాగుతున్న వలసలు
# 65వేలు దాటిన పాలస్తీనా మృతులు



**ఖాన్‌యూనిస్ :** గాజా సిటీ నుండి వేలాదిమంది ప్రజల వలసలు ఆగకుండా కొనసాగుతున్నాయి. ప్రధాన నగరం గాడిదలపై ఇంటి సామాను వేసుకుని నడచిదారిన కుటుంబాలు వెళ్ళిపోతున్నాయి. ఇప్పటికే మూడు లక్షలమంది గాజాను వదిలి వెళ్ళిపోయారు. ఇజ్రాయెల్ సైన్యం దాడుల నేపథ్యంలో ప్రజలు గాజా సిటీని ఖాళీ చేసి దక్షిణ ప్రాంతానికి వెళ్ళిపోవడానికి ఒక కొత్తదారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. మరో వైపు భూ,గగనతల,సముద్రతల మార్గాలలో దాడులను ఇజ్రాయెల్ ఉద్ధృతం చేసింది. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు, యుద్ధ ట్యాంకులు గగన,భూతల మార్గాలలో దాడులు విచ్చలవిడిగా కొనసాగిస్తున్నాయి. గురువారం తెల్లవారు జామునుండీ దాడుల్లో 29 మంది మరణించారు. ఒకవైపు అంతర్జాతీయంగా హెచ్చరికలు వస్తున్నప్పటికీ మరోవైపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కాగా గడచిన 24 గంటల్లో సరైన ఆహారం లేక నలుగురు పాలస్తీనియన్లు మరణించారు. 2023 అక్టోబరు 7వ తేదీ తర్వాత గాజాలో మొదలైన యుద్ధంలో ఇప్పటివరకూ 713 రోజుల్లో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 65,000 దాటిపోయింది. మరో 1.66 లక్షలమంది గాయపడ్డారు. యుద్ధవ్యూహంలో భాగంగా ప్రజలను ఆకలితో మాడ్చేసిఇజ్రాయెల్ విధానంవల్ల గడచిన మే నెల నుండి ఇప్పటివరకూ 425 మంది మరణించారు, వీరిలో 145 మంది పిల్లలు ఉన్నారు. గత జనవరినెలలో 45 రోజుల కాల్పుల విరమణ సందర్భంగా వేలాది మంది ప్రజలు గాజాలోకి ఇళ్లకు తిరిగి వచ్చారు. ఇప్పుడు మళ్ళీ వారు అనాథలయ్యారు. గాజాలో నేమన్, ఆయన భార్య మజీదాలు తమ ఆరుగురు కుమార్తెలతో, రెండేళ్ళ వయసుగల మనుమరాలితో రక్షణ ప్రదేశం లేక సమస్యల్లో ఉన్నారు. ఇలా ఎన్నో కుటుంబాలున్నాయి. ''మేం చనిపోయే అవకాశం ఉంది, చనిపోవచ్చు, మా చుట్టుపక్కల వాతావరణం అలాగే ఉంది, కానీ మేం ఏదో ఒక రక్షణ ప్రదేశంకోసం వెతుకుతున్నాం'' అని వారు చెప్పారు.

## రూ.4.87కోట్లు కాజేసిన నిందితుల అరెస్టు
### టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో బాధితునికి రూ.4.87 కోట్లు శఠగోపం పెట్టిన నలుగురు సైబర్ క్రైమ్ నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ ఒక ప్రకటనతో తెలిపారు. హస్తినాపురంకు చెందిన బాధితుడు ఒక ట్రేడింగ్ వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. తర్వాత సైబర్ నేరగాళ్లు పథకం ప్రకారం ఆ గ్రూప్‌లో https://m.ironfxsvip.vip అనే ఫ్రాడ్ అప్లికేషన్ ద్వారా పెట్టుబడులు పెట్టమని ప్రలోభ పెట్టారు. రెండు నెలల్లో బాధితుడు రూ.4,87,10,944లను సైబర్ క్రైమ్ నిందితుల ఖాతాలోకి మళ్లించాడు. ఆ అప్లికేషన్‌లో నకిలీ లాభాలను చూపిస్తూ మరిన్ని పేమెంట్లు చేయమని నిందితులు బాధితుడిపై ఒత్తిడి పెంచారు. దీంతో బాధితుడు అసలు విషయం తెలుసుకుని మోసపోయానని గ్రహించాడు. ఈ మేరకు టిజిఎస్‌సిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. డిఎస్‌పి కెవిఎం ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఇ. శ్రీను, ఎస్‌ఐ బి.రాము నాయక్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. ఈ మేరకు ఆరుగురు నిందితుల్లో జగద్గిరిగుట్టకు చెందిన టాక్సీ డ్రైవర్ మహ్మద్ మోహినుద్దీన్ షేక్ (29), కడపకు చెందిన క్యాబ్ డ్రైవర్ చిన్నం ఉగ్ర నర్సింహులు (29), గుంటూరుకు చెందిన క్యాబ్ డ్రైవర్ పసుపులేటి రాజేష్ (27), అమీర్‌పేట్‌కు చెందిన అకౌంట్ సప్లయర్ శివారెడ్డి (33)లను అరెస్టు చేశారు. వీరి నుంచి పది మొబైఫోన్లు, పది బ్యాంక్ పాస్‌బుక్‌లు, రెండు చెక్‌బుక్‌లు, పది క్రెడిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

## యాప్ డిజైన్ లీడర్
(మొదటి పేజీ తరువాయి)

ఈ రాష్ట్రంలో ప్రధానంగా టెక్నాలజీ రంగంలో గుర్తించిన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రతినిధులను కోరారు. డిజైన్ అనేది కేవలం అందానికి కాదు అది సామాజిక మార్పునకు ఆయుధం కావాలి అని ఉద్బోధ చేశారు. ఈ అంతర్జాతీయ సదస్సు హైదరాబాద్ చరిత్రలో ఒక మలుపు రాయి అన్నారు. తెలంగాణ రాష్ట్ర డిజిటల్ భవిష్యత్తును పరిపుష్టం చేయడంలో, మరో అడుగు ముందుకు వేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్లు మన జీవితాల్లో అనివార్యమైనవి, కానీ ఒక యాప్ యూజర్ ఫ్రెండ్లీగా ఉంటేనే అది విజయవంతం అవుతుంది అన్నారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ ఇంక్లూజన్ను ప్రోత్సహిస్తుంది, టిఎస్‌ఐపాస్ వంటి పాలసీల ద్వారా స్టార్టప్ లకు చేయూతనిస్తుంది అని త్వరలో 'సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఇన్ డిజైన్: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ ను గ్లోబల్ డిజైన్ హబ్ గా మార్చాలనే సంకల్పంతో త్వరలోనే 'సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఇన్ డిజైన్'ను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్ లాంటి సంస్థల ద్వారా తెలంగాణ ను ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న 'ఏఐ ఇన్నోవేషన్ హబ్ 'లో డిజైనింగ్ కు పెద్దపీట వేస్తున్నామన్నారు. డిజైనింగ్ అంటేనే సృజనాత్మకత అని, కాకపోతే... ఆది యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలన్నారు. అప్పుడే ఆ యాప్ లేదా వెబ్ సైట్ మనుగడ సాధ్యమన్నారు. ఈ ప్రక్రియలో ఏఐ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ వల్ల ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా చూడాలని సూచించారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే అంకుర సంస్థలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు.

పార్టీ చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పదేండ్లపాటు ప్రజల కలలను ఛిద్రము చేసిందని మండిపడ్డారు. వారి హయంలో ఒక లక్ష ఇళ్లు ప్రతి సంవత్సరం కట్టివుంటే పదిలక్షల పేద కుటుంబాలకు గూడు ఉండేదన్నారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళ్వేరంలాంటి ప్రాజెక్టుల కమిషన్లలో మునిగిపోయిందన్నారు. పాము కోరల్లో విషం ఉంటుందని, వీళ్లకు మాత్రం ఒంటి నిండ విషం ఉంటుందని ఘాటుగా విమర్శించారు. 10,15రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాబోతుందని, ప్రజలు బీఆర్‌ఎస్‌కు గట్టి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మీ అవినీతి,

## సత్తా చాటు
(మొదటి పేజీ తరువాయి)

అహంకర పాలనను చూసే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు పక్కకు పెట్టారని ఆ విషయాన్ని గుర్తెరిగితే మంచిదన్నారు. రాష్ట్రంలో పేదలకు ఇళ్లు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కాంగ్రెస్ పార్టీ వచ్చాకే జరుగుతున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి క్యాంప్‌కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, టీపీసీసీ రాష్ట్ర క్యాంపెనింగ్ కన్వీనర్ ధరావత్ రామ్మూర్తి నాయక్, మద్దులపలి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్, మద్ది మల్లారెడ్డి, బండి జగదీష్, మద్ది కిషోర్‌రెడ్డి, తిప్పని రాజశేఖర్‌రెడ్డి, తోట వీరభద్రం, ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, గొనే భుజంగరెడ్డి, వీరారెడ్డి, కందుకూరి వెంకటనారాయణ, పల్లెర్ల పాండయ్య, బానోత్ కిషోర్, దివ్య, హరి, బత్తిని యాలాద్రి, మార్కెట్ మారెమ్మగుడి డైరెక్టర్లు తేజావత్ పంతుల్‌నాయక్, భాస్కర్ నాయక్, చీకటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 'చెవెనింగ్' స్కాలర్‌షిఫ్
(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్‌లకు శిక్షణ అందించడానికి లిండీ కామెరాన్ సుముఖత వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలి**

మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తి పట్ల బ్రిటిషన్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ప్రధానంగా జిసిసి, ఫార్మా, నాలెడ్జ్ సెంటర్లు, వివిధ అకాడమీలకు సంబంధిత రంగాలలో పెట్టుబడులను ప్రోత్సహించాలని సిఎం చేసిన అభిప్రాయానికి కూడా బ్రిటిషన్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు.

## ఇసి రక్షణ
(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గం నుండి ఓట్లను తొలగించడానికి జరిగిన ప్రయత్నాల వివరాలను ఆయన ఉదహరించారు. ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి మోసపూరిత పద్ధతిలో ఓటర్లను చేర్చారని ఆరోపిస్తూ మహారాష్ట్రలోని రాజురా నియోజకవర్గంలో జరిగిన ఉదాహరణను కూడా వెల్లడించారు. ఇదే వ్యవస్థ ద్వారా కర్నాటకలోనే కాకుండా మహారాష్ట్ర, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో కూడా ఇదే పద్ధతి పాటించారని విమర్శించారు. వీటికి సంబంధించి తమ వద్ద రుజువులు ఉన్నాయన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిని మాదిరిగా సిఇసి జ్ఞానేష్ కుమార్ తన పని తాను చేయాలని, ఆధారాలను తప్పకుండా కర్నాటక సిఐడికి ఇవ్వాలన్నదే తమ డిమాండ్ అని రాహుల్ ఉద్ఘాటించారు. అలంద్ ఉదాహరణ గురించి మాట్లాడుతూ బలమైన కాంగ్రెస్ బూత్‌లే లక్ష్యంగా ఓటర్ల తొలగింపులు జరిగాయని మండిపడ్డారు. గరిష్టంగా తొలగింపులు జరిగిన టాప్ 10 బూత్‌లు కాంగ్రెస్‌కు బలమైన స్థానాలని, 2018లో 10 బూత్‌లలో ఎనిమిదింటిని కాంగ్రెస్ గెలుచుకుందన్నారు. ఇది యాదృచ్ఛికం కాదని, ప్రణాళికాబద్ధమైన ఆపరేషన్ అని ఆయన ఆరోపించారు. ఎన్నికలు ఎలా రిగ్గింగ్ చేయబడుతున్నాయో దేశంలోని యువతకు ప్రదర్శించడంలో ఇప్పుడు తాను వెల్లడించిన విషయాలు మరో మైలురాయి అని అన్నారు. సిఇసి జ్ఞానేష్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేయబోతున్నానన్నారు. ఈ విషయాన్ని తేలికగా చెప్పడం లేదని, తాను ఒక ప్రతిపక్షనేత అనిఅన్నారు. ఓటు వేసేవారిని, భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన ప్రజలను ఇసిసి రక్షిస్తోందని ఆరోపించారు. భారతదేశం అంతటా లక్షలాది మంది ఓటర్లను తొలగించేందుకు ఎవరో క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కర్ణాటకలోని అలంద్‌లో, ఎవరో 6,018 ఓట్లను తొలగించడానికి ప్రయత్నించారు, యాదృచ్ఛికంగా పట్టుబడ్డారు, కాంగ్రెస్ ఓటర్ల పేర్లు క్రమపద్ధతిలో తొలగించబడుతున్నాయన్నారు. తన అంకుల్ ఓటును తొలగించినట్లు ఓ బూత్ స్థాయి అధికారిణి గమనించారని, తమ పొరుగువాడే ఓటును తొలగించాడని గుర్తించారన్నారు. ఈ విషయమై తన పొరుగువాడిని ప్రశ్నించగా తనకు తెలియదని, వేరే ఏదో శక్తి ఈ ప్రక్రియను హైజాక్ చేసి ఓటును తొలగించారని తేలిందన్నారు. అదృష్టవశాత్తూ అది దొరికిపోయిందని రాహుల్‌గా పేర్కొన్నారు.

ఓటర్లుగా 6,018 దరఖాస్తులు దాఖలు చేయబడ్డాయని, ఈ దాఖలు కర్ణాటక వెలుపల నుండి మొబైల్ నంబర్‌లను ఉపయోగించి చేశారన్నారు. ఓటును తొలగించడానికి ప్రయత్నించిన ఓటరును, తొలగింపును పూర్తి చేయడానికి పేరు ఉపయోగించిన వ్యక్తిని కూడా గాంధీ వేదికపైకి పిలిచారు. ఇద్దరూ దాని గురించి తమకు తెలియదని ఖండించారు. సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఓటర్లను తొలగిస్తున్నారని, ఈ విషయమైన కర్నాటకలో దర్యాప్తు కొనసాగుతోందని, సిఐడి 18 నెలల్లో ఎన్నికల కమిషన్‌కు 18 లేఖలు పంపిందని,ఈ దరఖాస్తులు ఎక్కడ నింపబడ్డాయో ఐపి, ఒటిపి ట్రయల్స్ వంటి కొన్ని సాధారణ విషయాలను కోరిందని గాంధీ చెప్పారు. అయితే ఎన్నికల సంఘం ఇవ్వడం లేదన్నారు. ఎందుకంటే ఈ ఆపరేషన్ ఎక్కడి నుంచి జరిగింతే తమకు తెలుస్తుందని భయపడుతున్నారన్నారు. ఇలా చేస్తున్న వారిని జ్ఞానేష్ కుమార్ రక్షిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలా చేస్తున్నది ఎవరు చేస్తున్నారో ఇసికి తెలుసు.

ఇదే విషయాన్ని భారతదేశంలోని ప్రతి యువకుడు తెలుసుకోవాలని కోరుకుంటున్నానన్నారు. కాంగ్రెస్ నాయకుడు తన పార్టీ నిర్వహిస్తున్న 'ఓటు చోరీ'పై పరిశోధన, ప్రజెంటేషన్లకు రెండు మూడు నెలలు పడుతుందని అన్నారు.

## విషజ్వరాల విజృంభణ
(మొదటి పేజీ తరువాయి)



ప్రతి ఆసుపత్రిలో ఓపి పేషెంట్ల సంఖ్య 25 నుండి 30 శాతం పెరిగింది.వరుసగా భారీ వర్షాలు కురియడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు పెరగడం,నీరునిల్వ ఉండడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో ఈగలు,దోమలు పెరిగి ప్రజలు రోగాల భారిన పడుతున్నారు.దీంతో జ్వర పీడితులు ప్రభుత్వ,ప్రైవేటు ఆసుపత్రుల బాట పడుతున్నారు.ఈ క్రమంలో ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్ ఎంజీఎం ఆసుపత్రితో పాటు ఆయ జిల్లాలలోని ఏరియా ఆసుపత్రులకు ప్రజలు క్యూకడుతున్నారు.మరి కొంత మంది ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేటు ఆసుపత్రులలో చేరి వైద్యం చేయించుకుంటున్నారు.ఒక్క వరంగల్ ఎంజీఎం లోనే రోజుకు వందల సంఖ్యలో రోగులు ఔట్ పేషెంట్లుగా పరీక్షలు చేయించుకుంటున్నారు.వారిలో ఇటీవల సీజనల్ వ్యాదులకు వచ్చిన వారిలో కొందరు డెంగీ భారిన పడగా మరో 24 మంది మలేరియా భారిన పడినట్లు ఎంజీఎం ఆసుపత్రి సూపరిండెంట్ తెలిపారు. డెంగీ,మలేరియా భారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో ఇప్పటికే దాదాపు 200 పడకలను సిద్ధం చేయగా మరో 100 పడకలను పెంచి మొత్తం 300 పడకలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. కాగా డెంగీ, మలేరియా వ్యాది భారిన పడిన పేషెంట్లను అవసరమైన చికిత్స షందించడంతో పాటు డెంగీ భారిన పడ్డ వారికి ప్లేట్‌లెట్స్ తగ్గుతే అలాంటి వారికి 50 వరకు ప్లేట్‌లెట్‌లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

**ఇంటింటికీ జ్వర పీడితులే**

ప్రస్తుత వాతావరణంలో జిల్లాలో ఇంటింటికీ జ్వర పీడితులే అన్నట్లుగా విషజ్వరాలు పరిస్థితి నెలకొంది.ఈ వర్షాకాల సీజన్‌లో గత ఏడాదికి మించి కేసులు నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా కురిసిన వర్షాలతో ముందు ముందు కేసులు పెరగవచ్చునని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు చెపుతున్నారు. ముఖ్యంగా ప్రజలను వణికిస్తున్న డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులలో పెరుగుదల కనిపిస్తున్నది. హనుమ కొండ జిల్లాలో గత ఏడాది జనవరి నుండి డిసెంబర్ వరకు 43 డెంగీ కేసులు, 12 మలేరియా కేసులు నమోదవగా నమోదయ్యాయి. వరంగల్ జిల్లాలో 73 డెంగీ కేసులు, 4 మలేరియా కేసులు నమోదవడం జరిగింది. పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల లోనే ఎక్కువగా ఈ కేసులు నమోదవుతున్నాయి.

**డెంగీతోనే ఎక్కువ ప్రమాదం**

డెంగీ కేసులు పెరుగుతున్న నేపద్యంలో డెంగీ లక్షణాలు ఉంటే అప్రమత్తం కావాలని జిల్లా వైద్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, కళ్లనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పి, రుచిని కోల్పోవడం, జలుబు, వాంతులు వంటివి డెంగీ లక్షణాలుగా గుర్తించి అప్రమత్తం కావాలని వారు సూచిస్తున్నారు. డెంగీ నిర్ధారణ కోసం విధిగా ఐజిఎం పరీక్ష చేయించు కోవాలని, కేవలం ప్లేట్ లెట్ కౌంట్, డెంగీ స్ట్రిప్ టెస్ట్,సీరమ్ టెస్ట్ వంటి వాటితో దీనిని నిర్ధారించడం శాస్త్రీయం కాదని చెబుతున్నారు. డెంగీ రాగానే డాక్టర్‌ల సూచన మేరకు అవసరమైన జగ్రత్తలు తీసుకోవాలని,ప్లేట్ లెట్ కౌంట్ 50 వేల లోపు పడిపోతేనే ప్లేట్ లెట్‌లు ఎక్కించు కోవాలని సూచిస్తు న్నారు.

## కాలనీలా.. కాలువలా?
(మొదటి పేజీ తరువాయి)

చెందాడు. అంబర్‌పేటలో వరద పోటెత్తండంతో బైకులు వరదలో కొట్టుకుపోయాయి. బాగ్‌లింగంపల్లి శ్రీరాంనగర్ బస్తీ వరదనీటిలో చిక్కుకుంది. చిక్కడపల్లిలో నూ లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. ఆదివారం కురిసిన వర్షానికి ముగ్గురు వ్యక్తులు నాలాల్లో పడి గల్లంతు కాగా, అఫ్జల్‌సాగర్‌లో పడిపోయిన అర్జున్ అనే యువకుడిని 85 కిలోమీటర్ల సంగం దగ్గర మృతిదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరి అచూకి ఇప్పటికీ లభించలేదు. వరుస వర్షాలు హైదరాబాద్ నగర వాసులకు భీకర పరిస్థితులు చూపిస్తున్నాయి. గురువారం సాయంత్రం నగరంలో మరోసారి భారీ వర్షం కురిసింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా వర్షం దంచికొట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. రదహదారులను వరదనీరు ముంచేత్తడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షంతో స్కూళ్లు, కళాశాలలు, కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడి అవస్థలు ఎదుర్కున్నారు. నగర వ్యాప్తంగా ఎక్కడ చూసిన వరదనీటితో ట్రాఫిక్ స్తంభించిపోయిన దృశ్యా లే కనిపించాయి. ఐటీ కారిడార్‌తో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. జిహెచ్‌ఎంసి, హైడ్రా యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టాయి. మోటర్లతో రోడ్లపై నిలిచిన వరదనీటిని తొలగింపు చర్యలు చేపట్టారు.

**నదులను తలపించిన రహదారులు..**

విస్తారంగా కురుస్తున్న వానలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరదనీటితో రోడ్లు నదులను తలపించాయి. రహదారులు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంజాగుట్ట మోడల్ హౌస్ ముందు రహదారి చెరువులా మారిపోయింది. మోకాలి లోతు నీరు రావడంతో వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమాజిగూడ సర్కిల్‌కు ఎగువ నుంచి



భారీగా వర్షపు నీరు వరదలా వస్తోంది. దీంతో ఖైరతాబాద్, సోమాజిగూడ ప్రాంతాల్లో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. హిమాయత్ నగర్ ఉర్దు గల్లీ సమీపంలో ప్రధాన రహదారిపై వరదనీరు పోటేత్తడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ట్రాఫిక్‌ను క్రమబద్దీకరిస్తూ, రాత్రి వరకు శ్రమించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, శ్రీనగర్‌కాలనీ, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట, బోరబండ, చార్మినార్, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర, ఫలక్ నుమా, బార్కస్, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్.బి.నగర్, ఉప్పల్, తార్నాక, సికింద్రాబాద్, ముషీరాబాద్, నారాయణగూడ, హిమాయత్ నగర్, లబిర్టీ, ఖైరతాబాద్, లక్డీకాపూల్, పంజాగుట్ట ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మరోవైపు సుచిత్ర, కొంపల్లి, గండిమైసమ్మ, దుండిగల్, గుండ్లపోచంపల్లి, సూరారం, జీడిమెట్ల, చింతల్, షాపూర్ నగర్, గాజుల రామారం, జగద్గిరిగుట్ట, బాలానగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

**అత్యధికంగా ముషీరాబాద్‌లో 19 సెం.మీ వర్షపాతం..**

అత్యధికంగా ముషీరాబాద్‌లో 19 సెం. మీ వర్షపాతం నమోదైంది. క్లౌడ్‌బరస్ట్‌ను తలపించేలా కురిసిన వర్షానికి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. రోడ్లపై భారీగా నీరు నిలువడంతో ట్రాఫిక్ స్తంభించింది. చిలకలగూడలో 14.7, మోండా మార్కెట్‌లో 14.6, హెచ్‌సియులో 14.4, బేగంపేట్‌లో 13.5, లిం గంపల్లిలో 13, ఖైరతాబాద్‌లో 12.5, శ్రీ నగర్ కాలనీ 11.1, షేక్‌పేట్‌లో 10.8, చందానగర్‌లో 10.2, కాప్రాలో 9.4, బిహెచ్‌ఎల్‌లో 8.8, కూకట్‌పల్లిలో 9.5, మూసాపేట్ లో 8.6, సెంటీ మీటర్ల వర్షపాతం నమోదై నట్లు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్‌లో మరోసారి భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జిహెచ్‌ఎంసి, హైడ్రా, పోలీస్, విద్యుత్ వివిధ విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3రోజుల్లో పడాల్సిన వర్షం 30 నిమిషాల్లోనే తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కుంభవృష్టి పడుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అత్యవసరమైతేనే ఇళ్లలో నుండి బయటకు రావాలని నగర ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరుతున్న ప్రాంతాల్లో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఎక్కడ ఇబ్బందులు ఉన్న వెంటనే స్పందించాలన్నారు. మ్యాన్ హోల్ వద్ద జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



**మరో మూడురోజులు భారీ వర్షాలు**

రాష్ట్రంలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు సగటున సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించిందని ఉందని తెలిపారు. మధ్యప్రదేశ్ మధ్య ప్రాంతాల నుంచి పశ్చిమమధ్య ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతం వరకు తూర్పు విదర్భ, తెలంగాణ, దక్షిణ తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతుందన్నారు. దీని ప్రభావంతో గురువారం సూర్యాపేట, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. శుక్ర, శనివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని చెప్పారు. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట, హైదరాబాద్, పలు పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ముషిరాబాద్ పరిధిలోని భోలక్‌పూర్‌లో 15.5 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆలమట్టిపై కర్నాటక దూకుడును రేవంత్ రెడ్డి అడ్డుకోవాలి : వినోద్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆలమట్టి ఎత్తు పెంచే విషయమై సుప్రీం కోర్టు స్టే పెండింగ్‌లో ఉండగానే ఆలమట్టి ఎత్తును పెంచేందుకు కర్నాటక ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిపైన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఆలమట్టి ప్రాజెక్టు విస్తరణ కోసం లక్షా 33 వేల ఎకరాల భూ సేకరణ చేపట్టాలని కర్నాటక మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయించిందన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ భూ సేకరణ కోసం రెండేళ్లలో రూ.70వేల కోట్లను ఖర్చుపెట్టాలని కర్నాటక లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆలమట్టిపైన కర్నాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీసుకుని రెండు రోజులు అవుతున్నప్పటికీ సిఎం రేవంత్ రెడ్డి ఇంకా స్పందించలేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ పి.శశిధర్ రెడ్డి, బిఆర్‌ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు సి.కళ్యాణ్ రావు, లలిత రెడ్డి పాల్గొన్నారు



## రైతుల సంక్షేమానికి రూ.2కోట్లు విరాళం

ప్రజాపక్షం/హైదరాబాద్ : మిర్యాలగూడ ఎంఎల్‌ఎ బత్తుల లక్ష్మారెడ్డి తన కుమారుడి వివాహ విందును రద్దు చేసి అందుకు సంబంధించిన రూ.2కోట్లను తన నియోజకవర్గంలోని రైతుల సంక్షేమానికి ఖర్చు చేసేందుకు ప్రభుత్వానికి అందజేశారు. ఇందుకు సంబంధించిన రూ.2కోట్ల చెక్కును ఎంఎల్‌ఎ బత్తుల లక్ష్మారెడ్డి, ఆయన కుమారుడు సాయి ప్రసన్న, కోడలు వెన్నెల ఇతర కుటుంబ సభ్యులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అందజేశారు. ఎంఎల్‌ఎ లక్ష్మారెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. రూ.2కోట్లను తన నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలని, లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందజేయాలని ఎంఎల్‌ఎ లక్ష్మారెడ్డి సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. మిర్యాలగూడ లో భారీ ఎత్తున తన కుమారుడి రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎంఎల్‌ఎ లక్ష్మారెడ్డి భావించారు. అయితే రిసెప్షన్‌ను రద్దు చేసుకుని ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేయడానికి ఎంఎల్‌ఎ ముందుకు వచ్చారు.

# డ్రగ్స్ నివారణ అందరి బాధ్యత

### మంత్రి జూపల్లి కృష్ణ రావు





ప్రజాపక్షం/హైదరాబాద్: యువత జీవితాలకు ప్రమాదకరంగా మారిన మాదకద్రవ్యాల నివారణ సమాజంలో అందరి బాధ్యత అని రాష్ట్ర పర్యాటక, ఆబ్కారీ, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా నాట్యమండలి గురువారం హిమాయత్ నగర్ మఖ్దూమ్ భవన్‌లో నిర్వహించిన మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళారూపాల వర్క్‌షాప్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజానాట్యమండలి నాటక బృందం మాదకద్రవ్యాల నివారణ మరియు అవగాహన కల్పించడానికి రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల వద్ద తమ కళారూపాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. మాదకద్రవ్య దుర్వినియోగం యొక్క హానికరమైన ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఈ సమస్యను ఎదుర్కోవడంలో కళాకారులూ కీలకపాత్ర పోషించాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని వసతులు, సౌకర్యాలతో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. దీనిపైనా ప్రజలలో చైతన్యం కల్పించే దిశగా వీధినాటకాలను, కళారూపాలను ప్రదర్శించాలని తెలంగాణ ప్రజానాట్య మండలి కళాకారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, ప్రభుత్వ వైద్యంపై ముఖ్యమంత్రి రేవంతారెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని అన్నారు. ప్రజలు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పుల పాలు కావద్దని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలని కోరారు. అంతకు ముందు ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన ''ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దురా'', ''కార్పొరేట్ వద్దురా ప్రభుత్వ ఆసుపత్రులు ముద్దురా'' అనే రెండు వీధి నాటకాలను మంత్రి జూపల్లి కృష్ణారావు తిలకించి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహామండలి సభ్యులు పల్లె నరసింహ ఆధ్వర్యంలో కళారూప ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, సమితి సభ్యుడు మరుపాక అనిల్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కె.లక్ష్మీ నారాయణ, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహా మండలి సభ్యుడు పల్లె నరసింహతోపాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.

## మంథనిలో సిబిఐ విచారణ

### అడ్వకేట్ దంపతుల హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన బృందం

### తండ్రి నుంచి వివరాల సేకరణ

పెద్దపల్లి/ప్రజాపక్షం : అడ్వకేట్ గట్టు వామన్‌రావు దంపతుల జంట హత్య దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సిబిఐకి అప్పగించిన విషయం అందరికీ తెలిసిందే. అడ్వకేట్ వామన్‌రావు దంపతుల హత్య కేసులో సిబిఐ విచారణ ప్రారంభమైంది. గురువారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు విచారణ చేపట్టారు. హైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్‌రావు దంపతుల హత్య కేసులో ఏడుగురు నిందితులు బెయిల్‌పై ఉన్నారు. వామన్‌రావు దంపతుల హత్య కేసులో మాజీ ఎమ్మెల్యే హస్తం ఉందని తండ్రి కిషన్‌రావు ఆరోపణల నేపథ్యంలో సిబిఐ అధికారులు విచారణ ప్రారంభించారు. అనంతరం మంథని కోర్టు ప్రాంగణంలో వామన్ రావు తండ్రి కిషన్ రావు, వామన్‌రావు తమ్ముడు చంద్రశేఖర్ నుంచి వివరాలను సిబిఐ అధికారులు సేకరించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని సిబిఐ బృందం పరిశీలించింది. మంథనికి సిబిఐ ఎంట్రీ ఇవ్వడంతో ఏం జరుగుతుందోనని రాష్టం, జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.



# భూస్వామ్య వ్యవస్థకు పరాకాష్ఠ విడిసిలు

### రాజ్యాంగ విరుద్ధమైన విడిసిలను రద్దు చేయాలి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/హైదరాబాద్ : భూస్వామ్య వ్యవస్థకు పరాకాష్ట గ్రామ అభివృద్ధి కమిటీ (విడిసి)లు అని, విడిసిల పేరుతో ఆధిపత్య కులాల దాడులను అరికట్టాలని వ్యవహరిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన విడిసిలను రద్దు చేయాలని ఆయన కోరారు. విడిసిల బాధితులను త్వరలోనే కలిసి నిజామాబాద్‌లో ఉన్న విడిసిల బాధితులకు అండగా ఉంటామని, విడిసిల చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి పూర్తి భరోసాను సిపిఐ అందిస్తుందని ఆయన తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాలో విడిసిల దౌర్జన్యాలు, వారు చేస్తున్న దాడుల పట్ల అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆయన విమర్శించారు. విడిసిల పేరుతో ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలలో ఊరూర ఆగడాలు, అరాచకాలు ఆగడంలేదన్నారు. పిప్రీ, జక్రంపల్లి, కొలిపాక్, రామన్నపేట, దేగాం, సావెల్, చెంగల్, గుమ్మిర్యాల్, దొంచంద తదితర అనేక గ్రామాల్లో విడిసిల చర్యలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. కుల వృత్తులపై, ఇతర ఉత్పత్తి కులాలపై దాడులు, సాంఘిక బహిష్కరణలు, వెలివేతలు చేయడం అత్యంత దారుణమన్నారు. బిసి వృత్తి దారులైన గౌడ (గీతా కార్మిక వృత్తి), గంగపుత్ర (మత్స్యకార వృత్తి), రజక (దోబి), నాయి బ్రహ్మణ (మంగలి), యాదవ (గొర్ల కాపరి), అరె కటిక, ముదిరాజ్, మాదిగ, ఎంబిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి తదితర కులాలపై విడిసిలు దాష్టీకాలు చేస్తూ వృత్తిదారుల వృత్తి చేసుకున్నందుకు లక్షల రూపాయలు బలవంతంగా వసూలు చేస్తున్నవారిపై అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. విడిసిలు అడిగినంత సొమ్మును ఇవ్వనట్లయితే వారిపై ద్వేషాన్ని పెంచుకుని వారిని గ్రామం నుంచి సాంఘిక బహిష్కరణకు గురిచేస్తున్నారని తెలిపారు.

దేశ పౌరుల ప్రాథమిక హక్కులను, భారత రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నా కనీసం అధికార యంత్రాంగం స్పందించకపోవడం అత్యంత విచారకరమన్నారు. భారత రాజ్యాంగాన్ని కాలరాస్తూ విడిసి పేరుతో సమాంతర వ్యవస్థలను నడుపుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విడిసిలలో ఉన్న మిగతా కులాలు స్వచ్ఛందంగా బయటకి రావాలని యన కోరారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా, ఏర్గట్ల మండలం, తాళ్ళరాంపూర్ గ్రామంలో గీత వృత్తిదారులైన గౌడ, మాల కులస్తులను 'అర్థాల్' (ఉర్దూ పదం) పేరుతో లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని, వారి సొంత వ్యవసాయక్షేత్రాల్లో పెంచుకుంటున్న గీత వనంలోని కల్లును తాగరాదని నిషేధం విధించారని, కల్లు తాగిన వారికి జరిమానా విధించారని ఆయన వివరించారు. తాజాగా విడిసిల మాట వినలేదని, వారు అడిగిన డబ్బు ఇవ్వలేదని ద్వేషంతో శ్రీరాముని గుడిలో గౌడ కులస్తుల ఆడబిడ్డలు శ్రీరామనవమి సందర్భంగా కుంకుమార్చన చేస్తున్న సందర్భంలో వారిని గుడిలో నుండి వెలివేశారని సత్యం తెలిపారు. అంతటితో ఆగకుండా గీత వనాన్ని (ఈత, తాటి వనాన్ని) మొత్తం కాల్చి వేసి వారి జీవనాధారం లేకుండా చేశారని, ఇటీవల గౌడ సంఘంపై దాడికి పాల్పడ్డారని, ఈ విషయంలో వారి అహంకార ధోరణి పరాకాష్టగా మారిందన్నారు.

ఈ క్రమంలో 53 గౌడ కులస్తులు, 7 ఎస్‌సి కులస్తుల కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేశారని తెలిపారు. ఇప్పటికైనా విడిసిలలో ఉండే ఆధిపత్య కులాలు ఇతర కులాలపై చేస్తున్న దాడి, దౌర్జన్యాలను మానుకోవాలని నెల్లికంటి సత్యం హెచ్చరించారు.

# వైద్య విద్యపై ప్రభుత్వం దృష్టి సారించాలి

### ప్రభుత్వ హాస్పిటల్స్‌ను బలోపేతం చేస్తే.. ప్రైవేట్ హాస్పిటల్‌కు ఆరోగ్యశ్రీ నిధులను ఇవ్వాల్సిన అవసరం ఉండదు

### నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో గుత్తా 'చిట్ చాట్'



ప్రజాపక్షం/నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిట్ చాట్ కార్యక్రమంలో గుత్తా మాట్లాడుతూ వైద్యరంగానికి ప్రభుత్వం ప్రతి ఏటా దాదాపు 1200 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. ఆరోగ్యశ్రీ, సిఎంఆర్‌ఎఫ్ పథకాలపై మరోసారి సమీక్ష నిర్వహించాలన్నారు. గతంలో ప్రభుత్వ వైద్య వసతులు తక్కువగా ఉండటం కారణంగా పేదలకు ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స కోసం ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. కానీ నేడు తెలంగాణలోని 32 జిల్లాల్లో ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్మించడం జరుగుతుందని అదేవిధంగా హైదరాబాద్ పట్టణంలో మరో నాలుగు పెద్ద ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఈ ప్రభుత్వ హాస్పిటల్స్‌ని అభివృద్ధి చేసి ఆయా హాస్పిటల్స్‌లో పనిచేసే డాక్టర్లకు ప్రోత్సహకాలు ఇచ్చి, మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్ మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల్లోని హాస్పిటల్స్‌ని బలోపేతం చేయాలన్నారు. ప్రైవేట్ హాస్పిటల్‌కి ఆరోగ్యశ్రీ నిధులను ఇవ్వాల్సిన అవసరం అప్పుడు ఉండదని, ఈ నిధులను ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి వినియోగిస్తే బాగుంటుంది అని తన అభిప్రాయమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కూడా ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ స్కూల్స్, కాలేజీలు, ప్రభుత్వ విద్యాసంస్థలు మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో, ప్రభుత్వ విద్యా సంస్థలలో పని చేసే ఉద్యోగులు బాధ్యతాయుతంగా తమ కర్తవ్యాలను నిర్వర్తించాలని కోరారు. ఎమోషనల్‌గా ఉన్నపరిస్థితుల్లో కవిత తన శాసనమండలి సభ్యత్వాన్నిరద్దు చేయాలని తనకు లేఖ పంపించారని చెప్పారు. మానసికంగా ఒత్తిడి ఉన్నకారణంగా పంపించిన రాజీనామా లేఖపై పునరాలోచించుకోవాలని తాను సూచించినట్లు చెప్పారు.

## ఒయు ప్రొఫెసర్ల పదోన్నతులలో పారదర్శకత

### ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి నెల్లిసత్య

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ (ఒయు) ప్రొఫెసర్ల పదోన్నతులలో పారదర్శకత పాటించాలని, గతంలో జరిగిన అక్రమాలపై ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ తిరుపతి రావు కమిటీ రిపోర్టును బహిర్గతం చేయాలని ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి నెల్లిసత్య డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిబంధనల ప్రకారం సిఎఎస్ (కెరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం ) ద్వారా ఆయా యూనివర్సిటీలు ప్రొఫెసర్ల పదోన్నతులు చేపట్టవచ్చన్నారు. ఈ నెల సెప్టెంబర్ 16 నుండి అసిస్టెంట్ ప్రొఫెసర్ నుండి అసోసియేట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ నుండి ప్రొఫెసర్ అలాగే ప్రొఫెసర్ నుండి సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులకు ఇంటర్వ్యూల ప్రక్రియ కొనసాగుతున్నాయని, వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని, గత తరహా అక్రమాలు జరగకుండా, నాణ్యమైన పరిశోధనలు చేసి, అర్హులైన వారికి పక్షపాత ధోరణి లేకుండా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పదోన్నతుల విషయంలో గతంలో జరిగిన అక్రమాలపైన ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నత విద్యను ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, లేదంటే యూనివర్సిటీకి వివిధ పరిశోధన సంస్థల నుంచి వచ్చే రీసర్చ్ గ్రాంట్స్ కోల్పోయే ప్రమాదం ఉంటుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని లెనిన్, నెల్లిసత్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మీడియా సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు అశ్వన్, రమేష్,సుమన్, హరీష్ పాల్గొన్నారు..





## తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మ

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ పండుగ అని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపి హనుమంతరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ శ్రేణులు ఎంగిలి పువ్వు నుండి సద్దుల బతుకమ్మ వరకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్ళాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో కొందరు బతుకమ్మను రాజకీయం చేశారని, రకరకాల పాటలతో బతుకమ్మ ను రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. నిజానికి ఇది తెలంగాణ పండుగ... తెలంగాణ సంప్రదాయం అని మరోసారి గుర్తుచేశారు. బతుకమ్మ పండుగలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా జరుపుకోవాలన్నారు. బతుకమ్మ కుంటను కాపాడటంలో రేవంత్ రెడ్డి, హనుమంతు రావు పాత్ర కీలకం అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ పూల పండుగ మాత్రమే కాదు , ఆడబిడ్డలను గౌరవించుకునే పండుగ అని అన్నారు. బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి, ప్రత్యేక సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీక అన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా గౌరవిస్తుందన్నారు. ప్రకృతితో మమేకమైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని బతుకమ్మ పండుగను మరోసారి విశ్వ వ్యాప్తంగా చాటాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. సెప్టెంబర్ 21 తేదీ నుంచి 30 వరకు జరిగే వేడుకల్లో మహిళంతా పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ స్ఫూర్తిని మరోసారి లోకానికి చాటాలన్నారు.

**30 ఏళ్లుగా బతుకమ్మ కుంటలో ఆడకుండా చేశారు**

**మాజీ ఎంపి హనుమంతరావు**

బతుకమ్మ కుంటలో 30 ఏళ్లుగా బతుకమ్మ ఆడకుండా చేశారని..గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయంలో ఎంతోమందిని అడిగినా పట్టించుకోలేదని మాజీ ఎంపి హనుమంతరావు అన్నారు. కవిత ఎక్కడో విదేశాల్లో ఆడుతది...కానీ బతుకమ్మకుంట రాలేదని ఎద్దేవ చేశారు. బిఆర్‌ఎస్ పార్టీ నాయకుడు బతుకమ్మకుంటను కబ్జా చేశాడని ఆరోపించారు.

# 42% బిసి రిజర్వేషన్ తర్వాతే ఎన్నికలు నిర్వహిస్తాం

### యూరియా కొరత సృష్టించేది బిఆర్‌ఎస్, బిజెపి

### సోషల్ మీడియా వేదికగా బిఆర్‌ఎస్ విమర్శలు : వైరాలో మంత్రి సీతక్క



ప్రజాపక్షం/వైరా : తెలంగాణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్, బిజెపి కుమ్మక్కై పనిచేస్తున్నారని వారు యూరియా కొరత సృష్టిస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గురువారం సత్తుపల్లి నుంచి హైదరాబాద్ వెళుతున్న సీతక్క మార్గమధ్యంలో వైరాలోని కాంగ్రెస్ నాయకుడు చెరుకూరి కిరణ్ ఇంట్లో తేనేటి విందుకు మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాట ఇచ్చిన ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం 42% బిసి రిజర్వేషన్ ఇచ్చి పంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికల తమను అన్నారు. టిఆర్‌ఎస్ నాయకులు యూరియా కొరతను సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నారని ప్రజలు వారి మాటలు నమ్మవద్దని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై సోషల్ మీడియా, యూట్యూబ్లను వాడుకొని బిఆర్‌ఎస్ నేతలు అబద్ధపు ప్రచారాలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హుందాతనంగా ప్రతిపక్షం బిఆర్‌ఎస్ నేతలు వ్యవహరించడంలేదని ధ్వజమెత్తారు. బిఆర్‌ఎస్ పదేళ్ల హయాంలో పేద ప్రజల ఆత్మగౌరవమైన రేషన్‌కార్డును ఒక్కరికీ కూడా ఇవ్వని వాళ్లు యూరియాను అడ్డుపెట్టుకొని డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి యూరియా కేటాయింపులు కేంద్రం నుంచి రావాల్సిందనే విషయం ప్రజలందరికీ తెలుసని చెప్పారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిఆర్‌ఎస్ కుమ్మక్కై కావాలనే యూరియా కొరత సృష్టిస్తున్నాయని ఆరోపించారు. యూరియా కొరత అంశాన్ని కాంగ్రెస్ పార్టీపై నెపలంగా మోపి రైతుల్లో ప్రజల్లో వ్యతిరేకత తీసుకురావాలని, బిజెపి, బిఆర్‌ఎస్ కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని స్పష్టం చేశారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సిరెడ్డి, చెరుకూరి కిరణ్, జవ్వాజి నాగరాజు, సూర్యదేవర శ్రీధర్, మరికంటి శివ, బోళ్ల గంగారావు, కర్నాటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# రైల్ టికెట్‌కు ఇక 'క్యూ' అక్కర్లేదు



### యూటిఎస్ మొబైల్ యాప్ ద్వారా టికెట్లు జారీ

### ద.మ.రైల్వే చీఫ్ పిఆర్ఒ ఎ.శ్రీధర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : వరుస పండగల సీజన్‌తో రైల్వే స్టేషన్‌లలో క్యూలో నిలబడి అన్‌రిజర్వ్ టిక్కెట్లను కొనాల్సిన పనిలేదు. వారి సౌకర్యార్థం రైల్వే శాఖ కొత్త విధానాన్ని గురువారం నుంచి ప్రవేశపెట్టింది. ఇందుకు సంబంధించిన వివరాలను దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పిఆర్ఒ ఎ.శ్రీధర్ వెల్లడించారు.యూటిఎస్ మొబైల్ యాప్ ద్వారా రైల్వే టికెట్లు క్షణాల్లో ఖరీదు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం రైల్వే స్టేషన్ ఆవరణలో ఎంపిక చేయబడిన వ్యక్తులు ధరించిన జాకెట్ల వెనుక భాగంలో ముద్రించబడిన క్యూ.ఆర్ కోడ్‌ను 'యూ.టి.ఎస్ ' యాప్ తో స్కాన్ చేయడం ద్వారా జనరల్ టిక్కెట్లను క్షణాల్లో కొనుగోలుచేసే ఏర్పాటు కల్పించారు. ప్రయోగాత్మకంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఈ విధానాన్ని ప్రారంభించారని శ్రీధర్ పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రయాణీకులకు సౌకర్యాలు కల్పించడానికి, రిజర్వ్ చేయని టిక్కెట్లను సౌకర్యవంతంగా కొనుగోలు చేయడానికి, 'యూ.టి.ఎస్ ' మొబైల్ అప్లికేషన్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ యాప్‌కు రైలు వినియోగదారుల నుండి విశేషమైన సానుకూల స్పందన వస్తోందని, ఈ యాప్‌ను ఉపయోగించే ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. ఆధునిక టికెటింగ్ వ్యవస్థలో యూ.టి.ఎస్ యాప్ ఒక పెద్ద ముందడుగన్నారు. భారతీయ రైల్వేలలో భారీ సంఖ్యలో ప్రయాణించే అన్‌రిజర్వ్ ప్రయాణికులకు ఒక వరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. యూ.టి.ఎస్ మొబైల్ యాప్ ద్వారా అన్‌రిజర్వ్ టిక్కెట్ల అమ్మకాన్ని ప్రోత్సహించడానికి, మొబైల్ యాప్ గురించి రైలు వినియోగదారులకు మరింత చేరువ చేయడానికి జోన్ అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ ముఖాముఖీ విధానం టికెట్ కౌంటర్ల వద్ద క్యూలను తగ్గించడానికి మరియు నగదు రహిత, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి సహాయపడుతుందన్నారు. ఈ సౌకర్యం జోన్‌లోని ఆరు డివిజన్‌లలోని ప్రధాన స్టేషన్లైన సికింద్రాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, తిరుపతి, నాందేడ్ మొదలైన వాటిలో ప్రవేశపెట్టబడిందన్నారు. యూ.టి.ఎస్ యాప్ బహుళ భాషాలలో అందుబాటులో ఉండి ప్రయాణీకులు బుకింగ్ కౌంటర్ల వద్ద పొడవైన క్యూలలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా వారి సౌలభ్యం ప్రకారం వారి మొబైల్ ద్వారా రిజర్వ్ చేయని జర్నీ టిక్కెట్లు, ప్లాట్‌ఫామ్, సీజన్ టిక్కెట్లను కొనుగోలు చేయడానికి వీలు కల్పిస్తుందని శ్రీధర్ తెలిపారు. డిజిటల్ ఇండియా చొరవకు అనుగుణంగా, ఈ యాప్ పేపర్‌లెస్ (నగదు రహిత ) లావాదేవీలను కూడా అనుమతిస్తుంది మరియు ప్రయాణీకులు ఆర్‌వాలెట్, పేటిఎం, యూ.పి.ఐ లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి వివిధ డిజిటల్ మోడ్‌ల ద్వారా చెల్లింపు చేయవచ్చు. ఆర్‌వాలెట్ ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేసినప్పుడు 3శాతం బోనస్ కూడా క్రెడిట్ చేయబడుతుందని సిపిఆర్ఒ తెలిపారు.

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: సుల్తానాబాద్**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

**1)** E1/SLTB/03/2025-26, తేది: 18.09.2025. **2) పనుల సంఖ్య:** 07 పనులు, **అంచనా విలువ:** 13.40 లక్షలు. **3) బిడ్ డాక్యుమెంట్ లభించుట :** 19.09.2025న ఉ.11.00గం.ల నుండి. **4) బిడ్స్ దాఖలుకు ఆఖరి తేది:** 22.09.2025న మ.12.00గం.ల వరకు. **5) సాంకేతిక బిడ్ ప్రారంభ తేది & సమయం:** 22.09.2025న మ.12.01గం.ల నుండి. **6) ప్రైస్ బిడ్ ప్రారంభ తేది & సమయం:** 22.09.2025న సా.4.00గం.ల నుండి. **7) సంప్రదించవలసిన అధికారి పేరు & చిరునామా:** టి. రమేష్, కమిషనర్, సుల్తానాబాద్ మున్సిపాలిటీ, పెద్దపల్లి జిల్లా. **వివరాల కొరకు సంప్రదించండి:** టి.రమేష్, కమిషనర్, సెల్ నెం. 6309532229 మరియు పి.రాజ్ కుమార్, ఎంఎఇ. సెల్ నెం. 6305511253.

సం/- కమిషనర్, సుల్తానాబాద్ మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 8259-PP/CL/ADVT/1/2025-26, Date: 18-09-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎన్‌విఎస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వానికి అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన ఎన్‌విఎస్ రెడ్డి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సిఎంకు పుష్పగుచ్ఛం అందచేసి, కృతజ్ఞతలు తెలిపారు. నగర రవాణా వ్యవస్థను మరింత అభివృద్ధి చేయడానికి తగిన సూచనలు, సిఫారసులు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్‌విఎస్ రెడ్డిని ఆదేశించారు.

## సహకార కమిషన్ నోటీసు రద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేసుల విచారణకు హాజరుకావాలని సహకార కమిషన్ ఇచ్చిన నోటీసును హైకోర్టు రద్దు చేసింది. ఏ కేసు విచారణో నోటీసులో పేర్కొనకపోవడంతో రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఒకే రోజు నాలుగు వందలకుపైగా అప్పీళ్లను విచారణ పూర్తి చేయడంపై ఆశ్చర్యాన్ని ప్రకటించింది. సమాచార హక్కు కార్యకర్త వి.శ్యామ్ కమిషన్ ముందు వేసిన 404 అప్పీళ్లను ఈ నెల 18న విచారణ చేస్తామని నోటీసులు ఇచ్చింది. దీనిపై శ్యామ్ వేసిన అత్యవసర పిటిషన్‌ను జస్టిస్ టి.మాధవీదేవి విచారించారు. ఒకేసారి అన్ని అప్పీళ్లను ఎలా విచారణ చేస్తారని కమిషన్‌ను ప్రశ్నించారు. అన్ని కేసుల్లో ఒకేసారి వాదనలు చెప్పడం కూడా కష్టమన్నారు. నోటీసులో కేసు వివరాలు లేకపోవడంతో వాటిని రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 11న ఇచ్చిన నోటీసును రద్దు చేస్తున్నామని తీర్పు చెప్పారు. కేసుల వివరాలతో నోటీసు జారీ చేయాలని సమాచార కమిషన్‌ను ఆదేశించారు.

## హైకోర్టుకు జిఎస్‌టి అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జీఎస్టీ ఆన్‌లైన్ ద్వారా నోటీసులు జారీ తీరును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో సుదీర్ఘ విచారణ జరిగింది. జీఎస్టీ సాఫ్ట్‌వేర్ పనితీరు ఎలా ఉంటుందో అధికారులు కంప్యూటర్ ద్వారా వివరించారు. కంప్యూటర్ ద్వారా నోటీసుల జారీ ప్రక్రియను ప్రత్యక్షంగా తెలియజేశారు. చీఫ్ జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ వద్ద జీఎస్టీ కేసులు 170 వరకు గురువారం విచారణకు వచ్చాయి. అధికారుల వివరణను ఈ ఇద్దరు న్యాయమూర్తులతోపాటు జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ పి.శ్యాంకోశీ, జస్టిస్ సుద్దాల చలపతిరావు కూడా పరిశీలన చేశారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ హరిత, కేంద్ర జీఎస్టీ కమిషనర్ శ్రీనివాస్ విచారణకు హాజరై డిజిటల్ నోటీసుల జారీ తీరును కంప్యూటర్ ద్వారా వివరించారు.డిజిటల్ కీతో సంతకంతో ఉన్న నోటీసును డౌన్‌లోడ్ చేసుకున్నప్పుడు సంతకం ఉండదని, అంతమాత్రాన సంతకం లేని నోటీసుగా పరిగణించరాదని చెప్పారు. వారి వివరణ అనంతరం డివిజన్‌బెంచ్ 4 వారాల్లోగా రాష్ట్ర జీఎస్టీ అధికారులు కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులు ఇచ్చింది. ఆపై 2 వారాల్లోగా పిటిషనర్లు తమ అభ్యంతరాలతో రిప్లయ్ కౌంటర్లు వేయాలంది. కొత్త నిబంధనలపై అందరూ అధ్యయనం చేయాలని అభిప్రాయపడింది. వాయిదాలు వేయబోమని చెప్పింది. భారీగా కేసులు ఉన్నందున కొన్నింటిలో కౌంటర్లు వేయకపోతే, ఇతర కేసుల్లోని కౌంటర్ అంశాల ఆధారంగా అన్ని కేసులను విచారించాలని రాష్ట్రం కోరింది. ఇందుకు హైకోర్టు అనుమతిచ్చి విచారణను అక్టోబర్ 30కి వాయిదా వేసింది.

## కేసులు కొట్టేయండి : హరీష్ పిటిషన్లు

### ఒక కేసు కొట్టివేత–రెండు కేసుల్లో పోలీసులకు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తనపై మూడు చోట్ల పోలీసులు పెట్టిన వేరువేరు కేసులను కొట్టేయాలని కోరుతూ సిద్ధిపేట వైసీపీ ఎమ్మెల్యే టి.హరీష్‌రావు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. రెండు కేసుల్లో పోలీసులకు నోటీసులు జారీ అయ్యాయి. మరో కేసును హైకోర్టు కొట్టేసింది.రాజకీయ కక్షలతో తనపై ఆధారాల్లేని ఫిర్యాదులతో పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని హరీష్ వేసిన పిటిషన్లను గురువారం జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించారు. 2024 ఆగస్టు 14లోగా రుణమాఫీ చేస్తామని సీఎం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై ఒట్టేసి మోసం చేసినందున ప్రజలకు కీడు జరగరాదంటూ గుట్ట కొండపై హరీష్ పూజలు చేయించారు. దీనిపై ఈవో ఫిర్యాదు మేరకు గుట్ట పోలీసులు ఎఫ్ఐఆర్ కట్టారు. దీనిని కొట్టేయాలనే కేసులో ఈవో, పోలీసులకు నోటీసులు ఇచ్చిన న్యాయమూర్తి విచారణను అక్టోబరు 8కి వాయిదా వేశారు. తనను హరీష్‌రావు, ఆయన అనుచరులు బెదిరిస్తున్నారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు ఆధారంగా బాచుపల్లి పోలీసులు పెట్టిన కేసును కొట్టేయలంటూ దాఖలైన పిటిషన్‌లో పోలీసు,ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేశారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ కరీంనగర్‌లో నమోదు చేసిన కేసును సవాల్ చేసిన హరీష్ పిటిషన్‌ను కొట్టివేశారు. ఈ కేసులో ఛార్జి షీటు దాఖలు చేసినందున జోక్యానికి నిరాకరించారు.




## అమీర్‌పేటలో 'వాల్యూజోన్ హైపర్ మార్ట్' ప్రత్యేక ఆఫర్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నడిబొడ్డున అద్భుతమైన షాపింగ్ అనుభూతిని 'వాల్యూ జోన్ హైపర్ మార్ట్' అందించనున్నది. దేశంలోనే అతి పెద్ద హైపర్ మార్కెట్ వాల్యూజోన్ హైపర్ మార్ట్‌ను గురువారం అమీర్‌పేటలో ప్రారంభించారు. దసరా, నవరాత్రుల సందర్భంగా అన్ని ఫ్యాషన్లు, గ్రాసరీలు, హోమ్ వేర్, పర్వదినాల వస్తు సామగ్రిపై 'వాల్యూజోన్' విశేషమైన ప్రత్యేక ఆఫర్లు తెచ్చింది. ఈ సందర్భంగా వాల్యూజోన్ వ్యవస్థాపకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కుటుంబంలోని అన్ని వయసుల వారికి అత్యంత సులభంగా, స్నేహపూర్వకమైన షాపింగ్ అనుభూతిని పెంచేందుకు కావాల్సిన అన్ని సదుపాయాలు ఇందులో ఉన్నాయన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ రాజమౌళి మాట్లాడుతూ అమీర్‌పేట్‌తో పాటు వివిధ ప్రాంతాలకు వాల్యూజోన్ అతి త్వరలో విస్తరించబోతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హోల్ టైం డైరెక్టర్ టి.ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 11 మార్గాల్లో కొత్త రైల్వే లైన్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలు అనుసంధానం లేని 11 మార్గాల్లో కొత్త లైన్ల నిర్మాణంపై రైల్వేశాఖ దృష్టి సారించింది. రెండు తెలుగు రాష్ట్రాలలో మొత్తంగా 1,960 కి.మీ. మేర 26 ప్రాజెక్టులకు నివేదికల రూపకల్పన చేసింది. ఎపి రాష్ట్రంలోని ఒంగోలు నుంచి దొనకొండ, దూపాడు నుంచి బేతంచర్ల, మచిలీపట్నం నుంచి నరసాపురం, రేపల్లె వంటి ప్రాంతాలకు కొత్త రైల్వే లైన్లు నిర్మించేలా సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు సిద్ధమవుతున్నాయి. ఎపి మీదుగా హైదరాబాద్ నుంచి బెంగళూరు, హైదరాబాద్ నుంచి చెన్నైలకు బుల్లెట్ రైళ్లు నడిపేలా హైస్పీడ్ కారిడార్ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న మార్గాల్లో రైళ్ల రద్దీ ఎక్కువగా ఉండే వైపు అదనంగా మూడు, నాలుగు, ఐదు, ఆరో లైన్ నిర్మాణానికి డీపీఆర్‌లు తయారు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 1,960 కి.మీ. మేర 26 ప్రాజెక్టులకు రైల్వేశాఖ డిపిఆర్‌లు రూపొందిస్తోంది. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ విజయవాడ, గుంటూరు, గుంతకల్ ఆరు డివిజన్లు ఉన్నాయి. పునర్విభజన తర్వాత సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు దక్షిణ మధ్య రైల్వేలో మిగులుతాయి. విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు ఏపీలో విశాఖపట్నం కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా జోన్‌లోకి వెళతాయి. ఇందులో సికింద్రాబాద్, గుంతకల్, విజయవాడ, గుంటూరు డివిజన్ల సరిహద్దుల్లో మార్పులకు ప్రతిపాదనలు వెళ్లాయి. మొత్తంగా 26 ప్రాజెక్టుల డిపిఆర్‌లు నవంబరు, డిసెంబరు నాటికి పూర్తిచేసేలా లక్ష్యాన్ని నిర్దేశించారు.

## సిఎం కప్-2025 నిర్వహణలో
# అందరినీ భాగస్వామ్యం చేస్తాం

### క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/హైదరాబాద్**

గ్రామీణ క్రీడాకారుల ఉత్సాహానికి ప్రోత్సాహం ఇచ్చే విధంగా సిఎం కప్ 2025 నిర్వహణలో అందరిని భాగస్వామ్యం చేసి నిర్వహిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో గురువారం ఆయన జిల్లా యువజన క్రీడ అభివృద్ధి అధికారులు, మరియు క్రీడా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిఎం కప్ 2024మాదిరిగానే సిఎం కప్ 2025 కూడా గ్రామీణ స్థాయి నుంచి నిర్వహిస్తామని, గ్రామీణ యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని మొత్తం అందులో భాగస్వామ్యం చేస్తామని ఆయన తెలిపారు.సిఎం కప్ 2025 నిర్వహణ మొక్కుబడిగా నామమాత్రంగా నిర్వహించకుండా, అందరు ప్రజాప్రతినిధులను మరియు అధికారులను ఇందులో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. ఇందులో ఎటువంటి పార్టీ భేదాలు లేకుండా ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా స్వయంగా మాట్లాడడం లేఖలు రాసి వారి సహాయాన్ని కోరుతామని, జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని ఆయన తెలిపారు. జిల్లాలో పరిపాలనపరంగా క్రీడా శాఖలో కొన్ని ఇబ్బందులు ఉన్నా సీఎం కప్ నిర్వహణకు చిత్తశుద్ధితో ఉత్సాహంతో కృషి చేస్తున్న అధికారులను ఆయన అభినందించారు.సిఎం క పోటీలను కేవలం హైదరాబాద్ నగరానికి పరిమితం చేయకుండా ప్రతి ఉమ్మడి జిల్లాల్లో ఆయా జిల్లాల్లో ప్రాచుర్యం ఉన్న క్రీడాంశాలలో పోటీలు అన్ని జిల్లాల లో ఒక పండుగ వాతావరణం తెచ్చేలా నిర్వహిస్తామని తెలిపారు. కేవలం పోటీలు నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడాకారుడి సమాచారాన్ని నిక్షిప్తం చేసి ప్రతిభా కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.సిఎం కప్ విజయవంతానికి పిఈటిలు ఫిజికల్ డైరెక్టర్ల సహకారం తీసుకోవాలని అన్ని క్రీడా సంఘాలను భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, సిఎం కప్ నిర్వహణ వాటి ఆశయాన్ని లక్ష్యాలను గ్రామీణ స్థాయిలో విస్తృత ప్రచారం చేసేందుకు ఘనంగా నిర్వహించాలని రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో క్రీడా జ్యోతి కార్యక్రమాలు నిర్వహించి అందులో క్రీడాకారులు క్రీడాభిమానులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని డి వై ఎస్ ఓ లను కోరారు. సిఎం కప్ పోటీల తేదీలు, క్రీడాజ్యోతి ర్యాలీ తేదీలు త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు జరిగే ఈ పోటీలలో అన్ని స్థాయిల్లో విజయవంతం చేసిన ఐదు జిల్లాలను ఎంపిక చేసి వారికి ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారి పట్ల కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ నిర్వాహణలో క్రీడా సంఘాలను భాగస్వామ్యం చేయాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు కోచులు పాల్గొన్నారు.



## నిలోఫర్ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలపై దృష్టి

### మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిలోఫర్ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని,ఆస్పత్రిలో అన్ని విభాగాలను పటిష్ట పర్చాలని అధికారులకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. నిలోఫర్ ఆస్పత్రి అంశంపైన హైదరా బాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ నిలోఫర్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులు శర వేగంగా పూర్తి చేయాలన్నారు.పిజి విద్యార్థులకు ఆసుపత్రిలో హాస్టల్ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే రోగుల సహాయకులకు వసతి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. క్యాడర్ స్ట్రెంత్‌కు అనుగుణంగా సిబ్బంది నియామకంపై దృష్టి సారించాలన్నారు. ఆసుపత్రిలోని భవనాల పరిస్థితిపై టిజిఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి చర్చించారు . నిలోఫర్ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, హెచ్ఆర్, ఎక్విప్‌మెంట్లు రిపేర్లు, ఆర్ఒ వాటర్ ప్లాంట్ , శానిటేషన్ , డ్రైనేజీ సిస్టం , ఇన్‌ఫ్రా, రోగులకు, వారి సహాయకులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా లాజరస్, టిజిఎంఎస్ఐడిసి ఎండి ఫణిందర్ రెడ్డి ,డిఎంఇ డాక్టర్ నరేంద్ర కుమార్ , అదనపుడిఎంఇ డాక్టర్ వాణి , నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు .

## సామాజిక ఉద్యమంగా వనమహోత్సవం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ఈ ఏడాది సామాజిక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తున్నట్లు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా, విభాగాల వారీగా మొక్కల నాటకాల పురోగతిపై గురువారం తెలంగాణ సచివాలయంలో ఉన్నతాధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణ అధ్యక్షత వహించగా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఇప్పటివరకు 13.84 కోట్ల మొక్కలు నాటినట్లు, ఇది ఈ ఏడాది నిర్ణయించిన 18.03 కోట్ల లక్ష్యంలో 77 శాతం సాధన అని అధికారులు వెల్లడించారు. నాటిన ప్రతి మొక్కకు జియోట్యాగింగ్ పూర్తయిందన్నారు. అటవీ అధికారులు సిద్ధం చేసిన పిపిటిని వీక్షించిన ముఖ్యకార్యదర్శి, పిసిసిఎఫ్‌లు విపులంగా వివరాలు తెలుసుకున్నారు. మొక్కలు నాటే ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గత సంవత్సరం అనుభవాల ఆధారంగా మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంపొందించడానికి ప్రతి మండలం, గ్రామం, మున్సిపాలిటీ స్థాయిలో భారీగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈసారి 100 శాతం లక్ష్యం సాధించాలని మంత్రి సురేఖ ఆదేశించిన విషయాన్ని అధికారులు సమావేశంలో గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వన మహోత్సవం పేరిట పచ్చదనం విస్తరణకు ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు పునరుద్ఘాటించారు.

## ఉగ్రవాద సంస్థలు అఫ్గాన్‌లో తిష్టవేయకుండా ప్రపంచం భరోసా ఇవ్వాలి

### ఐక్యరాజ్యసమితిలో భారత దౌత్యవేత్త హరీశ్

**న్యూయార్క్ :** ఐక్యరాజ్యసమితి ఉగ్రవాద సంస్థలుగా గుర్తించిన లష్కరే తయ్యిబా, జైష్–ఏ–మహ్మద్‌లు అఫ్ఘానిస్థాన్ భూభాగంలో తిష్టవేయకుండా అంతర్జాతీయ ప్రపంచం భరోసా ఇవ్వాలని భారత్ కోరింది. ఇతరదేశాల్లో విధ్వంసకర కార్యకలాపాలు సాగించడానికి అఫ్ఘానిస్థాన్ భూభాగాన్ని దుర్వినియోగం చేయకుండా ఈ రెండు ఉగ్రవాద సంస్థలను నిలువరించాలని ఐక్యరాజ్యసమితిలో భారత దౌత్యకార్యాలయ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ అన్నారు. అఫ్ఘానిస్థాన్‌లో ఉన్న భద్రతా పరిస్థితులను భారత ప్రభుత్వం చాలా జాగ్రత్తగా సన్నిహితంగా పరిశీలిస్తోందని ఆయన బుధవారం చెప్పారు. ఐక్యరాజ్యసమితి ఉగ్రవాదలుగా ప్రకటించిన సంస్థలు అఫ్ఘానిస్థాన్‌లో ఏం చేస్తున్నాయో పరిశీలించేందుకు తప్పనిసరిగా సమన్వయపూర్వకమైన ఉమ్మడి కృషి, ఆచరణ చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఐఎస్ఐఎల్, అల్ ఖైదా దాని అనుబంధ సంస్థలను ఐక్యరాజ్యసమితి ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించింది. వీటిల్లో లష్కరే తయ్యిబ్, జైష్–ఏ–మహ్మద్ సంస్థలు అల్‌ఖైదా,ఐఎస్ఐఎల్‌లకు అనుబంధ సంస్థలుగా ఉన్నాయన్నారు. వీటిని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌ను ఆయన బాహాటంగానే ప్రస్థావించారు. అఫ్ఘానిస్థాన్‌పై భద్రతా మండలిలో హరీశ్ ఒక ప్రకటన చేశారు. భారత్, అఫ్ఘానిస్థాన్ దేశాలమధ్య పౌర నాగరికతా సంబంధాలు ఉన్నప్పటికీ యుద్ధంతో అతలాకుతలమైన ఆ దేశంలో శాంతి,స్థిరత్వం నెలకొనాలని భారత ప్రభుత్వం ఆశిస్తోందన్నారు. "అంతర్జాతీయ,ప్రాంతీయ ఐక్యతకు, ఏకాభిప్రాయాలకు భారతదేశం చాలా ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందని, కీలక సమస్యలపై ప్రపంచ సహకారానికే ప్రాధాన్యం ఇస్తుందని, ఆఫ్ఘానిస్థాన్‌లో ఉగ్రవాద సంస్థల కార్యకలాపాల విషయంలో కూడా సంబంధిత దేశాలూ, అంతర్జాతీయ సంస్థలన్నీ శాంతి,స్థిరత్వం అభివృద్ధి చేసేందుకు ముందుకు రావాలని కోరారు. దోహాలో, ఇతర అంతర్జాతీయ వేదికలలో భారతదేశం పాల్గొన్న సందర్భంగా ఇదే విషయానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చి ఉద్ఘాటనలు చేస్తూ వస్తోందని చెప్పారు. భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ రెండు సార్లు అఫ్ఘానిస్థాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమిర్ ఖాన్ ముత్తఖీతో మాట్లాడారని, జమ్మూ కశ్మీరు పహల్గామ్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 22న ఉగ్రవాదులు చేసిన దాడిని, ఉగ్రవాద కార్యకలాపాలను అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వం చాలా బలంగా ఖండించడాన్ని భారతదేశం ఆహ్వానించిందని భద్రతామండలి సమావేశంలో హరీశ్ చెప్పారు.

## నిర్మాణరంగంలో 12శాతం వృద్ధి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** భారత్ నిర్మాణరంగం వేగంగా విస్తరిస్తున్నదని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ క్రమంలో తెలంగాణ నిర్మాణ రంగం 12శాతం వృద్ధితో దూసుకుపోతుందన్నారు. గురువారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని హయత్ ప్యాలస్‌లో ప్రముఖ బీ2బీ ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఇన్ఫోర్మా మార్కెట్స్ ఇండియా ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వరల్డ్ ఆఫ్ కాంక్రీట్ ఇండియా–2025 11వ ఎడిషన్ ఎక్స్‌పో అక్టోబర్ 8 నుంచి 10 వరకు ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ ఎక్స్‌పోలో 15వేలకుపైగా ఇండస్ట్రీ నిపుణులు, 50పైగా గ్లోబల్ స్పీకర్లు, ఇన్నోవేషన్ ప్రదర్శనలు, 250పైగా ఎగ్జిబిటర్లు హాజరవుతారని తెలిపింది. అనంతరం ఇన్ఫోర్మా మార్కెట్స్ ఇండియా ఎండి యోగేశ్ ముద్రాస్ మాట్లాడుతూ నిర్మాణ కార్యకలాపాలను సులభతరం చేసే డిజిటల్ టూల్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. భారత సిమెంట్ పరిశ్రమ 2025 నుంచి 2030 వరకు సుమారు 7శాతం సిఎజిఆర్ వృద్ధితో ముందుకు సాగనున్నదన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ రంగంలో సమర్థత, సుస్థిరత, దీర్ఘకాలిక వృద్ధిని ముందుకు నడిపించడమే లక్ష్యంగా వరల్డ్ ఆఫ్ కాంక్రీట్ ఇండియా లక్ష్యంగా పెట్టుకొన్నదన్నారు. ఇన్ఫోర్మా మార్కెట్స్ ఇండియా సీనియర్ గ్రూప్ డైరెక్టర్ రజనీస్ ఖట్టర్ మాట్లాడుతూ భారత్ నిర్మాణరంగంలో తన పూర్తి సామర్థ్యాన్ని ఆవిష్కరించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. రోబోమాటిక్ ప్రీకాన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు విజయ్ కె కోసరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో గ్రీన్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీలను ప్రోత్సహించేందుకు పాలసీ సంస్కరణలు, పన్ను రాయితీలు చాలా అవసరమన్నారు. సమావేశంలో జిందాల్ పాంథర్ సిమెంట్ సిఇఒ రోహిత్ వోరా, వాల్ మెటీరియల్ వ్యవస్థాపకురాలు, సిఇఒ ఆర్.నివేదా తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్‌లో బదిలీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగంలో పలు బదిలీలు జరిగాయి. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఎసిపిగా టి.ఎల్. రమేశ్ నియమితులయ్యారు. ఖైరతాబాద్ ఎసిపిగా సురేశ్ కుమార్, బేగంపేట్ ఎసిపిగా ఇంజా శ్రీనివాస్‌ను నియమించారు.



## ఆర్ అండ్ బి శాఖలో పూర్తిస్థాయి ప్రమోషన్లు

### మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోడ్లు, భవనాలు శాఖలో పూర్తిస్థాయి పారదర్శకతతో ప్రమోషన్లు ఇచ్చామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అప్రూవల్ చేసుకుని రెగ్యులర్ ప్రమోషన్లు అందేలా కృషి చేశానని గుర్తు చేశారు. ఇటీవల ఎన్నికైన ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మంత్రుల నివాస సముదాయంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి నూతన కార్యవర్గానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన హామీ ప్రకారం ఒకేసారి 118 మంది ఎఇఇ, డిఇలుగా, 72 మంది డిఇలు ఈఈలుగా, 29 మంది ఈఈలు ఎస్ఈలుగా, ఆరుగురు ఎస్ఈలు సిఇలుగా, ఇద్దరు సిఈలు, ఈఎన్‌సిలుగా ప్రమోషన్లు పొందారని తెలిపారు. శాఖ పరమైన సమస్యలు ఏవైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని వారికి మంత్రి హామీ ఇచ్చారు. ఇతర కేడర్‌లలో మిగిలిన పదోన్నతులను కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజల్లో ఆర్ అండ్ బి శాఖకు మంచి పేరు తీసుకురావడం ఇంజనీర్ల బాధ్యత అని, అదే స్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేయాలని వారికి సూచించారు. మీరు ఆర్ అండ్ బి శాఖ మంత్రి అయిన తర్వాతనే తమ సమస్యలు పరిష్కారమై, రెగ్యులర్ ప్రమోషన్లు వచ్చాయని అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి కోమటి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. శ్రీను, ప్రధాన కార్యదర్శి బి. రాంబాబు, కార్యనిర్వహక కార్యదర్శి పి. శరత్ చంద్ర, కోశాధికారి మహేందర్ కుమార్, ఉపాధ్యాక్షులు కె.సంధ్య, వేణు, ప్రదీప్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు నవీన్, కిషన్, అరుణ్ రెడ్డి ఉన్నారు.





## 22 నుంచి సాయి నామ శతకోటి జప మహాయజ్ఞం

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** 'శ్రీ సాయి నామ శత కోటి జప మహా యజ్ఞం' ఈ నెల 22 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 4 వరకు నిర్వహిస్తామని శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్టు అధ్యక్షులు బి.వి.శ్యామ్ కుమార్, ప్రధానకార్యదర్శి రఘు కుమార్, కోశాధికారి నరసింహ గుప్తా తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యజ్ఞానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. లోక కల్యాణార్థం, భక్తుల కోరిక మేరకు జరుగుతున్న ఈ జప యజ్ఞ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని సూచించారు. ఈ యజ్ఞం పూర్తిచేసే వారు సంబంధిత వివరాలు సామాజిక మాధ్యమాల్లో తెలియజేయడానికి ప్రత్యేక వాట్సాప్ నంబర్ 8500966566, 9492646780 ను ప్రారంభించామని తెలిపారు. వివరాలకు శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్టు, దిల్‌సుఖ్‌నగర్, పిఆర్ఒ ఆఫీసులో సంప్రదించాలని తెలిపారు. 142 రోజులు జరిగే ఈ యజ్ఞంలో ఉచితంగా అన్నదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థాన్ మాజీ చైర్మన్ జి.మల్లయ్య, శ్రవణ్‌కుమార్, స్వామిజీ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో సత్తా చాటిన తెలంగాణ పోలీసు: డిజిపి జితేందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా పోలీసులు పనితీరు పట్ల నిర్వహించిన నివేదికలో తెలంగాణ పోలీసుల దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ తెలిపారు. వెంగళ రావు నగర్లోని నలంద విద్యాసంస్థల్లో విద్యార్థులతో గురువారం నిర్వహించిన ముఖా ముఖి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, నైతిక నాయకత్వం, ప్రజా సేవ పట్ల నిబద్ధతతో పని చేసే ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. జ్ఞానం, విలువల ద్వారా మార్గనిర్దేశం చేయబడిన నాయకుల తరాన్ని మన విద్యా సంస్థలు మన దేశానికి అందించాలని అన్నారు. విద్యార్థులు, విద్యారంగంలో రాణించడమే కాకుండా, విలువలు, వ్యక్తిత్వంతో ఎదగాలని సూచించారు. విద్య అనేది జ్ఞానాన్ని సంపాదించడం గురించి మాత్రమే కాదు.. స్వీయక్రమశిక్షణ, తెలివితేటలు, నైతిక విలువలతో వ్యక్తిత్వాన్ని రూపొందించడం గురించి కూడా అని చెప్పారు. విద్యార్థులు తమ అంతర్గత బలాలను పెంపొందించుకోవాలని, వారి నైతిక సామర్థ్యాన్ని గ్రహించాలని ఆయన సూచించారు. జీవితంలో సరైన లక్ష్యాన్ని ఎంపిక చేసుకుని క్రమశిక్షణతో విద్యాను అభ్యసించాలని వెల్లడించారు. మీలో ప్రతి ఒక్కరూ హనుమంతుడిలాగే మీలో అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. హనుమంతుడు తన అపారమైన శక్తిని తనకు గుర్తు చేసే వరకు గ్రహించలేదు.. అదేవిధంగా, చాలా సార్లు మీలో దాగి ఉన్న అసాధారణ ప్రతిభ, ధైర్యం, జ్ఞానం గురించి మీకు తెలియకపోవచ్చు. మేధస్సు వలనే అమెరికాలో మన భారతీయులు జనాభా 2 శాతం కానీ అమెరికా జిడిపికి 8 శాతం అందిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత మెంటర్ లా ఎక్సలెన్స్ సివిల్ సర్వీసెస్ రాంబాబు, నలంద విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ రాజు మంతెన, డైరెక్టర్ సూర్య మంతెన, అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 2011 నుంచి 840 మంది ఖైదీలను విడుదల చేశాం : మమతా బెనర్జీ

**కోల్‌కతా :** రాష్ట్ర ప్రభుత్వం 2011 నుండి జీవిత ఖైదు అనుభవిస్తున్న 840 మంది ఖైదీలను విడుదల చేసిందని, వీరందరూ 14 సంవత్సరాలకు పైగా శిక్ష అనుభవిస్తున్నవారేనని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. న్యాయపరమైన ప్రక్రియ తర్వాత అదనంగా 45 మంది ఖైదీలను ఇప్పుడు విడుదల చేస్తున్నట్లు కూడా ఆమె ప్రకటించారు. విడుదలైన వ్యక్తులను, వారి కుటుంబాలను బెనర్జీ అభినందించారు. జైలు శిక్ష సమయంలో వారి మంచి ప్రవర్తన ఈ నిర్ణయంలో కీలకమైన అంశం అని పేర్కొన్నారు. 'మా ప్రభుత్వం ఇప్పటికే 14 సంవత్సరాలకు పైగా శిక్ష అనుభవించిన చాలా మంది జీవిత ఖైదీలను చట్టబద్ధంగా విడుదల చేసింది. 2011 నుండి అలాంటి 840 మందిని విడుదల చేశారు. మరో 45 మందిని చట్టబద్ధంగా విడుదల చేస్తున్నారు. నేను వారిని, వారి కుటుంబాలను అభినందిస్తున్నాను' అని బెనర్జీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విడుదలైన ఖైదీలు సంస్కరించబడిన జీవితాలను గడుపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. వారు కొత్త, స్వేచ్ఛా జీవితాలలో మంచి పౌరులుగా మారతారని ఆశిస్తున్నానని సిఎం పేర్కొన్నారు.

# ఉత్తరాఖండ్‌లో విరిగిపడిన కొండచరియలు

### ఒకరు మృతి, 11 మంది గల్లంతు, 20 మందికి గాయాలు

### 30కిపైగా ఇళ్లు నేలమట్టం





**గోపేశ్వర్ :** పర్వత రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో గురువారం భారీవర్షాలు బీభత్సం సృష్టించాయి. చమోలి జిల్లాలోని నాలుగు గ్రామాల్లో భారీ వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడి, వరదలు సంభవించడంతో ఒకరకు మృతి చెందగా శిథిలాల్లో 11మంది చిక్కుకున్నారు. మరో 20మంది గాయపడ్డారు. 30 ఇళ్లకుగా నేలమట్టమయ్యాయి. ఈ నాలుగు గ్రామాలు నందనగర్ ప్రాంతం పరిధిలోకి రాగా, డెహ్రాడూన్ నుండి దాదాపు 260 కి.మీ ఉన్నాయి. శిథిలాల నుంచి ఒక మృతదేహాన్ని వెలికితీయగా, కుంతరి లగఫలి గ్రామంలో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారిని సజీవంగా రక్షించినట్లు డెహ్రాడూన్‌లోని రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్ (ఎస్ఇఒసి) తెలిపింది. మృతుడిని నరేంద్ర సింగ్ (42)గా గుర్తించారు. కుంతరి లగఫలి చెందిన ఏడుగురు, కుంటారి లగసర్పాని, దుర్మాకు చెందిన ఇద్దరు చొప్పున పదకొండు మంది గల్లంతయ్యారని ఎస్ఇఒసి పేర్కొంది. అంతకుముందు తాజా విపత్తు కుంతరి లగఫలి, కుంతరి లగసర్పాని, సెరా, ధుర్మాలను తాకిందని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పరిస్థితిని సమీక్షించిన తర్వాత విలేకరులకు తెలిపారు. భారీ వర్షం కారణంగా కుంతరి లగఫలి, కుంతరి లగసర్పాని, సెరా, ధుర్మా గ్రామాల్లో కొండచరియలు విరిగిపడడంతో 33 ఇళ్ళు, అనేక దుకాణాలు, గోశాలలు ధ్వంసమయ్యాయని, 14మంది గల్లంతయ్యారని, దాదాపు 20 మంది గాయపడ్డారని ఆయన చెప్పారు. వర్ష సంబంధిత సంఘటనలలో 200 మందికి పైగా ప్రజలు ప్రభావితమయ్యారన్నారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్నాయని, గాలింపు, రక్షణ చర్యలు కొనసాగుతున్నాయని ధామి చెప్పారు. తలకు గాయమైన చిన్నారితో సహా తీవ్రంగా గాయపడిన వారిని రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు విమానంలో తరలిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. డెహ్రాడూన్‌లోని రాష్ట్ర అత్యవసర ఆపరేషన్స్ సెంటర్‌లో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా చమోలి జిల్లా మేజిస్ట్రేట్ (డిఎం) సందీప్ తివారీతో మాట్లాడి ధామి నందనగర్‌లోని పరిస్థితిని సమీక్షించారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, రక్షణ చర్యలను వేగవంతం చేయాలని ఆయనను కోరారు. వర్షం ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లు, తాగునీటి సరఫరా, విద్యుత్, నెట్‌వర్క్ కనెక్టివిటీని వెంటనే పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విపత్తు బాధితులకు ఆశ్రయం, ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. సత్వర వైద్య సహాయం అందించడానికి ప్రతి ప్రభావిత ప్రాంతంలో తగినంత సంఖ్యలో వైద్యులు మరియు మందులు అందుబాటులో ఉంచాలని ధామి అన్నారు. మోక్ష్ లోయ ప్రాంతంలో భారీ వర్షం కారణంగా మోక్ష నదిలో వరదలు సంభవించాయి. దుర్మా నుండి సెరా వరకు కోతకు గురైంది. కనీసం 60 ఇళ్లు సహా డజన్ల కొద్దీ భవనాలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. చమోలి డిఎం తివారీ మాట్లాడుతూ కుంటారి లగాఫలి గ్రామంలో కొండచరియలు విరిగిపడి దాదాపు అరడజను ఇళ్ళు దెబ్బతిన్నాయని, దుర్మా గ్రామంలో ఇద్దరు వ్యక్తులు తప్పిపోయారని, మోక్ష నది ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు బహుళ భవనాలను దెబ్బతీసిందని ఆయన అన్నారు. నందనగర్‌కు వెళ్లే రహదారి శిథిలాల ద్వారా మూసుకుపోయిందని చెప్పారు. తప్పిపోయిన వారందరి వివరాలు తెలియాల్సి ఉందని, దెబ్బతిన్న భవనాల శిథిలాల కింద వారు చిక్కుకుపోయి ఉండవచ్చని అధికారులు తెలిపారు. సహాయ, రక్షణ కార్యకలాపాల్లో పాల్గొన్న కుంటారి లగాఫలి నివాసి, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు నందన్ సింగ్ మాట్లాడుతూ చిత్తడి నేల సహాయ చర్యలకు ఆటంకం కలిగిస్తోందని అన్నారు. కుంటారి లగాఫలిలోని మూడు ప్రదేశాలలో కొండల నుండి బురద, బండ రాళ్లు దొర్లడంతో దారిలో ఉన్నవన్నీ ధ్వంసమయ్యాయన్నారు. కొండచరియలు ఇళ్లపై పడినప్పుడు లోపల ఉన్న కొందరు తప్పించుకోగలిగారని సింగ్ చెప్పారు. ఆగస్టులో నందనగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో భూమి కుంగిపోవడంతో అనేక ఇళ్ల గోడలలో పగుళ్లు ఏర్పడ్డాయి. అక్కడి నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. డెహ్రాడూన్, సమీప ప్రాంతాలలో భారీ వర్షం, మేఘావిస్ఫోటనం కారణంగా అనేక రోడ్లు తెగిపోయాయి. వంతెనలు కొట్టుకుపోవడం, ఇళ్లు దెబ్బతినడం వల్ల 21 మంది మరణించగా, 17 మంది గల్లంతైన రెండు రోజుల తర్వాత కొండచరియలు విరిగిపడ్డాయి.

## ఒడిశాలో బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ అవిశ్వాస నోటీసు

**భువనేశ్వర్ :** ఒడిశాలో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. అయితే సమావేశాల తొలి రోజున కాంగ్రెస్ 15 నెలల బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాసం నోటీసు ఇచ్చింది. శాసనసభా పక్ష నాయకుడు రామ చంద్ర కదమ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం అసెంబ్లీ కార్యదర్శి సత్యబ్రత రౌత్‌ను కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై 'అవిశ్వాస తీర్మానం' ప్రవేశపెట్టాలని కోరుతూ నోటీసు అందజేసింది. అసెంబ్లీ విధానాలలోని నిబంధన అమలు చేస్తూ, కాంగ్రెస్ శాసనసభాపక్షం నోటీసులో మోహన్ చరణ్ మార్ఝి నేతృత్వంలోని ప్రస్తుత మంత్రి మండలిపై ఈ సభ అవిశ్వాసం వ్యక్తం చేస్తున్నదని పేర్కొంది. అనంతరం ప్రతినిధి బృందం విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్‌కు, అసెంబ్లీ కార్యదర్శికి నోటీసు సమర్పించామని, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి అంగీకరించమని కోరామన్నారు.


## దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**No. Y/C. e-Auction/HYB/2025-26**
**Date 16.09.2025**

PUB/1149

దక్షిణ మధ్య రైల్వేలోని హైదరాబాద్ డివిజన్‌పై పార్కింగ్ మొబైల్ ఆస్తులు, ATM & Misc. Static Service, పే అండ్ యూజ్ టాయిలెట్స్ కేటగిరీ ద్వారా వాణిజ్య ప్రచార కాంట్రాక్టుల కేటాయింపు. ఇ-వేలం షెడ్యూల్ ఈ దిగువన ఇవ్వబడింది:

| క్ర. సం. | కేటగిరి | కేటలాగ్ నెం. | వివరాలు | వేలం తేది | వేలం ప్రారంభ సమయం | వేలం ఆఖరి సమయం |
|---|---|---|---|---|---|---|
| 1 | పార్కింగ్ | HYB-MIXED-046 | 6 స్టేషన్లలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడం. అవి : సిద్దిపేట్, మిర్జాపల్లి, అల్వాల్ (అదర్ సైడ్) గుండ్లపోచంపల్లి, అక్కనపేట్ & ఆర్ట్స్ కాలేజీ రైల్వే స్టేషన్లు. | 27.09.25 | 11:30 | 15:40 |
| 2 | ADVT-Int-202068-1-25-1 (రైలు ఇంటీరియర్ గురించి ప్రకటన) | HYB Mixed-046 | రైలు నెం.12789/12790 వెలుపలి భాగం కాచిగూడ-ముద్రేశ్వర్- కాచిగూడ మరియు 22715/22716 కాచిగూడ- మధురై- కాచిగూడ ఎక్స్‌ప్రెస్ | 27.09.25 | 12.30 | 13.00 |
| 3 | ADVT-EFF-S1-MMTS-24-1 రైలు వెలుపలి భాగం అడ్వర్టైజింగ్ ఫుల్ ఫేస్ | HYB-Mixed-046 | MMTS రైళ్ల బాహ్య అడ్వర్టైజింగ్ హక్కులు | 27.09.25 | 12.40 | 13.10 |
| 4 | ADVT-HYB-MDAK-OH-119-25-1 (ఇంటి బయట అడ్వర్టైజింగ్) | HYB-Mixed-046 | మెదక్, గజ్వేల్, సిద్దిపేట రైల్వే స్టేషన్లలో అవుట్ ఆఫ్ హోమ్ కేటగిరీ కింద అడ్వర్టైజింగ్ హక్కులు | 27.09.25 | 12.50 | 13.20 |
| 5 | ADVT-HYB-MDAK-OSN-118-25-1 (స్టేషన్ ప్రాంగణంలో నాన్ డిజిటల్ అడ్వర్టైజింగ్) | HYB-Mixed-046 | మెదక్, గజ్వేల్, సిద్దిపేట రైల్వే స్టేషన్లలో RDN కేటగిరీ కింద అడ్వర్టైజింగ్ హక్కులు | 27.09.25 | 13.00 | 13.30 |
| 6 | ADVT-HYB-TMX-OSN-123-25-1 (స్టేషన్ ప్రాంగణంలో నాన్ డిజిటల్ అడ్వర్టైజింగ్) | HYB-Mixed-046 | తిమ్మాపూర్, షాద్‌నగర్, జడ్చర్ల రైల్వే స్టేషన్లలో RDN కేటగిరీ కింద అడ్వర్టైజింగ్ హక్కులు | 27.09.25 | 13.10 | 13.40 |
| 7 | ATM-HYB-GWD-Gen-48-25-1 (ATM General) | HYB-Mixed-046 | హైదరాబాద్ డివిజన్‌పై గద్వాల్ రైల్వే స్టేషన్‌లో ఆటోమేటెడ్ టెల్లార్ మిషన్ (ATM) ఏర్పాటు | 27.09.25 | 13.20 | 13.50 |
| 8 | ATM-HYB-SHNR-Gen-45-25-1 (ATM General) | HYB-Mixed-046 | హైదరాబాద్ డివిజన్‌పై షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఆటోమేటెడ్ టెల్లార్ మిషన్ (ATM) ఏర్పాటు | 27.09.25 | 13.30 | 14.00 |
| 9 | ATM-HYB-STPD-Gen-3-25-1 (ATM General) | HYB-Mixed-046 | హైదరాబాద్ డివిజన్‌పై సీతాఫల్‌మండీ రైల్వే స్టేషన్‌లో ఆటోమేటెడ్ టెల్లార్ మిషన్ (ATM) ఏర్పాటు | 27.09.25 | 13.40 | 14.10 |
| 10 | ATM-HYB-VDI-Gen-49-25-1 (ATM General) | HYB-Mixed-046 | హైదరాబాద్ డివిజన్‌పై వెల్దుర్తి రైల్వే స్టేషన్‌లో ఆటోమేటెడ్ ఆటోమేటెడ్ టెల్లార్ మిషన్ (ATM) ఏర్పాటు | 27.09.25 | 13.40 | 14.20 |
| 11 | ATM-HYB-JCL-Gen-46-25-1 (ATM General) | HYB-Mixed-046 | హైదరాబాద్ డివిజన్‌పై జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో ఆటోమేటెడ్ టెల్లార్ మిషన్ (ATM) ఏర్పాటు | 27.09.25 | 14.00 | 14.30 |
| 12 | ATM-HYB-STPD-Gen-50-25-1 (ATM General) | HYB-Mixed-046 | హైదరాబాద్ డివిజన్‌లోని తార్నాక సమీపంలో IRSET వద్ద ఆటోమేటెడ్ టెల్లార్ మిషన్ (ATM) ఏర్పాటు | 27.09.25 | 14.10 | 14.40 |
| 13 | MSS-HYB-DYE-BS-95-25-1 (Misc. Static Services-బ్యాటరీ మార్పిడి స్టేషన్లు) | HYB-Mixed-046 | దయానంద్‌నగర్‌లో బ్యాటరీ మార్పిడి కాంట్రాక్ట్ | 27.09.25 | 14.20 | 14.50 |
| 14 | MSS-HYB-NZB-Hlthk-8-24-1 (Misc. Static Services-Health Kiosk) | HYB-Mixed-046 | నిజామాబాద్ రైల్వే స్టేషన్ వద్ద హెల్త్ కియోస్క్ మెయింటెనెన్స్ మరియు ఆపరేషన్ | 27.09.25 | 14.30 | 15.00 |
| 15 | MSS-HYB-MJF-GZ-91-25-1 (Misc. Static Services-గేమింగ్ జోన్) | HYB-Mixed-046 | మెట్టుగూడ రైల్ కళారంగ్ వద్ద స్నాక్స్ బార్ తో కూడిన టెన్నిస్ అకాడమీ ఏర్పాటు. | 27.09.25 | 14.40 | 15.10 |
| 16 | MSS-HYB-JOO-SS-93-25-1 (Misc. Static Services-సెలూన్ సర్వీస్) | HYB-Mixed-046 | జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ వద్ద యూనిసెక్స్ సెలూన్ ఏర్పాటు | 27.09.25 | 14.50 | 15.20 |
| 17 | MSS-HYB-VAR-THDPK-92-25-1 (Misc. Static Services-ట్రావెలర్స్ హెల్ప్ డెస్క్ / ట్రావెలర్స్ సమాచారం మరియు ప్రమోషనల్ కియోస్క్) | HYB-Mixed-046 | విద్యానగర్ రైల్వే స్టేషన్ వద్ద ఆఫీస్ ప్రాంగణం/ సపోర్ట్ డెస్క్ / ట్రావెల్ డెస్క్ ఏర్పాటు | 27.09.25 | 15.00 | 15.30 |
| 18 | MSS-HYB-KCG-Mobstore-96-25-1 (Misc. Static Services- మొబైల్స్ మరియు యాక్సెస్సరీస్ కియోస్క్) | | కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ఆపరేషన్ సెట్టింగ్ అప్, మొబైల్ కియోస్క్ యొక్క మెయింటెనెన్స్ మరియు యాక్సెస్సరీస్ ఏర్పాటు | 27.09.25 | 15.10 | 15.40 |
| 19 | పార్కింగ్ | HYB-Parking-044 | మహబూబ్‌నగర్ & బాసర్ వంటి స్టేషన్‌లలో పార్కింగ్ స్థలాలు, 2 స్టేషన్లు ఏర్పాటు | 30.09.25 | 12:00 | 12:40 |
| 20 | పే అండ్ యూజ్ టాయిలెట్స్ | HYB-PNU-FM-02 | ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ వద్ద పే అండ్ యూజ్ టాయిలెట్ల మెయింటెనెన్స్ మరియు ఆపరేషన్ | 30.09.25 | 11:30 | 12:00 |

A1452 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్


# అన్ని మతాల పట్ల గౌరవం ఉంది

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్

### లార్డ్ విష్ణు విగ్రహ పునర్నిర్మాణంపై తన వ్యాఖ్యలను విమర్శిస్తూ సోషల్‌మీడియా పోస్టులపై స్పందన

### ఏ ఒక్క దైవాన్ని సిజెఐ అవమానకరంగా చూడలేదని సమర్థించిన సొలిసిటర్ జనరల్



**న్యూఢిల్లీ :** అన్ని మతాలపట్ల తనకు గౌరవం ఉందని గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బి.ఆర్.గవాయ్ నొక్కిచెప్పారు. లార్డ్ విష్ణు విగ్రహ పునర్నిర్మాణంపై తన వ్యాఖ్యలపై ఆన్‌లైన్ విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో సిజెఐ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'నేను చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చిత్రీకరించబడ్డాయని ఎవరో నాకు చెప్పారు. అయితే నేను అన్ని మతాలను గౌరవిస్తాను' అని భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ధృవీకరించారు. మధ్యప్రదేశ్‌లోని ప్రపంచ వారసత్వ ఖజురహో ఆలయ సముదాయంలో భాగమైన జవారీ ఆలయంలో విష్ణువు విగ్రహాన్ని పునర్నిర్మించడానికి, ఏడు అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సిజెఐ బి.ఆర్.గవాయ్ జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం మే 16న డిస్మిస్ చేసింది. ఈ పిటిషన్‌ను 'ప్రచార ప్రయోజన వ్యాజ్యంగా' పేర్కొన్న సిజెఐ 'ఇది పూర్తిగా ప్రచార ప్రయోజన వ్యాజ్యం. వెళ్లి దేవుడిని ఏదైనా చేయమని అడగండి. మీరు బలమైన విష్ణు భక్తుడని చెబుతుంటే అప్పుడు మీరు ప్రార్థన, కొంత ధ్యానం చేయండి' అని పిటిషనర్‌కు సూచించారు. అదే సమయంలో, మీరు శైవమతం పట్ల విముఖత గనుక చూపకపోతే మీరు అక్కడకు వెళ్లి పూజలు చేసుకోవచ్చు. ఖజురహోలోనే పెద్ద శివలింగాలలో ఒక అతిపెద్ద శివలింగం అక్కడ ఉన్నదని బి.ఆర్.గవాయ్ సూచించారు. ఛత్తర్‌పూర్ జిల్లాలోని జవారి దేవాలయంలో దెబ్బతిన్న విగ్రహాన్ని భర్తీచేసి తిరిగి ప్రతిష్ఠించాలంటూ రాకేష్ దలాల్ అనే వ్యక్తి దాఖలు చేసిన ఒక పిటిషన్‌ను విచారించడానికి సిజెఐ బి.ఆర్.గవాయ్ నిరాకరించారు. సిజెఐ వ్యాఖ్యలు సోషల్ మీడియా పోస్ట్‌ల్లో విమర్శనాత్మక పరిణామాలకు దారితీశాయి.

ఖజురహోలోని లార్డ్ విష్ణుకు సంబంధించి తాను ఎలా విమర్శలకు గురవుతున్నానో అనే విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ప్రస్తావించినప్పుడు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ తాను సిజెఐని గత పది సంవత్సరాలుగా ఎరుగుదునని, ఆయన అన్ని మతపరమైన స్థలలాకు సమాన ప్రాధాన్యతను ఇస్తూ సందర్శిస్తుంటారని , ఏ ఒక్క దైవాన్ని అవమానకరంగామాట్లాడిన సందర్భాలను తాను చూడలేదని అన్నారు. ప్రతిచర్యకూ సమానమైన మరియు వ్యతిరేక చర్యను మనం న్యూటన్ సిద్ధాంతం నుంచి నేర్చుకుని ఉన్నది ఉపయోగిస్తామని, ఇప్పుడు సోషల్ మీడియా అత్యుత్సాహంతో తప్పుడు దారిలో వెళుతుంటే చర్యకు సమానమైన ప్రతిచర్యను ఉపయోగించాల్సి వస్తుందని తుషార్ మెహతా పేర్కొన్నారు. ఖజురహో కేసులో కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది సంజయ్ నూల్‌కూడా సిజెఐపై సోషల్ మీడియాలో విమర్శనాత్మక పోస్టులు పెట్టడం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. నేపాలలో ఇటీవల జరిగిన హింసాత్మక నిరసనలను కూడా సిజెఐ ఈ సందర్భంగా ప్రస్తావించారు.

## పిజి మెడికల్‌లో ట్రాన్స్‌జెండర్ల రిజర్వేషన్ ఉత్వర్వుకు తొందరలేదు

**న్యూఢిల్లీ:** పి.జి మెడికల్ కోర్సుల్లో ట్రాన్స్‌జెండర్ల ప్రవేశానికి రిజర్వేషన్లు ఇచ్చే విషయంపై కేసు విచారణను సుప్రీంకోర్టు ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది. అఖిలభారత కోటా కింద ఇద్దరు ట్రాన్స్‌జెండర్లకు, రాష్ట్ర కోటా కింద ఇద్దరు ట్రాన్స్ జెండర్లకు పి.జి మెడికల్ కోర్సుల్లో సీట్లను రిజర్వు చేయాలని సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ చేసిన విజ్ఞప్తిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రలతో కూడిన ధర్మాసనం ప్రస్తుత దశలో అంగీకరించడానికి తిరస్కరించింది. ఈ కేసును వాయిదా వేసింది. పి.జి. మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సిలింగ్‌కు ఇంకా చాలా సమయం ఉందని, అందువల్ల అలాంటి ఉత్తర్వు జారీ చేయడానికి అప్పుడే ఎలాంటి తొందరా లేదని పేర్కొంటూ ధర్మాసనం సీనియర్ న్యాయవాది విజ్ఞప్తిని అంగీకరించలేదు. ''మనం సీట్లను రిజర్వుచేసి వాటిని అనిశ్చితస్థితిలో ఉంచేయలేం, అఖిల భారత కోటాల్లో సీట్లు రిజర్వు చేయమని మీరు అడుగుతున్నారు, కౌన్సిలింగ్ ఇంకా ప్రారంభం కాలేదు, అందువల్ల ఈ విషయాన్ని మేం వచ్చే వారానికి వాయిదా వేస్తున్నాం'' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. కిరణ్ ఎ.ఆర్‌తోపాటు మరికొందరు కేంద్ర ప్రభుత్వంపై దాఖల చేసిన కేసుపై విచారణ జరుగుతోంది. 2014లో ఇచ్చిన మైలు రాయి వంటి ''నల్సా'' తీర్పు తరహాలో ట్రాన్స్‌జెండర్లకు కూడా రిజర్వేషన్లు ఇస్తూ తీర్పు ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు గుర్తించాలని పిటిషనర్లు కోరుతున్నారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టుకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ అర్చనాపాథక్ దేవ్ మాట్లాడుతూ, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యక్తిగతంగా ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఇంతకుముందు విచారణ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు న్యాయబద్ధమా?కాదా? అని ప్రశ్నించినప్పుడు సుప్రీంకోర్టు ఏది చెబితే అదే ఖరారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఇద్దరూ ట్రాన్స్‌జెండర్లే. వీరిద్దరూ పి.జిమెడికల్స్ ఎంట్రన్స్ రాశారు.

### డ్రోన్ల పర్యవేక్షణ, ప్రశాంత వాతావరణం మధ్య

## ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి ఎన్నికలు

**న్యూఢిల్లీ:** ఢిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం (డియుఎస్‌యు) ఎన్నికల పోలింగ్ గురువారం రెండు విడతలుగా జరిగింది. శుక్రవారం ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. ఈ సారి ఎన్నికలు క్యాంపస్‌లోగానీ, హాస్టల్ ప్రాంగణాలలో గోడలపైన గానీ ఎలాంటి పోస్టర్ల హంగామా లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగాయంటూ విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మైదానం అంతా ఎలాంటి అలజడీ లేకుండా మొదటిసారి ప్రశాంతంగా క్రమ పద్ధతిలో కనిపించిందని హర్షం ప్రకటించారు. ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, తిరిగి సాయంత్రం 3 గంటల నుండి రాత్రి 7.30 గంటలవరకూ రెండు విడతలుగా ఈ ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. దాదాపు 2.80 లక్షలమంది అర్హులైన విద్యార్థి ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. అధికారుల సమాచారం ప్రకారం ఈ ఎన్నికల నిర్వహణకు 160 మంది పోలీసులను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రత సమకూర్చారు. పోలీసులు తమ వెంట బోడీ కెమెరాలను ఉంచుకున్నారు. వీటితోపాటు సిసిటివిలను కూడా ఏర్పాటు చేశారు. డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేశారు.

ముఖ్యంగా మూడు విద్యార్థి బృందాలు ఈ ఎన్నికల్లో పోటీ చేశాయి. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధం అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి), కాంగ్రెస్ మద్దతు ఉన్న నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యుఐ), వామపక్షాల మద్దతు ఉన్న ఎస్‌ఎఫ్‌ఐ–ఎఐఎస్‌ఎ కూటమి సంఘాలు ఈ ఎన్నికల్లో ప్రధానంగా పోటీలో ఉన్నాయి. లైబ్రరీసైన్స్ విభాగం నుండి ఆర్యన్‌మాన్‌ను ఎబివిపి పోటీలో నిలబెట్టగా, ఎన్ఎస్‌యుఐ తరపున బుద్ధిజం అధ్యయనం చేస్తున్న పోస్టుగ్రాడ్యుయేషన్ విద్యార్థిని జోస్లియన్ నందితాచౌధురి, ఎస్‌ఎఫ్‌ఐ–ఎఐఎస్‌ఎ తరపున ఇంద్రప్రస్థ మహిళా కాలేజీ విద్యార్థిని అంజలి ప్రధానంగా పోటీపడ్డారు. నిర్ణీత మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల ప్రచారాన్ని అనుమతించారు. ''రెండోసారి నేను డియుఎస్‌యు ఎన్నికల్లో ఓటు వేశాను, ఈసారి ఎన్నికలు ఎంతో ప్రశాంతంగా, ఎలాంటి హడావుడి, సమస్యలు లేకుండా జరిగాయి, యూనివర్సిటీలో కఠిన నిబంధనలు అమలు చేశారు,

# పెట్టుబడులు పెట్టేందుకు సందేహించొద్దు

### భారత వాణిజ్యరంగానికి నిర్మలా సీతారామన్ పిలుపు



**న్యూఢిల్లీ:** మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు సందేహించవద్దని, పెట్టుబడుల శక్తిసామర్థ్యాలను మరింతగా విస్తరించుకోవాలని భారత వాణిజ్య, పారిశ్రామిక, కార్పొరేట్ రంగ సంస్థలను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను, అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను ఉపయోగించుకోవాలని, ఇంకెంతోకాలం సంకోచించకుండా పెట్టుబడులు విస్తరించి వాటి సామర్థ్యాలను పెంచాలని కోరారు. దేశంలో సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలే భారత స్థూలజాతీయోత్పత్తికి అత్యంత గణనీయంగా దోహదం చేస్తున్నాయన ఆమె అన్నారు. పరస్పర సంభాషణలు, ప్రశ్నలు, సమాధానాలతో కూడిన సదస్సును న్యూఢిల్లీలో గురువారం ఐఎఫ్‌క్యూఎం (భారత నాణ్యతా ప్రమాణాల నిర్వహణాసంస్థ) నిర్వహించింది. ఈ సదస్సులో నిర్మలాసీతారామన్ మాట్లాడుతూ, దేశ యువతరంలో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో భారత పరిశ్రమలు ఒక భాగస్వామిగా చేరాలని, కేవలం బడ్జెట్ తయారు చేయడానికి ముందుగా మాత్రమే కాకుండా ఏడాది అంతటా ఈ కార్యకలాపాలలో కలిసి ముందుకుసాగాలని కోరారు. దేశ తయారీరంగంలో, సేవల విభాగంలో, వివిధ స్థాయిలలో ఉన్న పలు రంగాలలో సంస్థలను గుర్తించి నాణ్యతా ప్రమాణాల నిర్వహణకు పూనుకోవాలని, ఎక్కడ ఎక్కువగా జోక్యం అవసరమో గుర్తించి అక్కడ జోక్యం చేసుకోవాలని కోరారు. టాటా సన్స్ సంస్థ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ అడిగిన కొన్ని ప్రశ్నలపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మరిన్ని పెట్టుబడులు పెట్టండి, యువతకు నైపుణ్యం సమకూర్చడం లో ప్రభుత్వంతో కలిసి భాగస్వాములుగా చేరండి, బడ్జెట్ సమయంలో కాకుండా ఏడాది అంతటా ప్రభుత్వంతో కలిసి ముందుకు నడవండి అనే మూడు అంశాలను గట్టిగా ఉద్ఘాటించి చెప్పారు. దేశ వాణిజ్యరంగ ప్రయోజనాలకోసం సంస్కరణలు తీసుకురావడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పుడూ సందేహించబోరని ఆమె చెప్పారు. ఈ అవకాశాలను దేశ పారిశ్రామిక,వాణిజ్య రంగాలు ఉపయోగించుకోవాలన్నారు. దేశంలో ప్రధానంగా ప్రైవేటు రంగం ముందుకు వచ్చి యువతరాన్ని నిపుణులుగా తీర్చిదిద్దడంలో, వారికి శరవేగంగా ఉద్యోగావకాశాలు ఇవ్వడంలో ప్రభుత్వంతో భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. దీనిపై ఎన్.చంద్రశేఖరన్ స్పందిస్తూ, దేశీయంగాను, విదేశీ మార్కెట్ పరంగాను ప్రభుత్వం అపారమైన అవకాశాలు ఇచ్చిందన్నారు. ఇప్పుడు ప్రపంచదేశాలన్ని సరఫరా వ్యవస్థ నిలదొక్కుకునే విషయంపై దృష్టి సారించాయని, దానికి ప్రత్యామ్నాయ వనరులను అన్వేషిస్తున్నాయని మంత్రి చెప్పగా ఈ సమస్య పరిష్కారానికి భారతదేశం అత్యుత్తమైన కేంద్రంగా ఉండగలదని చంద్రశేఖరన్ బదులిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.11.21 ట్రిలియన్ల పెట్టుబడి వ్యయాలుగా లక్ష్యం నిర్దేశించుకుందని, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల్లోనూ ఈ మూలపెట్టుబడి వ్యయాలను 33 శాతం వరకూ పెంచిందని, గత ఏడాది ఇదే నాలుగు నెలలకాలంలో ఈ వ్యయాలు రూ.3.47 ట్రిలియన్‌లుగా ఉన్నాయని చెప్పారు. పెట్టుబడుల విస్తరణకు ప్రభుత్వం ప్రైవేటు రంగాన్ని ఎక్కువగా ప్రోత్సహిస్తోందని చెప్పారు. కేంద్ర గణాంకాలు, కార్యాచరణ అమలు మంత్రిత్వశాఖ (ఎంఓఎస్‌పిఐ) ఏప్రిల్ నెలలో విడుదల చేసిన సర్వే నివేదిక ప్రకారం, దేశంలో ప్రైవేటు పెట్టుబడులు 2026 ఆర్థిక సంవత్సరంలో 26 శాతం మేరకు తక్కువగా ఉందని అంచనావేసింది. ఈ పెట్టుబడులు రూ.4.29 లక్షలకోట్లుగా ఉంది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ మహిళా నక్సలైట్ మృతి

**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో గురువారం భద్రతా సిబ్బందితో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తొమ్మిది హింసాత్మక సంఘటనల్లో నిందితురాలిగా, తలపై రూ.5 లక్షల బహుమతిని ప్రకటించిన మహిళా నక్సలైట్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గదిరాస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుఫ్డి, పెర్మాపర గ్రామాల మధ్య ఉన్న అటవీ కొండపై ఉదయం కాల్పులు జరిగాయని, రాష్ట్ర పోలీసు యూనిట్ అయిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) బృందం ఆపరేషన్‌కు బయలుదేరిందని ఇక్కడి అధికారి ఒకరు తెలిపారు. ఈ ప్రాంతంలో నక్సలైట్లు ఉన్నారనే సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు పోలీసు అధికారి తెలిపారు. కాల్పులు ఆగిపోయిన తర్వాత, ఎన్‌కౌంటర్ స్థలం నుండి బుస్కి నుప్పో (35) గా గుర్తించబడిన ఒక మహిళా నక్సలైట్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. 315 బోర్ రైఫిల్, దాని ఐదు కార్ట్రిడ్జ్‌లు, ఒక వైర్‌లెస్ సెట్, ఎనిమిది డిటోనేటర్లు, కార్డెక్స్ వైర్ (సుమారు 10 మీటర్లు), నాలుగు జెలటిన్ రాడ్‌లు, గన్‌పౌడర్, ఒక రేడియో, మావోయిస్టు సాహిత్యం, ఇతర సామగ్రిని కూడా సంఘటనా స్థలం నుండి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మావోయిస్టుల మలంగిర్ ఏరియా కమిటీ సభ్యురాలు నుప్పో, సుక్మా, దంతేవాడలోని మూడు పోలీస్‌స్టేషన్లలో 9తీవ్రమైన నక్సల్ సంబంధిత కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నారని, ఆమె తలపై రూ.5 లక్షల రివార్డు ఉందని అధికారి తెలిపారు. తాజా ఘటనతో ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 247 మంది నక్సలైట్లు మరణించారు.

### పోలీసు ఇన్ఫార్మర్ నెపంతో

## వ్యక్తిని హత్యచేసిన మావోయిస్టులు

**బాలాఘాట్ :** మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో పోలీసు ఇన్ఫార్మర్ అనే అనుమానంతో మావోయిస్టులు 25 ఏళ్ల వ్యక్తిని కిడ్నాప్ చేసి చంపారని గురువారం ఒక అధికారి తెలిపారు. మంగళవారం రాత్రి కిడ్నాప్ చేయబడిన బాధితుడు దేవేంద్ర యాదవ్ మృతదేహాన్ని గురువారం ఉదయం లంజి పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌరియా అడవుల నుండి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నేరం జరిగిన ప్రదేశంలో ఎర్ర బ్యానర్, రెండు కరపత్రాలు లభించాయని, ప్రభుత్వం యువకులను ఇన్ఫార్మర్లుగా మార్చడం ద్వారా వారి జీవితాలను 'నాశనం' చేస్తోందని ఆరోపించారని స్థానిక నివాసితులు తెలిపారు.

ప్రజాపక్షం
శుక్రవారం, 19 సెప్టెంబరు

# మరొక అడుగు ముందుకు పడాలి..

ఎట్టకేలకు వారం రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన 'సెప్టెంబర్ 17' అంశం బుధవారంతో వచ్చే ఏడాది వరకు తాత్కాలిక విరామం తీసుకుంది. అయితే, ఈ సారి రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుకల్లో విశేష అంశం చోటు చేసుకున్నది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో సెప్టెంబర్ 17న ప్రభుత్వం 'ప్రజా పాలన దినోత్సవం' పేరుతో అధికారికంగా నిర్వహించిన ఉత్సవాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ''నిజాం నియంతృత్వంపై సామాన్యుడు సాయుధ పోరాటంతో సాధించుకున్న విజయం ఈ రోజు అనుభవిస్తోన్న ప్రజాస్వామ్యం. ప్రపంచ ఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘనత తెలంగాణ సాయుధ పోరాటానిది. 1948 సెప్టెంబర్ 17.. ఈ పోరాటంలో ప్రజలు విజయం సాధించి, స్వేచ్ఛాపతాకను ఎగురవేసిన రోజు'' అని ఆయన అన్న మాటలు అక్షర సత్యాలు నేడు తెలంగాణ ప్రజలు అనుభవిస్తున్న ప్రజాస్వామ్యం, స్వేచ్ఛలను నాటి తెలంగాణ సాయుధ పోరాట ఫలంగా ప్రస్తుతించటం ప్రభుత్వం వైపు నుంచి ముందడుగు. ఇదేదో అధికారిక గుర్తింపునకు తహతహలాడడం కాదు. తెలంగాణ ప్రజలు ఏనాడో ఆ పోరాటాన్ని గుండెల్లో గూడు కట్టుకొని ఆరాధిస్తున్నారు. అయితే, వ్యవస్థ మార్పునకు దారి తీసిన నాటి పోరాట ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి చాటడమే కాకుండా, భవిష్యత్తుకు కూడా అదే పోరాటం స్ఫూర్తి అనడం నాలుగున్నర వేల బలిదానాలకు దక్కాల్సిన గౌరవమే.

ఇది సత్ఫలితమమే, అయినప్పటికీ సరిపోదు. 'సెప్టెంబర్ 17'ను 'తెలంగాణ విలీన దినం' గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నాడు పరిపూర్ణమవుతుంది. ఎందుకంటే, 'సెప్టెంబర్ 17'ను ఏ పేరుతో నిర్వహించాలనే దానిపై ఎన్నో ఏళ్ళుగా చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, నాటి తెలంగాణ ఉద్యమంలో ఇదొక ప్రధాన అంశంగా ఉండేది. 1948లో హైదరాబాద్ సంస్థానం నిజాం రాచరికం వ్యవస్థ నుంచి భారత యూనియన్‌లో విలీనమైందనేది చారిత్రక వాస్తవం. స్థూలంగా తెలంగాణలో అన్ని పార్టీలు, ముఖ్యంగా నాటి ప్రజా పోరాటానికి నేతృత్వం వహించిన సిపిఐ, నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న స్టేట్ కాంగ్రెస్ వారసత్వం పుణికిపుచ్చుకున్న కాంగ్రెస్ 'సెప్టెంబర్ 17'ను తెలంగాణ దినోత్సవంగా నిర్వహించడంపై ఆమోదానికి వచ్చాయి. కమ్యూనిస్టు పార్టీ అనేక దశాబ్దాలుగా సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు సాయుధ పోరాట వారోత్సవాలను ఏటా నిర్వహిస్తూ, ముగింపు రోజున జాతీయ జెండాను ఎగురవేసి, భారీ సభను నిర్వహిస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి దాదాపు అన్ని పార్టీలు తమ తమ కార్యాలయాలలో ఆ రోజున జాతీయ జెండాను విధిగా ఎగురవేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తమ కార్యాలయం కొలువై ఉన్న గాంధీభవన్‌లో ఈసారి కూడా తెలంగాణ విలీన దినోత్సవం పేరుతో ఉత్సవాలు నిర్వహించింది. అలాంటప్పుడు ఆ పార్టీ నేతృత్వం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం 'సెప్టెంబర్ 17'ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడంలో ఔచిత్యమేమిటి? తెలంగాణ విలీన దినంగా అధికారికంగా ప్రకటించి నిర్వహించడంలో మీనమేషాలు ఎందుకు? తెలంగాణలో ఇదొక విచిత్ర పరిస్థితి. ప్రతిపక్షంలో ఉండగా తెలంగాణ విలీన దినోత్సవంగా పాటించిన బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌లో అధికారంలోకి వచ్చాక వేరు పేర్లతో నిర్వహించడం వైరుధ్యం. వారికి ఆయా కాలాలలో మిత్రపక్షంగా ఉన్న ఎంఐఎంను నొప్పించ కూడదనే ఇలాంటి వెసులుబాటు ఇస్తున్నాయనేది జనాంతికంగా వినిపించే అభిప్రాయం. చారిత్రక వాస్తవాలను కప్పిపుచ్చితే, వాస్తవాలను వక్రీకరించి లబ్ది పొందాలనుకునే శక్తులకు ఊతమిస్తున్నట్లవుతుంది.

ఎందుకంటే నాటి మహోజ్వల పోరాట చరిత్రను ముస్లిం రాజు, హిందూ ప్రజలకు జరిగిన మత పోరాటంగా చిత్రీకరించేందుకు దాదాపు మూడు దశాబ్దాలుగా బిజెపి , ఆర్‌ఎస్‌ఎస్ కిందా మీదా పడుతున్నాయి. 1998 సెప్టెంబర్ 17న నాటి కేంద్ర హోం మంత్రి అద్వానీని నిజాం కాలేజీకి పిలిపించి 'తెలంగాణ విమోచన దినోత్సవం' నిర్వహించింది. నాటి నుంచి చరిత్ర వక్రీకరించి, ప్రజలను విభజించి రాజకీయ లబ్ది పొందేందుకు తీవ్ర ప్రయత్నాలను సాగిస్తున్నది సంఘ్ పరివార్. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా 2023 నుంచి సెప్టెంబర్ 17న 'జాతీయ సమైక్యత దినోత్సవం'గా అధికార వేడుకలను నిర్వహించడం ప్రారంభించారు. అదే ఏడాది నుంచి సికిందరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో 'తెలంగాణ విమోచన దినం' పేరిట బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉత్సవాలను కొనసాగిస్తున్నది. ఆ సందర్భంగా నాటి పోరాట కీర్తిని తొలి హోం మంత్రి సర్దార్ వల్లభ్ బాయ్ పటేల్‌కు కట్టబెట్టి, ప్రజా పోరాటానికి దిక్సూచిగా నిలిచిన కమ్యూనిస్టుల పాత్రను కుదించే ప్రయత్నం నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. ఈసారి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర రక్షణశాఖామాత్యులు రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగం అదే బాటలో సాగింది.హైదరాబాద్ సంస్థానంలో జరిగినది మత పోరాటం కాదు, ప్రజల పోరాటమని తెలియజేసేందుకు నాటి పోరాట చరిత్రకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ప్రచారం కల్పించాలి. పాఠ్యాంశాలలో చేర్చి, సాయుధ పోరాటం, వీరుల చరిత్రతో మ్యూజియం లేదా స్మారక కేంద్రం ఏర్పాటు చేయడం సముచితం. నాటి ప్రముఖ వీర యోధుల విగ్రహాలను ఏర్పాటు చేయడం, ప్రధాన ప్రాంతాలు, పథకాలు, ప్రాజెక్టులకు పేర్లు పెట్టడం ద్వారా భవిష్యత్తు తరాలు చరిత్ర వక్రీకరణలకు లోనవకుండా దోహదం చేసినట్లవుతుంది. అన్నిటికి మించి మరొక అడుగు ముందుకు వేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఏడాదికల్లా 'సెప్టెంబర్ 17' ను విలీన దినోత్సవంగా నిర్వహించడం ద్వారా ఈసారి ఆయన ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలకు సార్థకత లభిస్తుంది.

# నిరుద్యోగంపై ఏ నివేదికలను నమ్మాలి?

నంటూ బెనర్జీ

భారతదేశ కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా ఇటీవలే చేసిన ప్రకటన ప్రకారం జి–20 దేశాలలో భారతదేశ నిరుద్యోగిత రేటు రెండు శాతంతో అత్యల్పంగా ఉంది. అయితే, వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల రికార్డుల ప్రకారం ఈ ప్రకటన విశ్వసనీయతను కోల్పోయింది. జాతీయ కెరీర్ సర్వీస్ పోర్టల్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు, ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడం గురించి 'మెంటార్ టుగెదర్' అనే డిజిటల్ మెంటార్‌షిప్ ప్లాట్‌ఫామ్, అలాగే 'క్వికర్' అనే క్లాసిఫైడ్స్ ఆన్‌లైన్ సైట్‌తో తన మంత్రిత్వ శాఖ ఎంఒయుపై సంతకం చేసిన సందర్భంలో మాండవియా ఈ విషయాన్ని ప్రస్తావించారు.

మరో ప్రభుత్వ విభాగం గణాంక, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ (ఎంఒఎస్‌పిఐ) విడుదల చేసిన సర్వే రికార్డుల గురించి మాండవియా ఆధీనంలోని కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు పూర్తిగా తెలిసి ఉండకపోవచ్చు. ఎంఒఎస్‌పి ఐ గత సంవత్సరం నిరుద్యోగితను 3.2 శాతంగా నమోదు చేసింది. ఇది చాలా ఎక్కువ. ఈ రెండు గణాంకాల మధ్య వ్యత్యాసం 60 శాతంగా ఉంది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్‌ఎఫ్‌ఎస్) డేటా ప్రకారం, 2024లో భారతదేశ అధికారిక నిరుద్యోగిత రేటు 3.2 శాతం, ఇది అంతకు ముందు సంవత్సరం 3.1 శాతం కంటే స్వల్పంగా పెరిగింది. ఈ అధిక నిరుద్యోగిత రేటుకు ప్రధాన కారణం, మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు స్వల్పంగా తగ్గడం. అయితే, పురుషుల భాగస్వామ్య రేటు మాత్రం స్వల్పంగా పెరిగింది.





పిఎల్‌ఎఫ్‌ఎస్ డేటా ప్రకారం, మొత్తం నిరుద్యోగిత రేటు 3.2 శాతం కాగా, శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (ఎల్‌ఎఫ్‌పిఆర్) 59.6 శాతానికి తగ్గింది. మహిళా ఎల్‌ఎఫ్‌పిఆర్ గత సంవత్సరం 41.3 శాతం నుంచి 40.3 శాతానికి పడిపోయింది. పురుషుల ఎల్‌ఎఫ్‌పిఆర్ 78.3 శాతం నుంచి 79.2 శాతానికి పెరిగింది. గణాంక, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ నిర్వహించే ముఖ్య సర్వేలలో ఎల్‌ఎఫ్‌పిఆర్ ఒకటి. దీని పద్ధతి ప్రిన్సిపల్, సబ్సిడరీ స్టేటస్‌పై ఆధారపడి ఉంటుంది. ఇది కరెంట్ వీక్లీ స్టేటస్ (సిడబ్ల్యుఎస్)తో పోలిస్తే భిన్నమైన చిత్రాన్ని చూపిస్తుంది. సిడబ్ల్యుఎస్ ప్రకారం 2024లో నిరుద్యోగిత రేటు 4.9 శాతానికి తగ్గింది. ఈ డేటా వివిధ ప్రాంతాలు, లింగాలలో భిన్నమైన ధోరణులను చూపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం నిరుద్యోగిత తగ్గుముఖం పట్టినా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళల భాగస్వామ్యం తగ్గింది.

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ) నివేదికల ప్రకారం 2024లో భారతదేశ మొత్తం నిరుద్యోగిత రేటులో తగ్గుదల కనిపించినప్పటికీ, కచ్చితమైన సంఖ్య, పురుషులు, మహిళల ధోరణులపై నివేదికలు భిన్నంగా ఉన్నాయి. ఐఎల్‌ఒ నివేదిక ప్రకారం సాధారణ, స్వయం ఉపాధి కార్మికులకు నిజ వేతనాలు తగ్గాయి. అయితే, సంస్థాగత రంగంలో యువతకు ఉపాధి పెరగడం, ఎక్కువమంది మహిళలు శ్రామిక శక్తిలో చేరడం కనిపించింది. ఈ–శ్రమ్ పోర్టల్ అసంఘటిత కార్మికుల డేటాబేస్‌ను రూపొందించడం, సామాజిక భద్రతా పథకాలను అనుసంధానించడం కొనసాగిస్తోంది. 2024 డిసెంబర్ నాటికి 30.5 కోట్లకు పైగా కార్మికులు ఇందులో నమోదయ్యారు.

ఈ–శ్రమ్ పోర్టల్ వివిధ సామాజిక భద్రతా పథకాలను అనుసంధానించే సెంట్రల్ హబ్. ఐఎల్‌ఒ నివేదికలోని ముఖ్య అంశాలు: ఇపిఎఫ్‌ఒ (ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ) సభ్యత్వాలలో నికర పెరుగుదల, ఇది సంఘటిత ఉపాధి వైపు మళ్లడాన్ని సూచిస్తుంది. (29 ఏళ్ల లోపు) యువకులు సంఘటిత రంగంలో నికర వేతన పెరుగుదలలో అధిక భాగం ఉన్నారు. మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (ఎఫ్ ఎల్‌ఎఫ్‌పిఆర్)లో చెప్పుకోదగిన పెరుగుదల. స్వయం ఉపాధి కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉండడం వ్యాపార కార్యకలాపాలు, సులభమైన పని వైపు చూస్తున్న ధోరణిని సూచిస్తుంది. సాధారణ, స్వయం ఉపాధి కార్మికులకు నిజ వేతనాలు స్తంభించడం లేదా తగ్గడాన్ని పరిశీలిస్తే కేవలం రోజువారీ కూలీలకే స్వల్పంగా వేతనం పెరుగుతున్న ధోరణికి కనపడుతోంది.

పరస్పర విరుద్ధమైన నిరుద్యోగ గణాంకాలు, దేశంలో ఏటా 100 రోజులు మాత్రమే ఉద్యోగ హామీ లభిస్తున్న నిరుద్యోగుల సంఖ్య పెరుగుదలను గురించి వివరించలేదు. 2024–25లో ఈ పథకం కింద కనీస సగటు దినసరి వేతనం కేవలం రూ. 279. మరి మిగిలిన 265 రోజులు ఈ ఉద్యోగార్థులు ఏం చేస్తారు? వారికి ఎక్కడ ఉపాధి దొరుకుతుంది? వారు ఇంకా ఎన్ని రోజులు పని చేయగలుగుతారు? గత ఆర్థిక సంవత్సరంలో, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (మహాత్మాగాంధీ నరేగా) కోసం ప్రభుత్వం రూ.86,000 కోట్లను కేటాయించింది. ఇది ఈ పథకం చరిత్రలోనే అత్యధిక బడ్జెట్ అంచనా. ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లోనే, బడ్జెట్‌లో దాదాపు 60 శాతం ఖర్చయింది. ఇది తక్కువ వేతనం ఉన్న ఈ ఉద్యోగాలకు ఎంత డిమాండ్ ఉందో సూచిస్తుంది.

మరోవైపు, దేశంలోని ప్రముఖ ప్రభుత్వేతర సంస్థలలో ఒకటైన సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) భారతదేశంలో నిరుద్యోగం గురించి పూర్తిగా భిన్నమైన చిత్రాన్ని అందిస్తుంది. సిఎంఐఇ అంచనా ప్రకారం, భారతదేశ ప్రస్తుత నిరుద్యోగ రేటు 7.1 శాతం. సిఎంఐఇ నెలవారీ నిరుద్యోగ రేటు డేటా ప్రకారం, ఈ సంవత్సరం మార్చిలో ఇది 7.6 శాతం, ఏప్రిల్‌లో 7.7 శాతం, మేలో 6.9 శాతం, జూలైలో 6.8 శాతం, ఆగస్టులో 7.1శాతంగా ఉంది. ఈ సంవత్సరం మార్చిలో, భారతదేశ కార్మిక మార్కెట్ కుంచించుకు పోయిందని, సుమారు 4.2 మిలియన్ల మంది ఉద్యోగాలను కోల్పోయారని లేదా ఉద్యోగం కోసం వెతకడం మానేశారని సిఎంఐఇ ఇటీవల ఉపాధి ధోరణులపై నివేదించింది. గత జూన్‌లో కనిపించిన నిరుద్యోగ పెరుగుదల గ్రామీణ భారతదేశంలో కేంద్రీకృతమై ఉంది. నిరుద్యోగ రేట్లు హెచ్చుతగ్గులకు లోనవుతూ ఉంటాయి. ఉదాహరణకు, గత సంవత్సరం జూన్‌లో గ్రామీణ, పట్టణ రంగాలలోని సమస్యల కారణంగా నిరుద్యోగ రేటు 9.2 శాతానికి పెరిగింది. తర్వాత నవంబర్ నాటికి స్వల్పంగా తగ్గి ఎనిమిది శాతానికి చేరింది.

వాస్తవానికి, సిఎంఐఇ ఇటీవల వెలువరించిన డేటా మరింత తీవ్రమైన ఉద్యోగలేమి పరిస్థితిని చూపిస్తుంది. దాని ప్రకారం, 20–24 ఏళ్ల మధ్య వయస్సు గల భారతీయులలో 44.5 శాతం మందికి ఉద్యోగం లేదు. వారిలో చాలామందికి గ్రాడ్యుయేట్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు కూడా ఉన్నాయి. 'ఇండియా స్కిల్స్' నివేదిక – 2025 ప్రకారం, భారతీయ గ్రాడ్యుయేట్లలో కేవలం 54.8 శాతం మంది మాత్రమే ఉద్యోగానికి అర్హులు. నిరుద్యోగంపై అధికారిక, స్వతంత్ర డేటా మధ్య ఉన్న వైరుధ్యాలు తరచుగా సమస్య వాస్తవ పరిస్థితిని కప్పిపుచ్చుతాయి. దురదృష్టవశాత్తూ, వివిధ ప్రభుత్వ సంస్థల నుండి వచ్చే నిరుద్యోగ డేటా ఈ తీవ్రమైన, క్లిష్టమైన సమస్య తీవ్రతను తక్కువ చేసి చూపిస్తున్నట్లు స్పష్టమవుతోంది. తీవ్రమైన యువ నిరుద్యోగం లేదా అండర్ ఎంప్లాయ్‌మెంట్(అర్హత కంటే తక్కువ స్థాయి ఉద్యోగాలు) గురించి చాలా తక్కువగా ప్రస్తావిస్తున్నారు. జూన్ 2025 లో 15–29 ఏళ్ల మధ్య వయస్సు గల యువత నిరుద్యోగ రేటు 15.3 శాతంగా ఉంది. పట్టణ యువత నిరుద్యోగ రేటు 18.8 శాతానికి చేరుకుంది. గత మేలో ఒక నివేదిక ప్రకారం, చాలామంది నిరుద్యోగ యువకులు 'నిరుత్సాహపడిన కార్మికులు'గా మారి, ఉద్యోగాల కోసం వెతకడం పూర్తిగా మానేశారు. 2023లో గ్రాడ్యుయేట్ల నిరుద్యోగ రేటు 29.1శాతం కాగా, చదవడం, రాయడం తెలియని వారిలో ఇది కేవలం 3.4 శాతంగా ఉంది.

సంఘటితరంగంలో కొత్త ఉద్యోగాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఉద్యోగ మార్కెట్‌లో అనియత రంగం ఆధిపత్యం పెరిగింది. ఇక్కడ ఎక్కువ మంది కార్మికులకు తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల అధిక స్థాయిలో అండర్ ఎంప్లాయ్‌మెంట్ లేదా కనిపించని నిరుద్యోగం ఉంది. భారీ, అస్తవ్యస్తమైన అనియత రంగం కారణంగా నిరుద్యోగాన్ని కచ్చితంగా కొలవడం దాదాపు అసాధ్యం. ఆశ్చర్యకరంగా అధికారిక డేటా పూర్తిగా భిన్నమైన చిత్రాన్ని చూపిస్తుంది. 2023–24లో 4.67 కోట్ల ఉద్యోగాలతో ఉపాధి కల్పనలో అధిక వేగాన్ని, 2024–25లో కూడా అదే వేగాన్ని కొనసాగిస్తూ, సంఘటిత, అనియత రంగాలలో వృద్ధి కనిపిస్తున్నట్లు పేర్కొంటోంది. అదే సమయంలో భారతదేశ ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్‌ఒ)లో రిజిస్ట్రేషన్‌లు మాత్రం తగ్గుతున్నాయి. ఇది చాలా గందరగోళంగా ఉంది. వివిధ అధికారిక, ప్రభుత్వేతర సంస్థల నుండి వచ్చే ఉద్యోగ డేటా సరిపోలడం లేదు. బహుశా, దేశంలోని నిరుద్యోగ పరిస్థితిపై కొంత విశ్వసనీయమైన అంకెలను అందించేందుకు ఉపాధి మంత్రి మన్‌సుఖ్ మాండవియా పార్లమెంటులో ఒక ప్రకటన చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

(ఐపిఎ సర్వీస్)

# కెటిఆర్ కు 'జూబ్లీహిల్స్' పరీక్ష?



ఎస్.కె. జకీర్

''జూబ్లీహిల్స్ నుంచే బిఆర్‌ఎస్ జైత్రయాత్ర ప్రారంభం కావాలి'' అని కెటిఆర్ పిలుపు నిచ్చారు. ఈ ఉప ఎన్నికను బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు బాధ్యతను కెటిఆర్ తన భుజాన ఎత్తుకున్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అనుకున్న ఫలితం రాని పక్షంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రాజీనామా చేస్తానని కెటిఆర్ సవాలు చేస్తారేమో తెలియదు. నిజానికి ఈ ఉపఎన్నిక కెటిఆర్ నాయకత్వ పటిమకు, ప్రతిభకు పరీక్ష.


''కొన్నిబస్తీల్లో వెనుకంజలో ఉన్నాం. కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపుకోసం కృషి చేయాలి'' అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో అన్నారు. ''ప్రతి కుటుంబంలో గొడవలు సహజం. వాటిని వీధుల్లోకి తీసుకురాం. ఒక గదిలో కూర్చొని పరిష్కరించుకుంటాం. అంతేకానీ బజారుకెక్కుతామా!'' అని మరో సభలో ఆయన చెప్పారు. ఈ వ్యాఖ్యలు జూబ్లీహిల్స్ బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత కుటుంబసభ్యుల మధ్య జరుగుతున్న ఘర్షణల గురించి చేసి ఉండవచ్చు. కానీ తన సోదరి కవితతో తలెత్తిన విభేదాలను పరిష్కరించుకోలేకపోయిన కెటిఆర్ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా కనిపిస్తున్నవి. 'కొన్ని బస్తీల్లో వెనుకంజలో ఉన్నామ'ని కెటిఆర్ స్వయంగా ఒప్పుకోవడం వలన బిఆర్‌ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బలహీనంగా ఉన్నట్టు అర్థమవుతోంది. ఈ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో పార్టీని గెలిపించడమే గోపీనాథ్‌కు సరైన నివాళి అని కెటిఆర్ పేర్కొన్నారు.

ఓటుకు రూ.5 వేలు పంచితే గెలుస్తామని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారని విమర్శించారు. అసలు ఓటర్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా డబ్బు పంపిణీ చేసే సంస్కృతిని తెలంగాణ అంతటా విస్తరింపజేసిన ఘనత కెసిఆర్ పార్టీకి దక్కుతుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. హుజురాబాద్, మునుగోడు, దుబ్బాక ఉపఎన్నికల్లో డబ్బు ఎలా ప్రవహించిందో బిజెపి ఎంపిలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు వంటి వారు లెక్కలతో సహా చెప్పగలరు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం చంద్రబాబు, వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలోనూ ఉన్నప్పటికీ 'ధనబలాన్ని' ఎక్కువగా ప్రదర్శించిన పార్టీగా బిఆర్‌ఎస్ కు అపకీర్తి ఉన్నది. పైగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలో ఉండిన బిఆర్‌ఎస్ కనుసన్నల్లో 'ఫోన్ ట్యాపింగ్' జరిపి ప్రత్యర్థి పార్టీ కాంగ్రెస్ అభ్యర్థులకు డబ్బు చేరకుండా వలపన్ని పట్టుకున్న ఘటనలు కోకొల్లలు. ఫోన్ ట్యాపింగ్ కేసులోని నిందితులే ఈ విషయాలను 'సిట్' కు ఇచ్చిన వాంగ్మూలంలో తెలిపినట్లు కథనాలు వచ్చాయి. అప్పటి ఎస్ఐబి చీఫ్, మాజీ ఐపిఎస్ అధికారి ప్రభాకరరావు సారధ్యంలో పోలీసు అధికారులే ఒక 'ముఠా' గా, ప్రయివేటు సైన్యంగా ఏర్పడి ఎంతగా స్వైరవిహారం చేశారో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ 'సిట్' కు తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల అగ్ని పరీక్షల్లో విఫలమై 'ఫామ్ హౌస్ వాసం' చేస్తున్న బిఆర్‌ఎస్‌కు ఇప్పుడు అన్నీ అగ్ని పరీక్షలే. అన్నీ సవాళ్ళే. ఇందులో కెసిఆర్ కుటుంబంలో రచ్చకెక్కిన రాజకీయ విభేదాల నుంచి ఆ పార్టీ బయటపడలేకపోతున్నది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు అగ్ని పరీక్ష మాత్రమే కాదు, బిఆర్‌ఎస్ కు జీవన్మరణ పరీక్ష. ఈ ఉప ఎన్నికలో నెగ్గితే పార్టీకి జీవకళ రానుంది. కంటోన్మెంటులాగా ఓడిపోతే పార్టీ పరిస్థితి మరింత దిగజారిపోతుందని కెసిఆర్, కెటిఆర్ వణికిపోతున్నారు. బిఆర్‌ఎస్ ముఖ్య నాయకులపై కవిత అవినీతి ఆరోపణలు ఒక పక్క, పార్టీ నుంచి కవిత సస్పెన్షన్ బిఆర్‌ఎస్ ను నైతికంగా కుంగదీస్తున్నది. కనుక జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం బిఆర్‌ఎస్‌కు రాజకీయంగా 'ప్రాణభిక్ష' పెడుతుందో, లేదో చూడవలసి ఉన్నది. ఈ ఉప ఎన్నికలో బిఆర్‌ఎస్ విజయం గులాబీ జెండాకు ప్రాణ వాయువు. కెసిఆర్ కారుకు రాజకీయంగా బుల్లెట్ ప్రూఫ్ అవుతుంది.

''బిఆర్‌ఎస్, బిజెపిలో విలీనం కాబోతుంది. బిఆర్‌ఎస్ లో కాంగ్రెస్ కోవర్టుల రాజకీయమే నడుస్తుంది'' అని కవిత బిఆర్‌ఎస్ ఉనికి మీదే అనుమానాలు రేకెత్తించేలా రాజకీయ ఆరోపణలు చేసారు. అధికార కాంగ్రెస్ పార్టీ సైతం కెసిఆర్, కెటిఆర్ ల అవినీతికి బిజెపి రక్షణ కవచంలా నిలుస్తుందని, బిజెపి, బిఆర్‌ఎస్ తెరచాటు రాజకీయాలు నడుపు తున్నారంటూ విమర్శిస్తోంది. ఇక బిజెపి విషయానికొస్తే తెలంగాణలో బిఆర్‌ఎస్ గులాబీ ఎప్పుడో వాడిపోయిందని, కెసిఆర్ కారు పార్టీ ఓటమితోనే కుదేలయింది బిఆర్‌ఎస్ చచ్చిన పాము అంటూ గులాబీ పార్టీ అస్తిత్వాన్ని సవాల్ చేస్తున్నారు. ఇలా బిఆర్‌ఎస్ పార్టీ చుట్టూ కవిత, రేవంత్, బిజెపి లు ఆరోపణలతో, విమర్శలతో, సవాళ్లతో ముప్పేట దాడి చేస్తున్న ఈ నేపథ్యంలో బిఆర్‌ఎస్ కు ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు ఈ జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో పార్టీ గెలుపు అత్యంత కీలకమైనది.






ఈ ఉప ఎన్నికలో బిఆర్‌ఎస్ పార్టీ తన మునపటి హవాను కొనసాగించగలిగితే అది అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అవుతుంది. కానీ బిఆర్‌ఎస్ పై, ఆ పార్టీ ముఖ్య నాయకులపై కవిత చేసిన అవినీతి ఆరోపణలు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ప్రభావం చూపవచ్చు. బిఆర్‌ఎస్ విజయం సాధించగలిగితేనే ప్రత్యర్థుల అవినీతి ఆరోపణలకు, అక్రమాల విమర్శలకు,'విలీన' ప్రచారానికి చెక్ పెట్టినట్టవుతుంది. బిఆర్‌ఎస్ భవిష్యత్ నాయకత్వం మీద కూడా పార్టీ క్యాడర్‌లోభరోసా అందించినట్టవుతుంది. అలాకాకుండా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బిఆర్‌ఎస్ ప్రజామోదం పొందకపోతే ఇక రానున్న రోజులలో బిఆర్‌ఎస్ మనుగడకు 'తీవ్ర ప్రమాదం' ఎదురు కానుంది.

జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని బిఆర్‌ఎస్ పట్టుదలగా ఉంది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీతను అభ్యర్థిగా బరిలోకి దించుతున్నారు. నియోజకవర్గంలోని పార్టీ కేడర్ కూడా ఆమె అభ్యర్థిత్వానికి ఆమోదం తెలిపింది. అయితే, అధికార కాంగ్రెస్ పార్టీ ఎత్తుగడలు, బిఆర్‌ఎస్‌పై కేసులు, కవిత ఎపిసోడ్ పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. పార్టీ పరిస్థితి నానాటికీ దిగజారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించిన జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నివేదికలో కెసిఆర్‌ను ప్రధాన బాధ్యుడ్ని చేసింది. ఈ కేసుపై సిబిఐ విచారణకు కేంద్రప్రభుత్వం ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపించింది.

ఫార్ములా ఈ కార్ రేసు కేసులో కెటిఆర్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని ఎసిబి ఆధారాలు సమకూర్చి పెట్టుకుంది. ఈ రెండూ బిఆర్‌ఎస్‌కు ఇబ్బందికరంగా మారాయి. ఇవి పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీశాయి. అయితే 'హైడ్రా'ను అస్త్రంగా మలుచుకునేందుకు బిఆర్‌ఎస్ సిద్ధమవుతున్నప్పటికీ అది పెద్దగా వర్కవుట్ అయ్యేలా లేదు. హైడ్రా ద్వారా రేవంత్ ప్రభుత్వం బిల్డర్లను బెదిరిస్తోందని, వాళ్ల నుంచి డబ్బులు వసూలు చేస్తోందని కెటిఆర్ ఆరోపిస్తున్నారు.

పేదల ఇళ్లను కూల గొడుతోందని, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటేస్తే పేదల ఇళ్లు ఉండవని చెప్తున్నారు. ఈ మాటల్ని జనం పెద్దగా పట్టించుకోవడం లేదు. హైడ్రా బతుకమ్మ కుంట వంటి చెరువులను, జలవనరులను కాపాడింది. దాదాపు రూ.500కోట్లకు పైగా విలువచేసే ఆస్తులను ఆక్రమణదారుల నుంచి రక్షించింది. కనుక హైడ్రా ట్రాక్ రికార్డును కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మలచుకుంటోంది.

అయితే ఎలాగైనా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలవాల్సిన పరిస్థితి బిఆర్‌ఎస్ కు ఏర్పడింది. పార్టీమారిన ఎమ్మెల్యేల స్థానాల్లో ఉపఎన్నికలు వస్తాయని, కేడర్ సిద్ధంగా ఉండాలని బిఆర్‌ఎస్ ఎప్పటినుంచో చెప్తూ వస్తోంది. సుప్రీం కోర్టు తీర్పుతో బిఆర్‌ఎస్‌లో ఆ నమ్మకం కూడా కలిగింది. కానీ జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిస్తేనే కేడర్‌లో ఆ నమ్మకం వస్తుంది. అప్పుడు పార్టీ మారిన ఎమ్మెల్యేల స్థానాల్లో ఉపఎన్నికలు వచ్చినా తమదే గెలుపు అని చెప్పుకునేందుకు వీలవుతుంది. అందుకే ముందు జూబ్లీహిల్స్ బైపోల్‌లో గెలవాల్సిన ఆవశ్యకత బిఆర్‌ఎస్‌కు ఏర్పడింది. బిఆర్‌ఎస్ పార్టీకి జూబ్లీహిల్స్ ఎన్నిక అత్యంత ప్రతిష్ఠాత్మకమే. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాల్లో ఫలితాలు ప్రతికూలంగా వచ్చినప్పటికీ, హైదరాబాద్,ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మాత్రం అనుకూల ఫలితాలు వచ్చాయి.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా కెసిఆర్ నేతృత్వంలో వంద స్థానాలు ఖాయమని కెసిఆర్ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో బిఆర్‌ఎస్ బలంగా ఉందని, ప్రజల నుంచి పూర్తి మద్దతు ఉంటుందని అంటున్నారు.

ఇదిలాఉండగా బిఆర్‌ఎస్ అభ్యర్థిగా ఖరారు అయిన మాగంటి సునీత కుటుంబ సభ్యుల మధ్య గతంలో ఎప్పుడో నెలకొన్న విభేదాలు ఇప్పుడు ఎన్నికల వేళ బయటపడుతుండడం పట్ల కెటిఆర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాగంటి గోపీనాథ్ సోదరుడు వజ్రనాథ్ కొన్ని చానళ్లలో సునీతను ఉద్దేశించి ''ఆమె పొటెన్షియల్ అభ్యర్థి కాదు'' అన్న వ్యాఖ్యలు వైరల్ అవుతున్నవి. వజ్రనాథ్ కూడా బిఆర్‌ఎస్ టికెట్టు ఆశించారు. కానీ పార్టీ హైకమాండ్ సునీత అభ్యర్థిత్వం వైపు మొగ్గు చూపింది. దీంతో ఆ కుటుంబంలో పరిణామాలు పార్టీపై ఎంత ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

ఇక కవిత తరపున 'తెలంగాణ జాగృతి' అభ్యర్థి రంగంలో దిగబోతున్నారు. మరోవైపున చింతపండు నవీన్ సెప్టెంబర్ 17 న ప్రకటించిన 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' అభ్యర్థి కూడా బరిలో దిగడం తథ్యం. దీంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బహుముఖ పోటీ జరిగే అవకాశాలు కనిపిస్తున్నవి. తెలంగాణ రాజ్యాధికార పార్టీ, కవిత అభ్యర్థి బిఆర్‌ఎస్ విజయానికి గండికొట్టే అవకాశాలపై చర్చ జరుగుతోంది.

# ప్రజాస్వామ్యం కోసం వేదిక ఇచ్చారు... స్పందన ఎక్కడ?

లేఖ

ప్రభుత్వాన్ని మనం ప్రజల సేవకుడిగా చూడాలని నేర్పారు. దేశ అభివృద్ధికి, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిని అందించాల్సిందేనని భావిస్తాం. అందుకే ప్రతి కుటుంబం తన ఆదాయంలో కొంత భాగాన్ని పన్నుల రూపంలో చెల్లించి, ప్రభుత్వంపై నమ్మకంతో జీవిస్తోంది. తన సమస్యను చెప్పుకునేందుకు, తన కష్టాలను వినిపించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేదికలు ఉన్నాయని నమ్ముతూ ముందడుగు వేస్తుంది. గ్రామాల్లో నీటి సమస్య వచ్చినా, పట్టణాల్లో విద్యుత్ నిలిచిపోయినా, ఆసుపత్రిలో మందులు అందక బాధపడుతున్నా, స్కాలర్‌షిప్ అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా ఇలా ఎన్ని సమస్యలు ఉన్నా ఇవన్నీ ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఇ–మెయిల్ ఐడిలు, టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు. కానీ వాటి వలన ఎటువంటి స్పందన ఉండటం లేదు. ఫిర్యాదు చేసిన తర్వాత రోజులు, వారాలు గడిచినా పరిష్కారం లేకపోవడం అనుభవంగా మారుతోంది. సమస్య ఎక్కడికి వెళ్లిందో కూడా తెలియని పరిస్థితులు చాలాచోట్ల కనిపిస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న సేవలు పేరుకోసం మాత్రమేనా? సమస్యను వినేందుకు ఉన్న నెంబర్లు కేవలం రూపకల్పనగా మిగిలిపోయాయా? అనే ప్రశ్నలు ప్రతి ఒక్కరి మనసులో కలుగుతున్నాయి. ప్రజల బాధను పట్టించుకోకుండా ప్రభుత్వ కార్యాలయాలు వ్యవహరించడంతో నమ్మకం క్రమంగా తగ్గుతోంది. ప్రతి వ్యక్తి చెల్లించే పన్నుల ద్వారా ప్రభుత్వ సేవలపై ఆధారపడుతూ జీవిస్తాడు. అలాంటి సమయంలో స్పందన లేకపోతే నిరాశ.. ప్రభుత్వంపై నమ్మకం పోతుంది. అలాంటప్పుడు సమస్యను పరిష్కరించుకునేందుకు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది, వ్యవస్థపై అసహనం పెరిగి, సామాజిక సంక్షోభంగా మారుతుంది. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో మాత్రమే పరిమి తం కాదు. రోజువారీ సేవల ద్వారా, సమస్యలపై స్పందించే విధానాల ద్వారా ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. అధికారుల పని కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు ప్రజల మాట విని, తక్షణంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవడం ముఖ్యమైన బాధ్యత. ఒక ఫోన్ కాల్‌కు కూడా సమాధానం అందని పరిస్థితిలో ఉన్న కార్యాలయాలు ప్రజల సమస్యలను పరిష్కరించగలవా? అనే ప్రశ్న ఎన్నో చోట్ల మారుమ్రోగుతోంది. స్పందించకపోవడం వల్ల ప్రజలు అసహనంతో నిండిపోతున్నారు. మధ్యవర్తుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

సేవలపై విశ్వాసం తగ్గిపోతోంది. ఇది వ్యక్తిగత సమస్యగానే కాదు, సమాజ స్థాయిలో ప్రభావాన్ని చూపే పెద్ద సంక్షోభంగా మారుతోంది. న్యాయంగా సేవలు అందకపోతే సామాజిక అసమానతలు, అసంతృప్తి, నిరుత్సాహం పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వానికి ప్రజల నుండి వినిపిస్తున్న సమస్యను వినాలి సమస్యను తెలిపిన తర్వాత కనీసం స్పందన ఇవ్వడం కూడా కష్టంగా మారితే, ప్రభుత్వం నిజంగా ప్రజల కోసం పనిచేస్తుందా? పేరు కోసం మాత్రమే ఈ సేవలను అందిస్తున్నదా? అనే ప్రశ్నలు సామాన్యుల మనసుల్లో కలుగుతున్నాయి. ఫిర్యాదులను సమయానికి స్వీకరించేలా, పారదర్శకంగా వాటి స్థితిని తెలియజేసే లా వ్యవస్థను బలపరచాలి. అందుబాటులో ఉన్న నెంబర్లు పనిచేస్తున్నాయా? సమాధానాలు అందుతున్నాయా? సమస్యలను వినేందుకు అధికారులు శ్రద్ధ చూపుతున్నారా? అన్నది కేవలం కార్యాలయాల పనిగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలి. ప్రజల సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వానికి గౌరవం పెరుగుతుంది. ప్రజలు కూడా నమ్మకంతో ముందడుగు వేయగలరు. ఇప్పటికైనా ప్రభుత్వం జాగ్రత్తగా ఆలోచించి, ప్రతి ఫిర్యాదును గౌరవంగా స్వీకరించేలా వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రజల మాట వినాలి టోల్ ఫ్రీ నెంబర్లు కు మెయిల్స్ కి వెంటనే స్పందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రభుత్వం నిజమైన సేవకుడిగా నిలబడగలదు. లేనిపక్షంలో నిరాశతో ప్రభుత్వంపై నమ్మకాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది.

సోరుపాక అనిల్ కుమార్
7997894505

## సాగర్‌లో కెఆర్ఎంబి బృందం పర్యటన



ప్రజాపక్షం/నందికొండ: రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం భాగంగా గురువారం కెఆర్ఎంబి బృందం నాగార్జునసాగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు డ్యాం పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం వద్ద పరిశుభ్రత పనులు చేశారు. చెత్త తొలగింపు, వీధుల పరిశుభ్రత వంటి పనులను అధికారులు, సిబ్బంది, కలిసి శుభ్రం చేశారు.ఈ సందర్భంగా కెఆర్ఎంబి సభ్యులు జాన్ గిడ్ మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ఒక రోజు పని కాదని అది అందరికీ అలవాటు కావాలన్నారు. శుభ్రత ఉంటేనే ఆరోగ్యం ఉంటుందని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే "స్వచ్ఛతాహీ సేవ లక్ష్యం" అని ఆయన అన్నారు. ఆ తర్వాత వీరు శుక్రవారం పులిచింతల ప్రాజెక్టును సందర్శించనున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి



ప్రజాపక్షం/మిర్యాలగూడ: పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీనగర్‌లో మిర్యాలగూడ మెదర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకల్లో ఆయన ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పాల్గొని వెదురు వస్తువులతో సంబంధించిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. మెదర కుల వృత్తి అనేది సామాజిక బాధ్యత లాంటిదన్నారు. మెదరు కులస్థులు వెదరు వస్తువులు తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నారని మనమందరం కూడా ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండి ప్రత్యామ్నాయంగా వెదురు వస్తువులను వాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడంతోపాటు మెదరి సోదరులకు ఉపాది కల్పించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## స్వామి రామానందతీర్థలో నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణకు స్వామి రామానంద తీర్థ నైపుణ్య యాని వర్సిటీలో దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. పట్టణ శివారు జలాల్ పురంలోని స్వామి రామానంద తీర్థ శిక్షణ సంస్థలో తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, భారత ప్రభుత్వం ద్వారా నిర్వహింపబడే దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కార్యక్రమంలో స్వల్పకాలిక మూడున్నర నెలల వ్యవధితో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి ఆధారిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. బీకాం అర్హతతో ఎకౌంట్స్ అసిస్టెంట్ ట్యాలీ, ఇంటర్ తో బేసిక్ కంప్యూటర్స్, డాట ఎంట్రీ ఆపరేటర్ డిజిటల్ మిత్ర, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, పదవ తరగతితో ఆటోమొబైల్, వీలర్ సర్వీసింగ్, ఎలక్ట్రిషియన్ డొమెస్టిక్, సోలార్ సిస్టమ్ ఇన్స్టలేషన్ సర్వీస్(బాలికలు చేసిన వారికి ప్రాధాన్యం)లలో శిక్షణకు దరఖాస్తులను కోరుతున్నారు. వయస్సు 1835 సంవత్సరముల మధ్య ఉండాలి. ఆసక్తి గలవారు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, రెండు పాస్పోర్ట్ ఫోటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో ఈ నెల 23న మంగళవారం ఉ 10 గంటలకు సంస్థలో హాజరు కావాలని సంస్థ డైరెక్టర్ డా॥ఎన్.కిషోర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు సంబంధిత వెబ్సైట్ను గానీ లేదా 9133908000, 9133908111, 9133908222, 9948466111 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చు.

## ఎంపిఎల్ పరిశ్రమ సేవలు అభినందనీయం

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/చిట్యాల : నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో పరిశ్రమలు నిర్వహిస్తున్న ఎంపిఎల్ స్టీల్ పరిశ్రమ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. మండలంలోని చిట్యాల, వెలిమినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎంపిఎల్ పరిశ్రమ యాజమాన్యం బహుకరించిన వైద్య పరికరాలు, ఫర్నిచర్‌తో పాటు వాటర్ ప్లాంట్‌లను వారు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలనే ఆలోచనతో ప్రతి ఒక్కరు ముందుకు వెళ్ళాలని సూచించారు. మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తిని అనుసరించాలన్నారు. ఎంపిఎల్ వారు అందజేసిన వైద్య పరికరాలు ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎంతగానో ఉపయోగపడగలవన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వర్లు, సత్య నరేష్, డి నర్సింహ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రా వినోద మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్ రెడ్డి, వెలిమినేడు సింగిల్ విండో చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, గుడిపాటి లక్ష్మి నర్సింహ్మ, జడల చినమల్లయ్య, ఎంపిఎల్ పరిశ్రమ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతీ గ్రామం అభివృద్ధి


దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



ప్రజాపక్షం/చందంపేట: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. జన హిత మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గురువారం చందంపేట మండల పరిధిలోని పోల్యానాయక్ తండా గ్రామంలోని కాలనీలలో ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటించి, గ్రామ ప్రజలకు నేరుగా కలిసి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించిన ఎంఎల్‌ఏ బాలునాయక్. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ డబ్బులు అడిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా డబ్బులు అడిగితే నేనుగా తనకే ఫోన్ చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విజయమ్మ పార్థివ దేహానికి కన్నీటి నివాళులు

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో దివంగత సీపీఐ సీనియర్ నాయకుడు పల్లె లక్ష్మారెడ్డి కుమార్తె గూడూరు విజయమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూయడంతో ఆమె పార్థివ దేహం పై సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పూలమాలలు వేసికన్నీటి నివాళులు అర్పించారు. విజయమ్మ తండ్రిని అనుసరిస్తూ పనిచేసిన గొప్ప మానవతామూర్తి అని అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం డి ఇమ్రాన్, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, సీనియర్ నాయకులు దేశిడి నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రుద్ర రాములు, తోకల రాంరెడ్డి, సీపీఐ మండల కార్యవర్గసభ్యులు వీరమల్ల యాదయ్య, పల్లె మల్లారెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శి పందుల యాదగిరి, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య, ఎర్రోళ్ల లింగస్వామి, పల్లె గోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే గాలయ్య,పెంటయ్య, సింగపంగ రమేష్ సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



# చదువుతోనే అన్నీ సాధ్యం

బాగా చదువుతే పోటీ పరీక్షలలో మంచి ర్యాంకు

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/హాలియా(పెద్దవూర): చదువు ద్వారానే అన్ని సాధ్యమవుతాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె పెద్దవూర మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల స్టోర్ రూమ్, వంటగదిని,పరిసరాలను పరిశీలించారు. అనంతరం భోజనం చేస్తున్న విద్యార్థులతో ఆమె ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థినులు బాగా చదువుకోవాలని, తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తారని, తల్లిదండ్రుల కష్టానికి తగ్గట్టుగా విద్యార్థినిలు సైతం బాగా చదివితే భవిష్యత్తులో సమాజంలో మంచి స్థానంలో ఉంటారని, చదువుతోనే అన్ని సాధ్యమవుతాయని అన్నారు. ఇంగ్లీషు భాషపై పట్టు సాధించాలని,ఇంగ్లీష్ వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికి వెళ్లినా రాణించవచ్చని అన్నారు.అంతకు ముందు జిల్లా కలెక్టర్ పెద్దవూర ఎంపిడిఓకార్యాలయంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద చేపట్టిన గృహ నిర్మాణం పై సమీక్ష నిర్వహించారు. శనివారం నాటికి పిఎం ఆవాస్ యోజన కింద 30 గ్రౌండింగ్ ను పూర్తిచేయాలని ఆదేశించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి విద్యార్థులకు అందిస్తున్న భోజనము, విద్య, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదవడం ద్వారా ఇంటర్మీడియట్ తర్వాత నీట్ వంటి పోటీ పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించవచ్చు అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, పెద్దవూర తహసిల్దార్ శాంతి లాల్, ఎంపిడిఓ ఉమాదేవి, ఎంఈఓ రాము, ఆర్ఐ శ్రీనివాస రెడ్డి, పాఠశాలల ప్రిన్సిపాల్స్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

**సదరం కేసులను వచ్చే నెలలోపు పరిష్కరించాలి**

పెండింగ్‌లో ఉన్న సదరం కేసులను వచ్చే నెలలోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డిని ఆదేశించారు.గురువారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించే సదరం శిబిరాన్ని సందర్శించారు. సదరం క్యాంపు లను ఆసుపత్రిలోని పాత భవనంలో నిర్వహిస్తుండగా, నూతన భవనంలోకి మార్చాలని ఇదివరకే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అయితే కొత్త భవనానికి సంబంధించిన పార్టీషన్,ఎలివేషన్ పనులవల్ల శిబిరం మార్పు సాధ్య మా కాలేదని డిఆర్‌డిఓ శేఖర్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పాత భవనంలోని ఇబ్బందులను దృష్టి లో ఉంచుకొని కొత్త భవనంలో సదరం క్యాంపుల నిర్వహణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అంతేకాక పెండింగ్ లో ఉన్న 2564 సదరం దరఖాస్తులను పరిశీలించి వచ్చే నెల నాటికి క్యాం పుల నిర్వహన,పరిష్కారం పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిజిహెచ్ డిప్యూటీ ఆర్ఎం ఓ డాక్టర్ నగేష్ ఉన్నారు.

## 19న జాతీయ సదస్సు

ప్రజాపక్షం/ రామన్నపేట: ఈనెల 19న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సాహిత్యం సమాలోచనం అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహించడం జరుగుతందని కళాశాల ప్రధానాచార్యులు రాహత్‌ఖానం, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధులుగా హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్, ఎంజీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, హెచ్‌సీయు తెలుగు శాఖ అధ్యక్షుడు పిల్లలమర్రి రాములు, కమలాకర్,బెల్లి యాదయ్యలు హాజరవుతున్నట్లు తెలిపారు. ముఖ్య సమావేశానికి తెలుగు విశ్వవిద్యాలంయ వీసీ వెల్దంద నిత్యానందరావు, మహబూబ్ నగర్ అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డితోపాటు పలువురు పాల్గొంటారని తెలిపారుతెలిపారు.

## సౌత్‌జోన్ క్రీడలకు ఎన్‌జి కళాశాల విద్యార్థులు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నాగార్జున ప్రభుత్వ కళాశాల విద్యార్థులు అయిదు గురు వివిధ క్రీడల్లో సౌత్ జోన్ కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. బాలుర విభాగంలో కబడ్డీ క్రీడలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ జట్టులో పన్నెండు మందికి గాను అయిదుగురు కె. రాకేష్ బీఎస్సీ (ఎంపీసీఎస్) సెకండియర్, ఎం నాగరాజు బిఎస్‌సి(ఎంఎస్‌సిఎస్) ఫస్ట్ ఇయర్, బి.బ్రహ్మీ బిఎస్‌సి (బిజెడ్‌సి) ఫస్ట్ ఇయర్ ,కే అనిల్ బి ఏ(ఈహెచ్ పి)ఫస్ట్ ఇయర్, కే సంపత్ బీకాం ఫస్ట్ ఇయర్ ఎంపికయ్యారని ఇంచార్జి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశం తెలిపారు. వీరంతా మహాత్మా గాంధీ యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని త్వరలో కర్ణాటక రాష్ట్రంలో జరిగే సౌత్ జోన్ పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పరంగి రవికుమార్,పరీక్షల నియంత్రణ అధికారి బి. నాగరాజు, ఆఫీసు సూపరిండెంటెంట్ కోటేశ్వరరావు విద్యార్థులను అభినందించారు.

# ఆశ్రమంపై సర్వహక్కులు నావే..

కోర్టు తీర్పును గౌరవించాలి: ఈశ్వరి మాత



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: శ్రీశ్రీ జగద్గురు బాలయోగి మాణిక్యేశ్వరి మాత ఆశ్రమ నిర్వహణ పై సర్వహక్కులు తానే నిర్వహించే విధంగా కోర్టు జడ్జిమెంట్ ఇచ్చిందని దోమలపల్లి ఈశ్వరి మాత వెల్లడించారు. గురువారం నల్లగొండ పట్టణ పరిధిలోని గంధవారి గూడెంలో ఉన్న శ్రీ జగద్గురు బాలయోగి మాణిక్యేశ్వరి మాత ఆశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాత మాణికేశ్వరి ఆశ్రమం అనేది ఒక సొసైటీ అని.ఈ సొసైటీని తన తండ్రి దోమలపల్లి లక్ష్మీనరసింహారావు 1980 సంవత్సరంలో స్థాపించారని తెలిపారు.15 ఎకరాల 24 గంటల ఉన్నదని ఈ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి కొంతమంది కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.మాణిక్యేశ్వరి మాత ఆశ్రమ నెలకొల్పి ల్యాండ్ అగ్రిమెంట్ చేసుకునేంతవరకు తన తండ్రి ఫౌండర్‌గా పీఠాధిపతిగా ఉంటూ సొసైటీని ఏర్పాటు చేశారని తెలిపారు. నాన్న తర్వాత తానే పిఠాధిపతి వారసులుగా కోర్టు తీర్పునిచ్చిందని ఆశ్రమానికి ఎలాంటి సంబంధం లేని కొంత మంది వ్యక్తులు కోర్టులో కేసు వేశారని తెలిపారు. 25 సంవత్సరాల తర్వాత కోర్టు ఈ ఆశ్రమానికి తానే వారసత్వంగా కొనసాగాలని ఆశ్రమ సంరక్షణ బాధ్యతలు తానే నిర్వర్తించే విధంగా జడ్జిమెంట్ వచ్చిందన్నారు. లా ప్రకారం అక్కడ ఎవరు ఉండాలో కోర్టు తీర్పు ప్రకారం నడుచుకోవాల్సి ఉండగా కోర్టు తీర్పును ధిక్కరించే విధంగా దీనికి సంబంధం లేనివారు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఆశ్రమానికి సంబంధించిన ఆస్తులు పీఠాధిపతుల ఆధీనంలో ఉంటాయని సొసైటీ కి ట్రస్ట్ కు ఎలాంటి సంబంధం లేదన్నా రు. మాకు ఈ ఆస్తులు అమ్మే ఆలోచన లేదని భవిష్యత్తులో ఎక్కడ ఒక మంచి శివాలయాన్ని నిర్మించి భక్తులకు అందుబాటులో ఉంచుతామని నల్లగొండకు వన్నెతెచ్చే విధంగా ఆశ్రమాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. కోర్టు తీర్పును ఎవరు ధిక్కరించవద్దని తనను ఇబ్బందులకు గురి చేస్తే ఇక్కడే మౌన పోరాటం చేస్తానని పేర్కొన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తన భూమిని తనకు ఇప్పించాలని తనకు తన కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు. విలేకరుల సమావేశంలో మాణికేశ్వరి మాత సొసైటీ ప్రధాన కార్యదర్శి రణధీర్, ఉపాధ్యక్షులు సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.



## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాపక్షం/దేవరకొండ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని జెడ్పిహైస్కూల్‌లో 69వ ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ దేవరకొండ నియోజకవర్గ స్థాయి అండర్ 1417 బాల, బాలికల క్రీడల పోటీలను అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి బాలు నాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని సానుకూల దృక్పథంతో స్వీకరించాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులు రాష్ట్రంలో నిర్వహించే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఇండియన్ నేవి, ఎయిర్ ఫోర్స్‌లో లెఫ్టినెంట్ పైలెట్‌లో ఎంపికైన ముదిగొండ గ్రామానికి చెందిన అరవింద్ చౌహాన్‌ను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా మేదర సంఘం కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పట్టణ ముఖ్య నాయకులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి వంద పడకలు అయ్యేది ఎప్పుడు?

75 సంవత్సరాలు గడిచిన మారని తీరు

అత్యవసరమైతే హైదరాబాద్, నల్లగొండకు వెళ్లాల్సిందే




ప్రజాపక్షం/ రామన్నపేట: ఒకప్పుడు రామన్నపేట తాలూకగా శాసనసభ నియోజకవర్గ కేంద్రంగా 25 సంవత్సరాలు ఉన్నప్పటికీ నేటికీ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మార్పు చెందలేదు. నియోజకవర్గ కేంద్రంలో నుంచి మండల కేంద్రం స్థితికి మారిన తరువాత ప్రభుత్వ వైద్యం అగమ్యగోచరంగా మారింది. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగి సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి మండల కేంద్రంతోపాటు మండలంలో ఉన్న చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వైద్య కోసం నిత్యం ఆసుపత్రికి వస్తుంటారు. ఆసుపత్రి అవుట్ పేషెంట్ సంఖ్య 500 నుంచి 800 వరకు ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు.

రామన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు అయినా పరిస్థితి మారలేదు. నేటికి కేవలం 50 పడకలతోనే కొనసాగుతుంది. వంద పడకల ఆసుపత్రిగా మారుస్తామని పాలకులు ఇచ్చిన హామీ నేటికి అమలు కాలేదు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అనుగుణంగా వైద్యులు గాని సౌకర్యాలు గాకి లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30 పడకల ఆసుపత్రి నుంచి 50 పడకల ఆసుపత్రిగా మారినప్పటికీ సౌకర్యాలు మెరుగుపడలేదు. రామన్నపేటలో పేరుకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఉన్నప్పటికీ అత్యవసర పరిస్థితి ఏర్పడితే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, నల్లగొండ వంటి దూర ప్రాంతాలకు పరుగుతు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆసుపత్రిలో వైద్యానికి కావాల్సిన సౌకర్యాలు లేకపోవడం అత్యవసర పరిస్థితి ఏర్పడితే సౌకర్యాలు లేమి కారణంగా రోగులకు శాపంగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ప్రయాణభారంతో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వంద పడకల ఆసుపత్రిగా మార్చాలి**

**రెబ్బాస్ రాములు (కామ్రేడ్, రామన్నపేట)**

రామన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చి సౌకర్యాలను మెరుగుపరచాలి. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిలు స్పందించి ఆసుపత్రికి వందపడకలుగా మార్చాలి. లేనట్లయితే ఎంపీ, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాలను ముట్టడిస్తాం, నిరసన దీక్ష చేపడతాం.



## అర్హులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి

ప్రజాపక్షం/నందికొండ: అర్హులైన పేద రైతులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. గురువారం సాగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తిరుమలగిరి సాగర్ మండలాన్ని మాజీ మంత్రి జానారెడ్డి సలహా మేరకు భూభారతి పైలట్ ప్రాజెక్టు కింద ప్రతిష్టాత్మకంగాఎంపిక చేసిందని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకుల అండతో సుమారు 3 వేల పైచిలుకు వ్యవసాయ భూమి సాగులో లేకున్నా పట్టాదార్ పాస్ బుక్ పట్టాలుగా చేసుకుని రైతుబందు, రైతు భరోసా నిధులు కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడితే దానిని చక్కదిద్దే ప్రయత్నంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం భూసమస్యల పరిష్కారానికి దేశానికే మార్గదర్శంగా నిలిచే నూతన రెవెన్యూ చట్టాన్ని రూపొందించి ఈ పైలట్ ప్రాజెక్ట్ అమలు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్,హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి , డిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్ రెడ్డి, రాజా రమేష్ పాల్గొన్నారు.

## సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి నోటీసులు జారీ చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు




ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :భూభారతి చట్టం అమలులో భాగంగా సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి నోటీసులు జారీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు అన్నారు. గురువారం ఆర్‌డిఓలు, తహాశీల్దార్లతో రెవెన్యూ అంశాలపై వెబెక్స్ ద్వారా అదనపు కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం జూన్ 2, 2014కు ముందు సాదా కాగితం ద్వారా కొనుగోలు చేసి 2020 అక్టోబర్‌లో మీసేవ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి వుండి, గత 12 సంవత్సరాలుగా భూమిని సాగు చేస్తున్న వారివి మాత్రమే పరిశీలించాలని ఆదేశించారు. తహాశీల్దార్లు రెవెన్యూ గ్రామాల వారీగా దేవాదాయ, వక్ఫ్, ఇరిగేషన్, రోడ్లు, ఇంకా వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ భూముల వివరాలతో కూడిన 22ఏ రిజిస్టర్‌ను త్వరగా సమర్పించాలని, అలాగే అన్ని రకాల ప్రభుత్వ భూములను జియో ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా సర్వే చేసి అక్షాంశాలు, రేఖాంశాలతో కూడిన సరిహద్దులతో భూమి పటం తయారు చేయాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆర్‌డిఓలు, తహాశీల్దార్లు పాల్గొన్నారు.

## వస్తువు తయారీలో నాణ్యతా ప్రమాణాలు

సింగల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ మల్లేశం

ప్రజాపక్షం/చండూరు: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ రకాలు దుకాణాదారులు వస్తువుల తయారిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని , ఎవరైన దుకాణాదారులు సింగల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ మల్లేశం తెలిపారు. గురువారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని హోటల్స్ , బేకరిలు , చికెన్ ,మటన్ షాపులు, పాస్ట్ ఫుడ్ షాపులను తనిఖీ చేశారు. హోటల్స్, బేకరి ,పాస్ట్‌పుడ్ సెంటర్‌లలో తయారు చేసే తినుబండారాలు , ఆహార పదార్థాలను తనిఖీ చేసి ప్రతి వస్తువును నాణ్యత ప్రమాణాలతో తయారు చేయాలని అన్నారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న హోటల్స్, బెకరిలు, చికెన్,మటన్ ఫాస్ట్‌పుడ్ సెంటర్ యాజమానులకు, నాణ్యత పాటించని వారికి మున్సిపల్ కమీషనర్ మల్లేశం 13వేల 500వందల రూపాయల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు శ్రీరాములు, సాయిరాం, సాయి భరద్వాజ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్స్ మహేష్ ,రమేష్ తదితరులు పాలొన్నారు.



## యూరియా కోసం రోడ్డు ఎక్కిన రైతులు పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల పట్టణం కామ మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు కోపం ఉదయం నుంచి మధ్యహ్నా వరకు పడి కాపుకాసి చేసేదిలేక రోడ్డుపై బైఠాయించారు. గురువారం నాడు మధ్యహ్నాం ఆందోళన చేపట్టిన రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా అందజేయడంతో నిర్లక్ష్యం వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా గత 15 రోజులుగా ఆందోళన చేపడుతున్న యూరియా ఇప్పించడంతో సంబంధించిన అధికారుల రాజకీయ నేతలు విఫలమయ్యారని రైతులు మండిపడుతున్నారు. కొందరు దుకాణదారులు అధికారులతో కుమ్మకై యూరియాని స్టార్ట్ చేసుకుని అధిగధరలకు విక్రయిస్తున్నట్లు రైతులు ఆరోపించారు.
అరుగాలం శ్రమించి, అప్పులు చేసి పంటలు వేసి, సకాలంలో యూరియా చల్లకపోవడంతో దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇకనైనా అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి రైతులకు అందజేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలపరిధిలోని పాలెంలో శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్అండ్‌సైన్స్ అటానమస్ కళాశాలలో డైరీసైన్స్ విభాగంలో అతిథిఅధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజీలో డైరీసైన్స్ లేదా జువాలజి పూర్తిచేసిన వారు ఆసక్తికలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 19 శుక్రవారం సాయంత్రం 4గంటలలోపు కళాశాలలో సమర్పించాలని, దరఖాస్తుతోపాటు ఒక జతజిరాక్సు పత్రాలను అందజేయాలని కోరారు. ఈనెల 20న శనివారం ఉదయం 10గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. డైరీసైన్స్ అర్హతకలిగినవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పిజిలో 55శాతం మార్కులు సాధించినవారు అర్హులని తెలిపారు. నెట్, సెట్ లేదా పిహెచ్‌డి అర్హతకలిగినవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.




## సైబర్‌మోసాలపట్ల జాగ్రత్త

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలకేంద్రంలో ఎస్‌బిఐశాఖ ఆధ్వర్యంలో సైబర్‌మోసాలపై కళాజాతబృందంచే అవగాహన కార్యక్రమాన్ని ప్రజలకు కల్పించారు. కార్యక్రమంలో ప్రజలనుద్ధేశించి ఆన్‌లైన్‌బ్యాంకింగ్ లావాదేవిలతోపాటు సైబర్‌మోసాలు ఈమధ్యకాలంలో బాగా పెరిగిపోయాయి అన్నారు. వీటిని నివారించడానికి తక్షణమే బ్యాంక్ అధికారులనువెంటనే సంప్రదించాలన్నారు. అదేవిధంగా మీవ్యక్తిగత వివరాలు తెలియని వ్యక్తులతో పంచుకుంటే, అనంతరంవారు బ్యాంకు అధికారులవలే నమ్మించి ఫోన్‌లో ఓటిపిలు తెలుసుకొని మీబ్యాంకుఖాతాను ఖాళీచేసే అవకాశం ఉంటుందన్నారు. ఎటిఎంలలో కొందరు మోసగాళ్లు కార్డుసైపింగ్ మిషన్‌లో పెట్టిచూసి మీకార్డును మార్పుచేసే అవకాశాలు ఉంటాయన్నారు. కావున అప్రమత్తంగా ఉండి కొత్తవ్యక్తులపట్ల కొత్త పరిచయాలు ఏర్పడినప్పుడు అలాంటివ్యక్తులపట్ల జాగ్రత్తగా వ్యక్తిగత ఖాతాలు, పిన్‌కోడ్‌నెంబర్లు రహస్యంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఎం.నవీన్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ఫారుక్‌బాష, జమీల్‌పాష, బ్యాంకుసిబ్బంది పాల్గొన్నారు.




## స్మశానవాటికను కాపాడాలని పంచాయతీ సెక్రెటరీకి వినతి

**ప్రజాపక్షం/అడ్డాకుల :** మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామంలో సోలార్ కు భూములు అమ్మినందున గ్రామపంచాయతీకి సోలార్ కంపెనీ వారు పదేండ్ల కిందట స్మశాన వాటిక కొరకు 205 సర్వే నెంబర్ లో రెండు ఎకరాల పైగా భూమిని ఇవ్వడం జరిగింది. అక్కడే భూమి లేని నిరుపేదలు కులమత బేధం లేకుండా స్మశాన వాటికలో పూడ్చుకోవడం జరిగింది. ఇప్పుడు కొంతమంది స్వార్థ బుద్ధితో స్మశాన వాటికను కబ్జా చేసి అమ్ముకోవాలని చూసి స్మశాన వాటిక చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకొని బలీదుపల్లి గ్రామ ప్రజలు యువకులు పెద్దలు కలసి ఫెన్సింగ్ చేపట్టిన రాళ్ళను తొలగించడం జరిగింది. కావున సోలార్ కంపెనీతో గ్రామపంచాయతీకి స్మశాన వాటిక కు భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శి కళ్యాణికి గ్రామ యువకులు పెద్దలు వినతి పత్రం అందజేశారు. స్మశాన వాటిక భూమినీ కబ్జా చేయాలని చూస్తున్న వారి పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజలు యువకులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా అందించాలని రైతు సంఘం డిమాండ్

**ప్రజాపక్షం / మద్దూర్ :** పట్టణ కేంద్రంలోని వ్యవసాయ కార్యలయం దగ్గర గురువారం రోజు అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ నర్సిములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో యూరియా సరఫరాలో విఫలమైందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. యూరియా దొరకక తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడ్డాయి అని అన్నారు. రామగుండంలో ఉన్నా యూరియా కర్మాగారం నడవకపోవడం వల్ల తెలంగాణకు రావలసిన పది శాతం యూరియా అందక కూడా సమస్య తీవ్రంగా ఏర్పడదు అన్నారు. ఇప్పటికైనా యూరియా సరాఫరా సమస్యను పరిష్కరించకుంటే రైతుల నుండి తీవ్ర ప్రతిఘటన తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి, టియుసిఐ నాయకుడు అంజి, రైతు సంఘం నాయకులు రాములు, కృష్ణ, వెంకటప్ప, హనుమప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.



## అట్రాసిటి చట్టాన్ని పకడ్బందీగా అమలుపర్చాలి : కొమ్ముభరత్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పోరాడిసాధించుకున్న ఎస్‌సి ఎస్‌టి అత్యాచార నిరోధకచట్టాన్ని పాలకవర్గాలు నీరుగారిస్తున్నాయని చట్టాన్ని పటిష్టంగా అమలుపర్చి దళితులకు రక్షణకల్పించాలని దళితహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కొమ్ముభరత్ అన్నారు. గురువారం తాడూరు మండలకేంద్రంలో డాక్టర బిఆర్ అంబేద్కర్ విగ్రహంముందు దళితసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళితులపైన దాడులు, అత్యాచారాలు జరుగుతున్న ప్రభుత్వయంత్రాంగం చోద్యం చూస్తున్నాయని చర్యలు తీసుకోవడంలేదని అన్నారు. గతప్రభుత్వం దళిత ముఖ్యమంత్రి దళితులకు ప్రతి కుటుంబానికి మూడు ఎకరాలభూమి తదితర వాగ్దానాలుచేసి అమలుపర్చకుండా చివరిలో దళితబంధు పథకాన్ని ప్రకటించి వారి కార్యకర్తలకు గులాబిజెండామోసినవారికే ఈపథకాన్ని అంటగట్టారని విమర్శించారు. ఇప్పుడున్న కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రజాపాలన అని ప్రచారంచేసుకుంటూ చేవేళ్ల దళితడిక్లరేషన్‌నేటికి అమలుపర్చకుండా విధి విధానాలు రూపొందించకుండా అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలుపర్చకుండా ప్రతి కుటుంబానికి రూ.12లక్షలు ఇస్తామని హామిఇచ్చి గాలికి వదిలేసిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కోళ్లశివ, గూటవిజయ్, దళితసంఘాల నాయకులు కొత్తపల్లి శివప్రసాద్, బాలవెంకటయ్య, డిహెచ్‌పిఎస్ నాయకులు రాముడు, కృష్ణయ్య, లక్ష్మయ్య, అర్జున్, భీమయ్య, నర్సింహ్మ, వెంకటయ్య, గురువయ్య, రాఘవులు, బంగారయ్య, రాములు పాల్గొన్నారు.

# యూరియా పంపిణీలో అక్రమాలు సహించం

నవాబుపేట ఘటనపై
డిఎఒతో విచారణ
ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** యూరియా పంపిణీలో డీలర్లు, అధికారులు ఎవరైనా అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు వ్యవసాయ అధికారులే టోకెన్లు ఇచ్చి వాటి ప్రకారంగానే యూరియాను పంపిణీ చేయాలని, దీనికి భిన్నంగా ఎక్కడైనా జరుగుతుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నవాబుపేటలో యూరియా పంపిణీలో కోరమాండల్ డీలర్ చేసిన అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి (డిఎఒ)ను కోరామని వెల్లడించారు. జడ్చర్ల నియోజకవర్గంలో గత ఏడాది వానాకాలం ఖరీఫ్ సీజన్ మొత్తానికి ఇచ్చిన యూరియా కంటే అధికంగా యూరియాను ఇప్పటికే రైతులకు అందించామని గురువారం మీడియాకు విడుదలచేసిన ప్రకటనలో అనిరుధ్‌రెడ్డి తెలిపారు. గత ఏడాది ఖరీఫ్‌లో సీజన్ మొత్తానికి 9వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయగా, ప్రస్తుతం ఇప్పటికే 9600 టన్నులకుపైగా యూరియాను రైతులకు అందించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో యూరియా రాకపోవడం, గత ఖరీఫ్ సీజన్ కంటే ఎక్కువ విస్తీర్ణంలో ప్రస్తుతం పంటలు సాగు చేయడంతో యూరియాకు ఎక్కువ డిమాండు ఏర్పడిందన్నారు. యూరియా పంపిణీలో నిబంధనలకు భిన్నంగా అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తన దృష్టికి తీసుకురావాలని అనిరుధ్‌రెడ్డి పునరుద్ఘాటించారు.

## పొలానికి డ్రోన్ స్ప్రేయర్‌తో పురుగుల మందు పిచికారి



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** మండల పరిధిలోని ఎక్కామేడ్ గ్రామంలో డ్రోన్ స్ప్రేయర్‌ను ఉపయోగించి గురువారం రోజు ఉదయం వరిపంటకు పిచికారి చేయిస్తున్న దృశ్యం కనపడింది. ఈ విషయమై రైతుని 'ప్రజాపక్షం' రిపోర్టర్ అడుగగా చంద్రప్ప యాదవ్ అనే రైతు తన సొంత నాలుగు ఎకరాల పొలంలో డ్రోన్ స్ప్రేయర్ వినియోగంతో కూలీలకు చెల్లించే ఖర్చుతో డ్రోన్ స్ప్రేయర్‌ను ఉపయోగించడం వల్ల 50 శాతం ఆదా అవుతుందని, అంతే కాకుండా పురుగుమందులపై పెట్టే ఖర్చు కూడా 40 శాతం వరకు ఆదా అవుతుందని అన్నారు. కాలానికి అనుగుణంగా రైతులు సాగులో వినూత్న పద్ధతులు అవలంబిస్తు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. పొలాల్లో పురుగుమందులు పిచికారి చేసేందుకు డ్రోన్లను వినియోగిస్తు హైటెక్ సాగుకు రైతులు బాటలు వేస్తున్నారు అనటానికి ఇదొక నిదర్శనం.

## సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను విజయవంతం చేయండి




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కమ్యూనిస్టు అగ్రనాయకులు అమరజీవి, సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణసభను విజయవంతం చేయాలని సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ పక్కన ఉన్న సాయిగార్డెన్ ఫంక్షన్ హాలులో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్, సిపిఐ రాష్ట్రసమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జి, కేశవులుగౌడ్‌లు తెలిపారు. ఈ సంస్మరణ సభకు రాజకీయాలకు అతీతంగా జిల్లా ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడవెంకట్‌రెడ్డి, సిపిఐ జాతీయసమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ, జిల్లాకు చెందిన పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు ఇతర ప్రగతిశీల సంఘాల నాయకులు వామపక్షపార్టీల నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు హాజరవుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు టి.నర్సింహ్మ, చంద్రమౌళి, కొమ్ముభరత్, శివశంకర్, మర్యాదవెంకటయ్య పాల్గొన్నారు.

# క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** వీపనగండ్ల మండల కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థుల క్రీడా స్ఫూర్తిని వెలికితీయడం, ప్రతిభావంతులను గుర్తించి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడల్లో మండలంలోని జిల్లాపరిషత్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గురుకుల పాఠశాలలు పాల్గొన్నాయి. విద్యార్థులు వివిధ విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు రంగంలోకి దిగారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎస్‌ఐ కె.రాణి, మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు ముంత మల్లయ్య యాదవ్, మండల విద్యాధికారి నర్సింహ పాల్గొన్నారు. వారు జ్యోతిని వెలిగించి , క్రీడా పతాకాన్ని ఆవిష్కరించడం ద్వారా క్రీడలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కె.రాణి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో జట్టు భావన, క్రమశిక్షణ ఆత్మవిశ్వాసాన్ని పెంపొంది స్తాయి. ఇక్కడ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లా స్థాయిలోను కాంతులీనాలని ఆశిస్తున్నాం అని తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, కోకో వంటి క్రీడల్లో పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. విద్యార్థులు గెలుపు , ఓటములను పక్కన బెట్టి నిజమైన క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు. బాలురు, బాలికల విభాగాల్లో వేరువేరు జట్లు బరిలోకి దిగడంతో మైదానాలు సందడి వాతావరణాన్ని సృష్టించాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థులను అభినందించారు. ప్రోత్సాహకర నినాదాలు, చప్పట్లు క్రీడాకారుల్లో మరింత ఉత్సాహం నింపాయి. క్రీడల నిర్వహణలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారు.
విద్యార్థులకు వసతి, తాగునీరు , అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి ప్రోత్సహించనున్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎం భాను ప్రకాష్ , ఉపాధ్యాయులు, పిఇటిలు, సిఆర్పి వెంకటేష్ పాల్గొన్నారు.

# కోనేరులో ఉబికి వస్తున్న ఊటనీరు

ఫలించిన మంత్రి ప్రయత్నం



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి కోనేరును శుభ్రపరచి, పూడిక తీసి సహజంగా ఊటనీరు తెప్పించాలన్న మంత్రి వాకిటి శ్రీహరి ప్రయత్నం ఫలించింది. మంత్రి ఇంటి కులదైవంగా భావించే పడమటి ఆంజనేయస్వామి అతిపురాతనమైన కోనేరుపై ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపారు.
స్వామికి సంబంధించిన భూముల వివాదాలను పరిష్కరించడంతో పాటు, జీర్ణావస్థలో ఉన్న కోనేరును శుభ్రపరచి భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి ఆర్కియాలజీ, జియాలజీ అధికారులతో సర్వే చేయించారు. వారి సలహాల మేరకు గత రెండు వారాలుగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ముళ్లకంచె, పిచ్చిమొక్కలను తొలగించి, కోనేరు అడుగున ఉన్న మట్టిని దాదాపు 30 శాతం వరకు తొలగించారు. దీంతో గురువారం తెల్లారే సమయానికి సుమారు ఐదు అడుగుల ఎత్తులో ఊటనీరు ఉబికి రావడంతో భక్తులు, ఆలయ సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. డిసెంబర్ నెలలో జరిగే మక్తల్ పడమటి ఆంజనేయ స్వామి తిరునాళ్ల వరకు కోనేరును మరింత శుభ్రపరచి, సుందరీకరణ చేసి భక్తుల కోసం అందుబాటులో ఉంచేలా శ్రద్ధ తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. మంత్రి ఆదేశాల అనుసారం ఆలయ ధర్మకర్త ప్రాణేశ్ చారి, ఎండోమెంట్స్ అధికారిణి కవితకు తగిన సూచనలు చేశారు.



## శరన్నవరాత్రి ఉత్సవాలకు ముఖ్యమంత్రికి ఉత్సవ కమిటీ ఆహ్వానం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఈనెల 22 నుండి అంగరంగ వైభవంగా నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని కోరుతూ ఆలయఫౌండర్, ట్రస్టు చైర్మన్ జూలూరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చురామకృష్ణ, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించి, ఆహ్వానపత్రికలను అందజేశారు. ఉత్సవకమిటీ అధ్యక్షుడు గందెరవి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వాసశేఖర్, కంది‌ప్రవీణ్, పాపిశెట్టి శ్రీనివాస్, వేణు, వీరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




## బాధ్యతలు చేపట్టిన రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా డి.మధుసూదన్ నాయక్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మహాత్మాగాంధీ రోడ్ హై స్కూల్ (వన్ టౌన్)ని సందర్శించారు. విద్యార్థులు ఏ విధంగా ఎక్కువ మార్కులు సాధించాలి మెలకువలను విద్యార్థులకు చెప్పడం జరిగింది. భూత్పూర్, జడ్చర్ల, మహబూబ్ నగర్ అర్బన్ మండలాలు తిరిగి ఓటర్ జాబితా సవరణ 2025 పరిశీలన చేయడం జరిగింది. కలెక్టర్ కార్యాలయంలో అన్ని శాఖల తిరిగి భవనం ఎక్కడైతే లీకేజీ లు, మరమ్మతులకు అంచనాలు రూపొందించాలని రహదారులు, భవనాలు శాఖ ఎఇని ఆదేశించారు. అన్ని మండలాల తహసీల్దార్స్‌తో రెవెన్యూ సదస్సులు, భూ భారతి దరఖాస్తులను, ఓటర్ జాబితా 2025లో ఓటర్‌గా నమోదు, మార్పులు చేర్పులు దరఖాస్తులు పరిష్కరించాలని తహసీల్దార్స్‌ని ఆదేశించారు.



## ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే తప్పనిసరిగా కఠిన చర్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని తహసీల్దార్ వరలక్ష్మి హెచ్చరించారు. గురువారం తూముకుంట ప్రభుత్వ ఇసుక రిచ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాలలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు తప్పనిసరిగా తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక అనుమతి పొందాలని సూచించారు. ట్రాక్టర్ యజమానులు అనుమతులు లేకుండా ఇసుకను తరలించడం , నిల్వ చేయడం గాని చేస్తే కఠినంగా వ్యవహరించబడుతుందని స్పష్టం చేశారు. ఇసుక రవాణాలో ఎవరైనా అక్రమ చర్యలకు పాల్పడితే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం తప్పదని తహసీల్దార్ వరలక్ష్మి హెచ్చరించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ కురుమూర్తి, జూనియర్ అసిస్టెంట్ కృష్ణ ఉన్నారు.



## జీవన శిలీంద్ర నాశకాలు ఉపయోగించడంపై అవగాహన

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలపరిధిలోని మంగనూరు గ్రామంలో గురువారం గ్రామీణ వ్యవసాయ అనుబంధ కార్యక్రమంలో మహత్మాజ్యోతిబాపూలే వనపర్తి తెలంగాణ వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు జీవనశిలీంద్రనాశను ఉపయోగించడంపై అవగాహన కార్యక్రమం కల్పించారు. ప్రస్తుతం వ్యవసాయరంగంలో వాడే రసాయనమందుల వల్ల రోజు రోజుకు నేల, వాయు, జలకాలుష్యాలు అధికమవుతున్నాయని ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు జీవన ఎరువుల, జీవపురుగు మందులు ఉపయోగించాలని రైతులను కోరారు. ట్రైకోడెర్మావిరెడ్డి అనే జీవశిలీంద్ర నాశనాలను ఉపయోగించడంవల్ల పంటలకు హని కలిగించే తెగుళ్లు కీటకాలు నాశనం చేస్తాయి వాటిప్రయోజనాలు ప్రభుత్వ ప్రోత్సహాలు పరిమితులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలోరావేఫ్ విద్యార్థినిలు మానస, కీర్తి, స్వాతి, మంజుల, శ్రీజ, పూజిత, అంకిత, గ్రామ ఆదర్శరైతులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ గురించి బతుకమ్మ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన 9 రోజుల పూల పండుగ ఇది ప్రకృతిలో సహాయ సిద్ధంగా లభించే పూలతో పూజించే పండుగ దీనిలో మహిళలు రంగురంగుల పూలతో గౌరీ దేవిని అలంకరించి పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ చివరి రోజున ఆ పూలను చెరువులలో నిమజ్జనం చేస్తారు. ఈ పండుగ ముఖ్య ఉద్దేశ్యం పార్వతీ దేవిని ఆశీర్వాదం కోరడం, ప్రకృతికి కృతజ్ఞతలు తెలపడం అని ప్రిన్సిపల్ మెర్సి వసంత చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థినులు, ఆధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలో పనిచేసే మున్సిపల్ కార్మికులందరికీ వారి సేవలను గుర్తించి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతకుమార్, ఇతర నాయకులు ఘన సన్మానం చేశారు. గురువారం నాడు జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని జిపి ఫంక్షన్ హాల్లో చేపట్టిన ఈ కార్యక్రమానికి పట్టణ బిజెపి మాజీ అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రతాప్‌రెడ్డి, మధు, శ్రీనివాస్ గౌడ్, కౌరంపేట కిట్టు, నడిమింటి శ్రీనువాస్, శివ, రాఖీ, చెన్నకేశవులు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## ఆఖరి ఓవర్‌లో ఐదు సిక్సర్లతో రెచ్చిపోయిన నబీ..



ఆసియా కప్ చివరి లీగ్ మ్యాచ్‌లో అఫ్గనిస్థాన్ ఆదిలో తడబడినా ఆఖర్లో భారీ స్కోర్ చేసింది. శ్రీలంక పేసర్ నువాన్ తుషార(4–18) విజృంభణతో పవర్ ప్లేలోనే మూడు కీలక వికెట్లు కోల్పోయిన కాబూలీ టీమ్ మొహమ్మద్ నబీ(60) ఇబ్రహీ జద్రాన్(24) ఇన్నింగ్స్‌తో కోలుకుంది. వంద లోపే కుప్పకూలేలా కనిపించిన జట్టుకు కెప్టెన్ రషీద్ ఖాన్ (24) అండతో నబీ కొండంత స్కోర్ అందించాడు. తనదైన పవర్ హిట్టింగ్‌తో రెచ్చిపోయిన రషీద్ ఔటయ్యాక.. గేర్ మార్చిన నబీ 20వ ఓవర్లో చెలరేగిపోయాడు. వెల్లలాగేకు చుక్కలు చూపిస్తూ వరుసగా 5 సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో.. అఫ్గన్ జట్టు లంకకు కష్టసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గనిస్థాన్‌కు ఆశించిన ఆరంభం లభించ లేదు. దూకుడుగా ఆడుతున్న ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్(14)ను మూడో ఓవర్లోనే తుషారా ఔట్ చేసి షాకిచ్చాడు. ఆ కాసేపటికే కరీం జన్నత్(1), సూపర్ ఫామ్‌లో ఉన్న అటల్(18)ను సైతం క్లీన్‌బౌల్డ్ చేసిన తుషార అఫ్గన్‌పై ఒత్తిడి పెంచాడు. అంతే.. పవర్ ప్లేలో 43కే మూడు వికెట్లు పడడంతో ఇబ్రహీం జద్రాన్(24) జట్టును గట్టెక్కించే ఇన్నింగ్స్ ఆడాడు. లంక స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొన్న జద్రాన్.. రసూలీ (9), అజ్మతుల్లా(6)తో కీలక పరుగులు జోడించాడు. అయితే.. వెల్లలాగే ఓవర్లో చమీర చేతికి క్యాచ్ ఇచ్చి అతడు వెనుదిరిగడంతో అఫ్గన్ జట్టు వందలోపే చాపచుట్టేలా కనిపించింది. కానీ.. కెప్టెన్ రషీద్ ఖాన్(24), మాజీ సారథి మహమ్మద్ నబీ(60) అండగా లంక బౌలర్లపై విరుచుకు పడ్డాడు. షనక వేసిన 15వ ఓవర్లో వరుసగా 4, 6 బాదిన రషీద్ జట్టు స్కోర్ వంద దాటించాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు విలువైన 35 రన్స్ చేశారు. రషీద్ ఔటయ్యాక లంక బౌలర్ల భరతం పట్టిన నబీ ఆఖరి ఓవర్లో 32 రన్స్ రాబట్టాడు. వెల్లలగే బౌలింగ్‌ను ఊచకోత కోస్తూ వరుసగా 5 సిక్సర్లు బాదాడు. దాంతో, అఫ్గనిస్థాన్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది.

## ఐపిఎల్ ఫ్రాంచైజీకి జహీర్ ఖాన్ గుడ్ బై..

ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్ ముందు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు ఆటగాళ్లు జట్టు మారేందుకు సిద్ధమవుతుండగా.. కొందరేమో మేము మీతో కొనసాగలేం అంటూ ఫ్రాంచైజీలను వీడుతున్నారు. టీమిండియా పేస్ దిగ్గజం జహీర్ ఖాన్ ఐపిఎల్ జట్టుకు బై బై చెప్పేశాడు ఏడాది క్రితం లక్నో సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గా నియమితుడైన జహీర్ గురువారం తన బాధ్యతల నుంచి వైదొలిగాడు. ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గొయెంకా, కోచ్ జస్టిన్ లాంగర్‌తో పొసగకే అతడు రాజీనామాకు సిద్ధపడినట్టు సమాచారం. ఐపిఎల్ 2022 ఎడిషన్‌లో అరంగేట్రం చేసిన లక్నో.. వస్తూ వస్తూనే ప్లే ఆఫ్స్ చేరింది. ఆ తర్వాత సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్‌తోనే సరిపెట్టుకున్న లక్నో పదిహేడో సీజన్‌లో మాత్రం నిరాశపరిచింది. దాంతో.. మెంటార్‌గా జహీర్ ఖాన్‌ను నియమించుకుంది లక్నో. అనుభవజ్ఞుడైన ఈ దిగ్గజ పేసర్ రాకతోనైనా తమ జట్టు తొలి ఐపిఎల్ టైటిల్ పట్టేస్తుందని ఫ్రాంచైజీ భావించింది. కానీ, జహీర్ పెద్దగా ప్రభావం చూప లేకపోయాడు. పద్దెనిమిదో సీజన్‌లో లక్నో పేస్ దళం వైఫల్యం కారణగా ప్రత్యర్థికి భారీ స్కోర్లు సమర్పించుకోవడంతో యజమాని సంజీవ్ గొయెంకా జహీర్‌పై తీవ్ర అసంతృప్తిగా ఉన్నాడు. అయితే.. కెప్టెన్ రిషభ్ పంత్‌తో జహీర్‌కు అతడికి మంచి అనుబంధమే ఉండేది. కానీ.. కోచ్ లాంగర్, గొయెంకా తీరుతోనే అతడు విసిగిపోయాడు. 14 మ్యాచుల్లో కేవలం ఆరు విజయాలకే పరిమితమైన లక్నో ఏడో స్థానంలో నిలవడంతో జహీర్‌ను తప్పించాలని మేనేజ్‌మెంట్ అనుకుంది. ఈ వెటరన్ పేసర్ నిష్క్రమణతో ఎల్‌ఎస్‌జీ కొత్త మెంటర్ వేటను ప్రారంభించనుంది. విదేశీ లీగ్స్‌లోని తమ సిస్టర్ ఫ్రాంచైజీ బాధ్యతలు కూడా చూసుకోగల.. సమర్థుడైన వ్యక్తి కోసం లక్నో వెతుకుతోంది.



## నిరాశపరచిన నీరజ్ చోప్రా కల

కాంస్యం చేజార్చుకున్న సచిన్



వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో టైటిల్ నిలబెట్టుకోవాలనుకున్న నీరజ్ చోప్రా కల చెదిరింది. గత సీజన్‌లో విజేతగా నిలిచిన భారత బడిసె వీరుడు ఈసారి దారుణంగా విఫలమయ్యాడు. గురువారం జరిగిన జావెలిన్ త్రో ఫైనల్లో అతడు 85 మీటర్ల మార్క్‌నుఅందుకోలేకపోయాడు. ఐదు ప్రయత్నాల్లోనూ నీరజ్ ఆకట్టుకోలేకపోయాడు. టోక్యో వేదికగా జరిగిన జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ ఫేవరెట్‌గా బరిలోకి దిగాడు. కానీ.. అంచనాలను అందుకోలేకపోయాడు. కానీ.. ఈ ఏడాది ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో వెండి పతకంతో మెరిసిన సచిన్ యాదవ్ మాత్రం అదరగొట్టాడు. నీరజ్ జావెలిన్‌ను 85 మీటర్ల దూరం విసరలేకపోయిన చోట సచిన్ ఏకంగా 86 మీటర్ల మార్క్ అందుకొని అబ్బురపరిచాడు. కానీ.. 86.27 మీటర్లతో నాలుగో స్థానంతోనే సరిపెట్టుకున్నాడు. గత ఏడేళ్లలో పోటీపడిన ప్రతి ఈవెంట్లో మెడల్ గెలుపొందిన చోప్రా.. పతకం లేకుండా తిరిగి రావడంఇదే మొదటిసారి. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన టైటిల్ పోరులో ట్రినిడాడ్ వీరుడు కెషార్న్ వాల్‌కాట్ స్వర్ణం కొల్లగొట్టాడు. టోక్యో ఒలింపిక్స్‌లో పతకంతో మెరిసిన కెషార్న్.. వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో మెడల్ సాధించడం ఇదే తొలిసారి. ఫైనల్లో అతడు 88.16 మీటర్ల దూరం ఈటెను విసిర అగ్రస్థానంతో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. గ్రెనెడాకు చెందిన అండర్సన్ పీటర్స్ 87.36 మీటర్లతో రెండో స్థానంలో నిలవగా.. అమెరికా అథ్లెట్ కర్టిస్ థాంప్సన్ 86.67 మీటర్ల దూరంలో కాంస్యం గెలుపొందాడు. వరుసగా రెండు ఒలింపిక్స్‌లో మెడల్స్‌తో చరిత్ర సృష్టించిన నీరజ్ మాత్రం.. 84.03 మీటర్లతో ఎనిమిదో స్థానంలో నిలిచాడు. పారిస్‌లో 90 మీటర్లతో గోల్డ్ మెడల్ పట్టేసిన పాక్ అథ్లెట్ అర్షద్ నదీమ్ సైతం పేలవ ఫామ్(82.75)తో పదో స్థానం సాధించాడు.

## ఫోకస్

### వైకల్యం అంటే?

దివ్యాంగులకు సంబంధించి వైకల్యం అంటే శారీరక లోపాలు మాత్రమేనన్న అభిప్రాయం చాలా మందిలో ఉంది. కానీ, అది అర్ధ సత్యం మాత్రమే. వైకల్యాలున్న వ్యక్తి (సమాన అవకాశాలు, హక్కుల రక్షణ, పూర్తి భాగస్వామ్యం) చట్టం 1995, ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, మెంటల్ రిటార్డేషన్ మరియు బహుళ వైకల్యాలున్న వ్యక్తుల సంక్షేమం కోసం నేషనల్ ట్రస్ట్ చట్టం, 1999, వైకల్యాలు ఉన్న వ్యక్తుల హక్కుల చట్టం, 2016 ఈ విషయంపై స్పష్టతనిస్తాయి. ఈ చట్టాలను అనుసరించి 'వైకల్యం ఉన్న వ్యక్తి' అంటే దీర్ఘకాలిక శారీరక, మానసిక, మేధో లేదా ఇంద్రియ బలహీనత ఉన్న వ్యక్తి, ఇది అడ్డంకులతో పరస్పర చర్యలో, ఇతరులతో సమానంగా సమాజంలో అతని భాగస్వామ్యాన్ని పూర్తిగా లేదా పాక్షికంగా నిలుపుదల చేస్తుంది. కాగా, 'బెంచ్‌మార్క్ వైకల్యం ఉన్న వ్యక్తి' అంటే నలభై శాతం ఎక్కువ వైకల్యంగల వ్యక్తి. వైకల్యం కొలవదగిన నిబంధనలలో లేకపోవడం వంటి అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటారు. వైకల్యం ఎలాంటిదైనా, అందరికీ సమాన హక్కులు, అవకాశాలు అనే రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరించి, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత.





## మంచి నిర్ణయం..

పారిస్ (ఫ్రాన్స్)లో ఒక బస్సు డ్రైవర్ తీసుకున్న నిర్ణయాన్ని ఇప్పుడు సోషల్ మీడియాలో నెటిజన్లు విపరీతంగా పొగుడుతున్నారు. అతను తీసుకున్న నిర్ణయం సరైనదేనని అంటున్నారు. వివరాల్లోకి వెళితే, పారిస్‌లో ఒక బస్సు ఆగినప్పుడు, అందులో ఎక్కడానికి వీల్‌చైర్‌లో ఉన్న వ్యక్తి ప్రయత్నించాడు. అయితే, అతను బస్సులోకి వస్తే, సీటు ఇవ్వబోమని ప్రయాణికులు భీష్మించుకున్నారు. పరిస్థితిని గమనిస్తున్న డ్రైవర్ బస్సును నిలిపివేసి, ప్రయాణికులు అందరినీ తిగిపోవాలని సూచించాడు. వారంతా దిగిన తర్వాత, వీల్‌చైర్ యూజర్ ఒక్కడినే ఎక్కించుకొని వెళ్లిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యా యి. వీల్‌చైర్ యూజర్స్‌కు స్థలం ఇవ్వడానికి ప్రయాణికులు నిరాకరించడం, ఆ వెంటనే వారందరినీ డ్రైవర్ దింపేయడం అందరినీ ఆకట్టుకుంది. ఒకే ఒక్క ప్రయాణికుడితో డ్రైవర్ వెళ్లినప్పటికీ, అతను చేసిన పనిని చాలా మంది సమర్థిస్తున్నారు. అతను మంచి నిర్ణయమే తీసుకున్నాడని అంటున్నారు. ఈ డ్రైవర్ చేసిన చర్య ద్వారా వివిధ సామాజిక మాధ్యమాల్లో అందరికీ ఒకటి సైతం మార్పు తీసుకురావాలని, ముఖ్యంగా దివ్యాంగుల హక్కులు మరియు గౌరవం పట్ల మరింత జాగ్రత అవసరమని తెలియజేసింది. ఈ సంఘటన ప్రజలలో దయ, సహానుభూతి మరియు సమాజంలో జీవించే వారందరి అవసరాలను గౌరవించాలని ఒక సంకేతంగా మారింది.

## దివ్యాంగులు

## శారీరక వైకల్యం

కండరాల లేదా నాడీ వ్యవస్థ లేదా రెండింటి సమస్యల ఫలితంగా పూర్తిగా లేదా పాక్షికంగా కదలలేకపోవడం, సమస్యలు ఎదుర్కోవాల్సి రావడం, విలక్షణమైన కార్యకలాపాలను నిర్వర్తించడానికి శరీరం అనుకూలించకపోవడం వంటి లోకోమోటర్ వైకల్యాలను శారీరక వైకల్యంగా పేర్కొంటారు. కుష్టి వ్యాధి నయమైనప్పటికీ, ఆ కారణంగా చేతులు లేదా పాదాలలో స్పర్శను... చలనాన్ని కోల్పోవడం, కన్ను లేదా దృష్టి దెబ్బతినడం లేదా కనురెప్పలు మూయలేకపోవడం కూడా శారీరక వైకల్యం కిందకు వస్తుంది. కాగా, విపరీతమైన శారీరక వైకల్యం అలాగే ముదిరిన వయస్సు అతని లేదా ఆమె ఎలాంటి లాభదాయకమైన వృత్తిని చేపట్టకుండా అడ్డుకుంటుంది. 'కుష్టు వ్యాధి నయమవుతుంది' అనే పదాన్ని తదనుగుణంగా అర్థం చేసుకోవాలి. కుష్టు వ్యాధి వల్ల శరీరానికి జరిగిన నష్టాలను ఈ విభాగంలో చేర్చారు. శరీర కదలికలు, కండరాల సమన్వయాన్ని ప్రభావితం చేసే నాన్‌ప్రోగ్రెసివ్ న్యూరోలాజికల్ కండిషన్ యొక్క సమూహమైన 'మస్తిష్క పక్షవాతం' కూడా శారీరక వైకల్యం జాబితాలో ఉంటుంది. మెదడులోని ఒకటి లేదా అంతకంటే ఎక్కువ నిర్దిష్ట ప్రాంతాలకు నష్టం వాటిల్లడం వలన, సాధారణంగా పుట్టుకకు ముందు లేదా కొంతకాలం తర్వాత ఈ మస్తిష్క పక్షవాతం సోకుతుంది. 'మరుగుజ్జు ' అంటే 4 అడుగుల 10 అంగుళాలు (147 సెంటీమీటర్లు) లేదా అంతకంటే తక్కువ ఎత్తులో ఉండే వైద్య లేదా జన్యుపరమైన స్థితి. ఈ సమస్యలు ఎదుర్కొంటున్న వారిని కూడా శారీరక వైకల్యంగల వారిగా గుర్తిస్తారు. 'కండరాల బలహీనత'... అంటే మానవ శరీరాన్ని కదిలించే కండరాలను బలహీనపరిచే వంశపారంపర్య జన్యు కండరాల వ్యాధి, బహుళ డిస్ట్రోఫీ ఉన్న వ్యక్తులను శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారిగా పేర్కొంటారు. వీరి జన్యువులలో లోపాలు ఉంటాయి. ఈ పరిస్థితి ఆరోగ్యకరమైన కండరాలకు అవసరమైన ప్రోటీన్‌లను తయారు చేయకుండా నిరోధిస్తుంది. తీదిది క్రమంగా పెరిగే అస్థిపంజర కండరాల బలహీనత, కండరాల ప్రోటీన్లలో లోపాలు, కండరాల కణాలు, కణజాలం మరణం ద్వారా కూడా వర్గీకరిస్తారు. 'యాసిడ్ దాడి బాధితులు' సైతం శారీరక వైక ల్యం కింద అన్ని రకాల హక్కులకు అర్హులే. 'అంధత్వం'.. అంటే దృష్టి పూర్తిగా లేకపోవడం లేదా దృశ్య తీక్షణత 3/60 కంటే తక్కువ లేదా 10/200 (స్నెలెన్) కంటే తక్కువగా ఉండడం లేదా 10 డిగ్రీల కంటే తక్కువ కోణాన్ని తగ్గించే దృష్టి క్షేత్రం పరిమితి. కాగా, దృశ్య తీక్షణత 6/18 మించకుండా లేదా 20/60 కంటే తక్కు వ 3/60 వరకు లేదా 10/200 (స్నెలెన్) వరకు ఉత్తమమైన దిద్దుబాట్లతో మెరుగైన కంటి లో; 'చెవిటి' అంటే రెండు చెవుల్లో స్పీచ్ ఫ్రీక్వెన్సీలో 70 డిబి ఉంటే, వినికిడి లోపం. 'వినికిడి కష్టం' అంటే రెండు చెవులలో స్పీచ్ ఫ్రీక్వెన్సీలలో 60 డిబి నుండి 70 డిబి వరకు వినికిడి లోపం ఉన్న వ్యక్తి అని అర్థం.

*'స్పీచ్ అండ్ లాంగ్వేజ్ డిజెబిలిటీ' అంటే లారింజెక్టమీ లేదా అఫాసియా వంటి పరిస్థితుల నుండి ఉత్పన్నమయ్యే శాశ్వత వైకల్యం. మరోరకంగా చెప్పాలంటే, సేంద్రియ లేదా నాడీ సంబంధిత కారణాల వల్ల మాట లేదా భాష లేదా ఈ రెండింటిలోనూ సమస్యలు ఎదుర్కోవడం. ఈ రకంగా 'శారీరక వైకల్యం' జాబితాలోకి చేరే వారంతా ప్రత్యేక హక్కులకు అర్హులు. వారిపట్ల జాలిచూపించడం కాదు.. వారిని ప్రోత్సహించడం, ఉన్నతంగా తీర్చిదిద్దడం అవసరం.*

# సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్యం

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

సింగరేణి కార్మిక సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** సింగరేణి కార్మిక సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని గుర్తింపు సంఘం(ఎఐటియుసి) రాష్ట్ర వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. గురువారం శ్రీరాంపూర్‌లోని ఆర్‌కె 7, ఎస్‌ఆర్‌పి 3 గనుల వద్ద జరిగిన ద్వార సమావేశాల్లో ఆయన డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ సంస్థ లాభాలను ప్రకటించకుండా జాప్యం చేయడంపై ప్రశ్నించారు. సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలలో 35 శాతం కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ, యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం జిఎం కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గుర్తింపు సంఘంతో గత స్ట్రక్చర్ సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లపై ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సర్క్యులర్లు జారీ చేయకపోవడం యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. సంస్థ లాభాలను వెంటనే ప్రకటించి, లాభాల్లో 35 శాతం కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులంతా సంఘ భేదం లేకుండా పెద్ద సంఖ్యలో ముట్టడిలో పాల్గొని యాజమాన్యపు కుట్రపూరిత ఆలోచనలను తిప్పికొట్టాలని సీతారామయ్య కోరారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జిఎం కమిటీ చర్చల ప్రతినిధి సంపత్, నాయకులు మురళి చౌదరి, మారపల్లి సారయ్య, జాడి రాజ్ కుమార్, తౌటం మల్లేష్, పవన్, ఆడేపు సురేష్, మోహన్, శ్రీనివాస్, వంశీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

**రామగిరి :** సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి యాజమాన్యం మొండి వైఖరి నిర్లక్ష్య ధోరణి వీడనాడాలని గుర్తింపు సంఘం (ఎఐటియుసి) జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవి రావు అన్నారు. గురువారం రామగుండం ఆర్‌జి. 3 ఓసిపి 2లో గేట్ మీటింగ్ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆ సి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ ప్రకాష్, సెంట్రల్ సెక్రటరీ జూపాక రామ్ చందర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి భవిష్యత్తు, కు సింగరేణిలో రాజకీయ జోక్యం తగదన్నారు. లాభాల వాటా ప్రకటిస్తామని స్ట్రక్చర్ సమావేశంలో ఒప్పుకొని సర్క్యులర్ జారీ చేయకపోవడం తగదన్నారు. సొంత ఇంటి పథకం, కొత్త బావులు, డిస్మిస్ కార్మికులకు ఒక అవకాశం ఇవ్వాలని కోరినా స్పందన లేదన్నారు. కార్మిక సమస్యల పరిష్కారానికి యాజమాన్యం నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు, సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలలో 35 శాతం కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల19న జిఎం కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అయినా కూడా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తే సమ్మెకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ క్రాంతి,ఓసిపి 2 అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు ఎ.పోచయ్య, కె.సంపత్, సురేష్, ఏఎల్‌పి పిట్ సెక్రటరీ గంగాధర్, రాజు, రమణయ్య, ఎన్‌వి రాజు, చారి, వెంకటేశ్వర్లు వెంకట్ స్వామి, శ్రీనివాస్, రమేష్, కుమార్, ఎం.శ్రీనివాస్, సేఫ్టీ కమిటీ మెంబర్స్, మైన్స్ కమిటీ మెంబర్స్, నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.



## వరద బాధితులకు సాయమేది?



సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నిర్మల్/అదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను, వరద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళినిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో వేలాది ఎకరాల పంటలకు నష్టంజరిగిందన్నారు. పత్తి, సోయా వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినప్పటికీ, కేవలం నదులు, వాగుల పరిసర ప్రాంతాల్లో మాత్రమే అధికారులు సర్వే నిర్వహించారని, ఇంకా చాలా చోట్ల సర్వే చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.30,000 చొప్పున నష్టపరిహారం చెల్లించడంతో పాటు, రెండో పంటకు అవసరమైన విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదిలాబాద్, మావల, తాంసి, భీంపూర్, బేల, జైనథ్ వంటి మండలాల్లో వేలాది ఇళ్లు మునిగిపోయినా, ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి సహాయం అందలేదని ఆరోపించారు.అదేవిధంగా వరద నీటితో మునిగిపోయిన ఇళ్లకు ఇందిరమ్మ ఇల్లుతో పాటు బాధితులకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర పత్తికి క్వింటాకు రూ.15,000, సోయాబీన్‌కు క్వింటాకు రూ.10,000 ధర కల్పించాలని, కేంద్రప్రభుత్వం వెంటనే యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు ఎస్.అరుణ్ కుమార్, కుంటాల రాములు, బీకేఎంయు జిల్లా అధ్యక్షుడు ఖండాల గణేష్, సీనియర్ నాయకులు బెజ్జంకి నర్సింగరావు, అరిగెల గజారాం, కట్టస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే



సిపిఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, జిల్లా సమగ్ర అభివృద్ధికి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని అయన తెలిపారు. కమ్యూనిస్టు అగ్రనాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ పక్కన ఉన్న సాయిగార్డెన్ ఫంక్షన్‌హాలులో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంస్మరణ సభకు రాజకీయాలకు అతీతంగా జిల్లాప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, సిపిఐ జాతీయసమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా, జిల్లాకు చెందిన పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు ఇతర ప్రగతిశీల సంఘాల నాయకులు వామపక్షపార్టీల నాయకులు, సురవరం సుధాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జి, కేశవులుగౌడ్, జిల్లా కార్యవర్గసభ్యులు టి.నర్సింహ్మా, చంద్రమౌళి, కొమ్ముభరత్, శివశంకర్, మర్యాద వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## లాభాల వాటా చెల్లించాలి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :**సింగరేణిలో వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి 35 శాతం వాటా త్వరగా చెల్లించాలని కార్మిక సంఘం ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం డిమాండ్ చేశారు. గురువారం జిడికె 11వ ఇంక్లైన్, జిడికె వన్ ఇంక్లైన్‌లో, ఏరియా వర్క్ షాప్ లో జరిగిన గేట్ మీటింగ్‌లలో వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. సింగరేణిలో గుర్తింపు సంఘంతో మూడు సార్లు జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లపై సర్క్యులర్ ఆరు నెలలు గడిచినా ఇంతవరకు జారీ చేయలేదన్నారు. స్ట్రక్చర్ సమావేశాల్లో యాజమాన్యం అంగీకరించిన డి మాండ్లపై సర్క్యులర్‌లు జారీ చేయాలని సెప్టెంబర్ 19 న సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించి యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి ఆర్జీవన్ బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సంకె అశోక్, ఎం.చక్రపాణి, ఉప్పులేటి తిరుపతి, సిర్ర మల్లికార్జున్, నాయిని శంకర్, బలుసు రవి,గొడిశల నరేశ్, చెప్యాల భాస్కర్, కలవేణి రాజేష్, నేరెళ్ళ తిరుపతి, కొప్పుల లింగయ్య, పొన్నం రంజిత్, చంద్ర మోహన్, బి.శ్రీరాములు, నక్క రాజాలు, ఊరడి అంజయ్య, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలి



సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఇమ్రాన్

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భద్రత బీమా పథకం కార్డులను సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ గురువారం కార్మికులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సమాజానికి వెన్నెముకలాంటి వారని కష్టపడి పని చేస్తున్న సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా కుటుంబాలు కష్టాల్లో పడకుండా ఉండేందుకు ఈ బీమా పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు వీరమళ్ల యాదయ్య, సీపీఐ సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య, పల్లె మల్లారెడ్డి, ఎర్రోళ్ల లింగస్వామి, దుబ్బాక సంజీవ, బోయ శంకరయ్య పాల్గొన్నారు.

**ఎఐటియుసిలో చేరికలు...**సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ప్లంబర్ ఎలక్ట్రీషన్ కార్మికులు సిపిఐ అనుబంధ కార్మిక సంఘం ఎఐటియుసిలో చేరిన వారిని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో కార్మిక నాయకులు శంకరయ్య, కొత్తపల్లి అర్జున్, సుక్క వంశీ, బండి శ్రీను, రాపర్తి గోవర్ధన్, బైకని శ్రీను, పొట్ట గణేష్, బైక్ రమేష్ ఉన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పండ్ల రసం తాగుతూ గుండెపోటుతో యువకుడు మృతి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** పండ్ల రసం తాగుతూ అకస్మాత్తుగా గుండె పోటుతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఇబ్రహీం పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబం దించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఖమ్మం జిల్లా పల్లె పాడు గ్రామానికి చెందిన మేడ ఏకలవ్య(30) అనే యువకుడు సాగర్ రహదారి ప్రక్కనే ఉన్న టెండ్స్ వస్త్రా దుకాణము సమీపంలో ఉన్న జ్యూస్ ప్యాంట్ దగ్గర పండ్ల రసం సేవిస్తుండగా అకస్మాత్తుగా గుండె నొప్పితో కుప్పకూలి పోయాడు. తక్షణమే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వ టంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. యువకుడు మృతికి గల కారణాలు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. తల్లీదండ్రులు ఇచ్చిన ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ తెలిపారు.

## కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ దయానంద్ గుప్త



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** కాలనీలలో ప్రజల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త అన్నారు. ఎల్‌బినగర్ నియోజకవర్గం చైతన్యపురి డివిజన్ ఫణిగిరికాలనీ కమ్యూనిటీ హాల్‌లో దయానంద్‌గుప్త సొంత నిధులతో బోర్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనం తరం కాలనీ వాసులు ఎమ్మెల్సీని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బొగ్గారపు శరత్‌చంద్ర, శశిధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుమల్ రెడ్డి, అజయ్ బాశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపి రంజిత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పారిజాత



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** మాజీ ఎంపి డాక్టర్ రంజిత్‌రెడ్డికి మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. గురువారం జూబ్లిహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన రంజిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు రంజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

**శంకర్‌పల్లి:** మాజీ ఎంపి గడ్డం రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం నగరంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. శంకర్ పల్లి మండలం మీర్జాగూడ మాజీ సర్పంచ్, సర్పంచ్ ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ గౌడ్, గోపులారం మాజీ సర్పంచ్, జిల్లా సర్పంచుల సంఘం ఉపా ధ్యక్షుడు పొడువు శ్రీనివాస్‌లు ఎంపి రంజిత్ రెడ్డికి శాలువలతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## చింతల్‌మెట్టులో బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలి : సిపిఐ వినతి



**ప్రజాపక్షం/గండిపేట :** రాజేంద్ర నగర్ జిహెచ్‌ఎంసి కమిషనర్ సురేందర్ రెడ్డిని చింతల్ మెట్, సులేమాన్ నగర్ లో బస్తీ దవఖాన ఏర్పాటు చేయాలని రాజేంద్రనగర్ సిపిఐ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు మాట్లా డుతూ చింతల్ మెట్టు, సులేమాన్ నగర్ బస్తీలో బస్తీ దవాఖాన లేక ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిహెచ్ ఎంసి కమిషనర్ సురేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి బస్తిలో దవఖా నను ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంఎ రియాజ్ , జిల్లా సమితి సభ్యులు జే ఆనంద్ గౌడ్, మండల సహాయ కార్య దర్శి జె విజయ్, ఆనంద్ గౌడ్, చింతల్ మెట్ కార్యదర్శి ఎండి కాజా, సిపిఐ మండల కార్యాలయం కార్యదర్శి జి సత్యం, మండల కౌన్సిల్ సభ్యులు సదా నంద్ గౌడ్,ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం పోలీస్ స్టేషన్‌లో రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/కేశంపేట:** గురువారం కేశంపేట పోలీస్ స్టేషన్‌లో అన్నదా తలు యూరియా కోసం ఆందోళనకు దిగారు. గంటల తరబడి యూరియా కోసం క్యూలైన్లలో వేచి ఉన్నా ఫలితం లేకుండా పోతుందని, సకాలంలో యూరియాను ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సింగిల్ విండో కార్యా లయం వద్ద ఉన్న యూరియాను కొంతమందికి మాత్రమే ఇచ్చారని, మిగత వారికి ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న సింగిల్ విండో చైర్మెన్ గంటా జగదీశ్వర్ గౌడ్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వచ్చిన యూరియా రైతులకు ఇచ్చామని, త్వరలోనే మరో లారీ యూరియా వస్తుందని రైతులకు నచ్చజెప్పారు. రైతుల నుంచిఆధార్ కార్డులను తీసుకొని టొకెన్లు ఇచ్చి అక్కడి నుండి పంపించారు.

## మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆదర్శంగా మున్సిపాలిటిగా అభివృద్ధి చేయాల న్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సిసిరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టడం జరుగుతుందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య వివరించారు. గురువారం మున్సిపల్ పరిధి లోని 18వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటి చైర్మెన్ జమాల్పూర్ చందులాల్, గ్రంథాలయ జాయింట్ ట్రేజరర్ కత్తి చంద్రశేఖర అప్ప, తంగిడిపల్లి శంకరయ్య, భీంరెడ్డి, నవీన్‌రెడ్డి, శశిధర్, విశాల్, నీరటి వాసు, పాండురంగారెడ్డి, శ్రీనులు ఉన్నారు.

# శాశ్వత పరిష్కారం చూపిస్తాం

నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో వర్షం వస్తే రహదారులపై వరదనీరు నిలిచిపోవడంతో చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతున్న విషయం తెలి సిందే. వర్షం వచ్చిన ప్రతిసారి ఆయా ప్రాంతాల్లో రహ దారులు నదులను తలపిస్తుంటాయి. బుధవారం, గురు వారం కురిసిన వర్షానికి నగరవాసులు తీవ్ర ఇబ్బంది లకు గురయ్యారు. ఈ సమస్యకు చెక్ చెప్పేందుకు హైడ్రా రంగంలోకి దిగింది. నీట మునిగిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అమీర్ పేట గాయత్రీ నగర్ కాలనీ, మాదాపూర్ అమర్ సొసైటీ, బాగ్ లింగంపల్లి శ్రీరామ్ నగర్ లో పర్యటించారు. ఈ క్రమంలో కాలువల పూడిక త్వరగా తొలగించాలని అధి కారులకు సూచించారు. అమీర్ పేట దగ్గర కాలువల్లో పూడిక తొలగించడంతో వరద సాఫీగా సాగుతోందని తెలిపారు. ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వరద నీటితో గాయత్రి నగర్ మునుగుతోందని నివాసితుల ఫిర్యాదు చేయగా, కాలువల్లో సిల్ట్ తొలగించి వరద ముప్పు నివా రణకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. చెరువు నీటి మట్టం పెరగడంతో అమర్ సొసైటీ సహా అనేక కాల నీల్లోకి వరద నీరు వచ్చి చేరుతోందని, నీటి మట్టం తగ్గిం చేందుకు నీటిపారుదల, జిహెచ్‌ఎంసి అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్లౌడ బరస్ట్ వల్ల గంటలోనే 15 సెంటీమీటర్ల వర్షం వస్తుందని, ఇలాంటి పరిస్థితులను తట్టుకునే ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. బాగ్ లింగంపల్లి శ్రీరాంన గర్ లో వర్షపు నీటి సమస్యకు వెంటనే పరిష్కారం చూపుతామని స్థానిక ప్రజలకు రంగనాథ్ హామీని చ్చారు. శ్రీరాంనగర్ కి వచ్చే వరద నీళ్లు హుస్సేన్ సాగర్ వదర కాలువలో కలిసేలా ప్రత్యేక నాలా నిర్మిస్తామని తెలిపారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాత నాలా మూసివేయడం, ప్రభుత్వ స్థలంపై అక్రమ కబ్జాలు ఉన్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. నాలాను పున రుద్ధరిస్తే వెంటనే సమస్య సద్దుమణుగుతుందని అభి ప్రాయం వ్యక్తం చేశారు. వందలాది ఇళ్లకు దారి లేకుండా పోయిందని, నడుం లోతు నీటిలో ఇళ్లకు వెళ్లడం కష్టమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### భారీ వర్షాలపై అప్రమత్తం హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టిసారించాలి

జలమండలి ఎండి.అశోక్ రెడ్డి

భారీ వర్షాల కారణంగా నగరంలో ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జల మండలి ఎం.డి. అశోక్ రెడ్డి, ఈ.డి. మయాంక్ మిట్టల్ అధికారులు ఆదేశించారు. రానున్న రెండు రోజులపాటు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమస్యలు తలెత్తకుండా చూడా లని సూచించారు. ముంపు ప్రాంతాల్లో వరదనీరు తొల గింపు, సివర్ జెట్టింగ్ యంత్రాల ఆపరేషన్లను డిజిఎంలు నేరుగా పర్యవేక్షించాలని ఎండి ఆదేశించారు. రహదారు లపై ఉన్న మ్యాన్‌హోళ్ల వద్ద సీవరేజీ ఓవర్ ఫ్లోపై వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజల ఇళ్ల వద్ద చోక్ సమస్యలపై ప్రాధాన్యంగా స్పందించాలని జిఎంలకు సూచించారు. లోతైన మ్యాన్‌హోళ్లు, మురుగు ఉప్పొంగే ప్రాంతాలను సందర్శించి తగిన చర్యలు తీసు కోవాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాలో ఎక్కడా కలుషితం జరగకుండా మంచినీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. బస్తీలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిసారించా లన్నారు. ఈడి మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ ఫీల్డ్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్లు, గ్లౌజులు, గమ్ బూట్లు ధరించి భద్రతా చర్యలు పాటించేలా చూడాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో క్లోరిన్ మాత్రల పంపిణీని క్వాలిటీ వింగ్ సమన్వయంతో చేపట్టాలని సూచించారు. హైడ్రా, జిహెచ్‌ఎంసి, పోలీసు అధికారులతో సమ న్వయం చేసుకుంటూ పనులు కొనసాగించాలన్నారు. నగర ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోళ్ల మూత లను తెరవవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో జలమండలి కస్టమర్ కేర్ నెంబర్ 155313 కి కాల్ చేయాలని సూచించారు.



## ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదే

స్వీప్ సహాయ నోడల్ అధికారి డాక్టర్ వివేకానంద్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని జిహెచ్‌ఎంసి వెట ర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డాక్టర్ వివేకానంద్ అన్నారు. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నేప థ్యంలో, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మార్గదర్శ నంలో స్వీప్ కార్యకలాపాలు వేగవంతమ య్యాయి. ఓటరుగా నమోదు చేయడం, ఓటింగ్ శాతాన్ని పెంచే దిశగా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఎర్రగడ్డలోని డాన్ బాస్కో డిగ్రీ కళా శాలలో స్వీప్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వివేకానంద్ మాట్లా డుతూ ప్రజల చురుకైన భాగస్వామ్యంతోనే ప్రజా స్వామ్యం బలపడుతుందన్నారు. జులై 1, 2025 నాటికి 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఓటరుగా నమోదు కావాలి అని పిలుపుని చ్చారు. చదువుకున్న యువత పెద్ద ఎత్తున ఎన్ని కల్లో పాల్గొంటే రాజకీయ వ్యవస్థలో స్వచ్ఛత, పారదర్శకత పెరుగుతుందని ఆయన అభి ప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజశేఖర్, సి.ఓ. వెంక టయ్య, శోభారాణి, రిసోర్స్ పర్సన్లు రామలక్ష్మి , మహమ్మద్ గౌస్, యాదయ్య, కళాశాల ప్రిన్సి పాల్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## అభివృద్ధి పనులు నిర్లక్ష్యం చేయొద్దు

మున్సిపల్ ప్రత్యేక అధికారి పి.శ్రీధర్

**ప్రజాపక్షం/గండిపేట :** బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ పరిధిలో అభి వృద్ధి పనులలో ఎక్కడ నిర్లక్ష్యం చేయొద్దనీ మున్సిపల్ ప్రత్యేక అధికారి పి. శ్రీధర్ అధికారులను ఆదేశించారు. జాగీర్ నగర పాలక సంస్థ కార్యాలయ కౌన్సిల్ హాల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు నిర్వాహణలో స్వచ్ఛ తను ఆటించాలన్నారు. అరిశుభ్రతకు ప్రథమ స్థానం కల్పించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్, జనన, మరణ ధృవ పత్రాలలో అవకతవకలు లేకుండా నిర్వర్తించాల న్నారు. ఎల్‌ఆర్‌ఎస్, భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు విడు దల, అక్రమ నిర్మాణల పై చర్యలు, అడ్వర్ టైస్మెంట్ పన్నుల వసూలలో అక్ర మాల లేకుండా నిబంధనలు పాటించాలన్నారు. వార్డులలో మొక్కల నాటడం, పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. అన్ని విభాగాలలో కొనసాగు తున్న పనుల నిర్వహణలో జాప్యం చేయకూడదని సూచించారు. సమావేశం లో కమిషనర్ బి.శరత్ చంద్ర, ఎఎంసి డి.చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ ఇఇ జి. యాదయ్య, ఎఇఇ వి.రాజ్ కుమార్, మేనేజర్ టి. పర్వతాలు, ఆర్ఒ కె.శివకు మార్, టిపిఎస్ జి.రాకేష్, జెఎఒ ఎం.స్వాతి, ఐసి. ఎస్ఐ జి.వెంకట్‌రెడ్డి, టిఎంసి ఎస్. శ్రీలత తదితరులు పాల్గొన్నారు..

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

శేరిలింగంపల్లి సర్కిల్ ఎసిపి వెంకటరమణ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని శేరిలింగంపల్లి ఎసిపి వెంకట రమణ హెచ్చరించారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి టెలీకామ్ నగర్‌లో గల అక్రమ నిర్మాణాలను ఇన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, జిహెచ్ ఎంసి అధికారులు కలసి కూల్చివేతలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలను చేప డితే ఎంతటి వారైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ చర్యలకు సైతం వెనకడబోమన్నారు. అక్రమ నిర్మాణాలు శేరిలింగంపల్లి సర్కిల్‌లో జోరుగా కొనసాగుతున్నా యని ఫిర్యాదులు అధిక సంఖ్యలో అందుతుండడంతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారందరికీ నోటీసులు అందించామన్నారు. కూల్చివేతలలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, చైన్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా సంక్షేమ పథకాలు అమలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా..సంక్షేమ పథకాలను ప్రణా ళిక బద్ధంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుం టున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఫరూఖ్‌నగర్ మండలానికి చెందిన లబ్దిదారులకు 48 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా.. సంక్షేమ పథకాలను ప్రణాళిక బద్ధంగా కొనసాగిస్తున్నామని, పేదలకు మెరుగైన వైద్యసే వలు అంధించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం అంధిస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నట్లు, అర్హులైన ప్రతి ఒక్కరిని అదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆరోగ్యశ్రీ పథకా నికి నిధులు పెంచడంతోపాటు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి పెద్ద ఎత్తున నిధులు అందిస్తు న్నామని గుర్తు చేశారు. ప్రజల శ్రేయస్సు కోసం ఎంతో చిత్తశుద్దితో పని చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, దర్శన్ గౌడ్, సీతారా ములు, లింగారెడ్డిగూడ అశోక్ పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్య అభ్యసిస్తే బంగారు భవిష్యత్

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తే భవి ష్యత్ బంగారు మయంగా ఉంటుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల గ్రామం లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదు ర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఆశోక్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శివరాజ్ గౌడ్, పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచులు శేఖర్‌రెడ్డి, భూపా ల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఈశ్వర్‌రాజు, నాగిళ్ల వెంకటేష్, రవీందర్, సంతోష్ నాయక్, రఘుగౌడ్, యాదగిరి, లక్ష్మ య్య, యాదయ్య, మహేష్, వెంకటేష్, సందీప్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించండి : ఎఐఎస్‌ఎఫ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్క రించేందుకు అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. గురు వారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం వద్ద ఉన్న తెలంగాణ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించేందుకు వెళ్ళారు. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ బాలికల పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నా యని, విద్యార్థినీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తమ దృష్టికి వచ్చిం దని, అందులో భాగంగానే తాము వెళ్తె లోపలికి అనుమతించడం లేదని వాపోయారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన అధ్యాపకులు విద్యార్థి సంఘాలపై విమర్శలు చేయడం సరికాదని సూచించారు.

## పేదలకు భూములు పంచాం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రజాకారుల, భూ స్వాములకు వ్యతిరేఖంగా పోరాటం చేసి నిరుపేదలకు భూములు పంచామని సిపిఐ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో కొండిగారి రాములును సిపిఐ నాయకులు అందోజు రవీంద్ర చారీ, కావలి నర్సింహ్మా, యాదిరెడ్డిలు ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్, హరిసింగ్ నాయక్, సుధా కర్,నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ విముక్తికి పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులది

సిపిఐ రాష్ట్ర నాయకుడు రవీంద్ర చారి



**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** భూమి కోసం, తెలంగాణ విముక్తికి పోరాడిన చరిత్ర కమ్యూని స్టులదని సిపిఐ రాష్ట్ర నాయకులు అందోజు రవీంద్ర చారి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముంగిపు సంధర్బంగా బుధవారం రాత్రి పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం కూంట్లూర్‌లోని రావినారాయణరెడ్డి భూపోరాట కేంద్రంలో నిర్వహించిన భారీ బహి రంగ సభకు ఆయన హాజరై మాట్లాడారు. సాయుధ పోరాటంతో సంబంధం లేని బిజెపి మతోన్మాద పార్టీ తాము దేశంలో అధికారంలో ఉన్నామని అమరుల త్యాగాలను వక్రీకరిస్తుందని విమర్శించారు. పోరాటయోధుల ఆశయ సాధ నకు యువత ముందుకు రావాలని పిలుపుని చ్చారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో భూదాన భూములలో గుడిసెలు వేసుకున్న వేలాది మంది పేదలకు పట్టాలు వచ్చేవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాల నీలో భారీ సిపిఐ జెండాను ఎగురవేశారు, అనంతరం సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సభలో సిపిఐ నాయకలు ముత్యాల యాదిరెడ్డి, తెలంగాణ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా పాడిన గేయాలు ఉర్రూత లూగించాయి. సభలో సిపిఐ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్, హయత్‌నగర్ మండల కార్యదర్శి శ్రీదేవి, ఎఐఎస్‌ఎఫ్ రంగా రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశీవ ర్ధన్‌రెడ్డి, కోతం మాధవరెడ్డి, కేతరాజు నర్సింహ్మా, పబ్బంతి లక్ష్మణ్, వేణుగోపాల్ చారి, నవనీత, ఆమనగంటి వెంకన్న, గణేష్, ప్రసాద్‌లతోపాటు వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఇసిఐఎల్ సంస్థలో టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ఇసిఐఎల్ సంస్థలో కాంట్రాక్టు ప్రాతిపదికన 160 టెక్నికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నామని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. బిటెక్, బిఇలలో కనీసం 60 శాతం ఉత్తీర్ణత పొందిన 30 ఏళ్ల లోపున్న అభ్యర్థులు ఈ నెల 22లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రిజర్వేషన్‌లకు లోబడి వయస్సు నిబంధన సడలింపు ఉంటుంది. బిటెక్‌లో వారు సాధించిన మార్కులకు 20 శాతం, అనుభవానికి 30 శాతం, ఇంటర్వ్యూకు 50 శాతం మేరకు నియామక ప్రక్రియ ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు తొలి ఏడాది రూ.25వేల చొప్పున, మరుసటి ఏడాదిలో రూ.28 వేలు, మూడవ ఏడాదిలో 31 వేల చొప్పున ప్రతి నెలా వేతనం ఉంటుందని పేర్కొన్నారు.



## రెసిడెన్షియల్ పాఠశాల భవనం త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మేడ్చల్ మండలం సోమారం గ్రామంలో నిర్మిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ అప్‌గ్రేడెడ్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల భవనాన్ని దసరా సెలవులు పూర్తయ్యే లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. గురువారం ఆయన ఆకస్మికంగా వెళ్లి నిర్మాణ పనులు ఏ మేరకు కొనసాగుతున్నాయన్న విషయాన్ని పరిశీలించారు. ఇంకా ఏయే పనులు పూర్తి చేయాల్సి ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ప్రస్తుతం బోడుప్పల్‌లోని ఓ ప్రయివేట్ భవనంలో కొనసాగుతున్న ఈ పాఠశాల, కళాశాలలను దసరా సెలవులు పూర్తి అయ్యే లోగా తరలించాల్సిందేనని, ఈ దృష్ట్యా ముందస్తుగా పాఠశాలకు కావల్సిన వంట గది, డైనింగ్ హాలు, టాయిలెట్స్‌లాంటి పనులను పూర్తి చేసి తరలించేందుకు సిద్ధం చేయాలన్నారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరే ఇతర పనులు అవసరం ఉన్నా తనకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. మేడ్చల్ ఎమ్మార్వో భూపాల్, ఆర్‌సిఓ, నాగార్జున, ప్రిన్సిపాల్ మమతలు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ముందస్తుగా పెన్షన్లు ఇవ్వాలి

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు దసరా సందర్భంగా ముందస్తుగా పెన్షన్లు ఇవ్వాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ కోరారు. బ్యాంకుకు సైతం పండుగకాలంలో ఎనిమిది రోజులు సెలవులు ఉన్నందున విశ్రాంత ఉద్యోగులకు ఎదురయ్యే ఇబ్బందులు, తెలంగాణా ప్రాంత దసరా ప్రాముఖ్యత దృష్ట్యా ముందే కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ అధికారుల సౌలభ్యం మేరకు ముందే బ్యాంకుల్లో పెన్షన్ సొమ్ము జమ చేయాలన్నారు.

## ఇవిఎం గోడౌన్‌ను పరిశీలించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

ప్రజాపక్షం/వికారాబాద్ : ఇవిఎం గోడౌన్‌ను పరిశీలించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, గురువారం రాష్ట్ర ఎన్నికల అధికారి కలెక్టర్ కార్యాలయం నుండి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఇవిఎం గోడౌన్‌ను



కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిదుల సమక్షంలో ఈవీఎం గోడైన్ సీల్ ను తెరిచి ఇవిఎంలు, వివిప్యాట్స్‌లను, బ్యాలెట్ యూనిట్ ,కంట్రోల్ యూనిట్‌లు,ఎన్నికల సామాగ్రిని, భద్రపరిచి గదులను క్షుణంగా పరిశీలించారు. సిసి కేమెరా ల పనితీరును తనఖీ చేశారు. ఇవిఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల వారితో మాట్లాడి, బిఎల్ఓల పేర్లు ఇచ్చారా. ఓటరు జాబితా పూర్తి అయినదా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జిల్లా డిఆర్ఓ మంగీలాల్, ఆర్‌డిఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్‌హాలి, ఆర్ఐ నరేష్ సిబ్బంది పాల్గోన్నారు.



## స్వచ్ఛ భారత్‌లో కార్పొరేటర్

ప్రజాపక్షం/ఉప్పల్ : రామంతపూర్ డివిజన్ బిజెపి ఒబిసి మోర్చా ఆధ్వర్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు హాజరై రామంతపూర్ చిన్న చెరువు పాండురంగ స్వామి దేవాలయ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కింద వాడుకలేని మొక్కలు, చెత్త తొలగిస్తూ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు ముత్తినేని జగదీష్, బండారు వెంకట్ రావు, వల్లపు జగన్ యాదవ్, రేవు నరసింహ కురుమ, వేముల తిరుపతయ్య, పడిగం నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిరెడ్డికి పలు పార్టీల నాయకుల జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట రెవెన్యూ తహసీల్దార్ యాదగిరిరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని పలు పార్టీల నాయకులు యాదగిరిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, అలియాబాద్ మాజి సర్పంచ్ కమతం కృష్ణారెడ్డిలు శాలువా



కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంగ వెంకటరెడ్డి, అఫ్జల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అఫ్జల్‌ఖాన్‌లు తహశీల్దార్‌కు పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు.

## బ్యాక్‌లాగ్ ఖాళీలకు దరఖాస్తులు

ప్రజాపక్షం/శామీర్‌పేట :మూడుచింతలపల్లి మున్సిపాలిటి జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టి రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో గల బ్యాక్‌లాగ్ ఖాళీలను ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదవ తరగతిలో బిసి 1,ఒసి 2,ఆరవ తరతగతిలో బిసి4, ఒసి1, ఎస్‌సి1, ఏడులో బిసి2, ఎనిమిదిలో బిసిలు 3 ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, బొనోఫైడ్‌తో 25.09.2025 లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల కార్యాలయం అన్ని పనిదినాల్లో తెరిచి ఉంటుందని ప్రిన్సిపల్ ప్రకటనలో తెలిపారు.

# భారీగా నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం పట్టివేత



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఎస్‌టిఎఫ్ టీమ్‌లు దాడులు నిర్వహించాయి. ఈ మేరకు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డిపిఎల్) నాలుగు కేసులు నమోదు చేసి వారి నుంచి గోవా, హర్యానాకు చెందిన రూ.19.65 లక్షల విలువైన 405 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. గోవా, హర్యానా ప్రాంతాలను నుంచి వివిధ దారుల్లో కార్లలోను, ఇతర సామాగ్రి బ్యాగుల్లో తెలంగాణకు మద్యం దిగుమతి చేసు కుంటున్నారనే సమాచారం మేరకు రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ ఎఇఒఎస్ జీవన్ కిరణ్, సిఐలు సుబాష్ చందార్, బాటరాజు, ఎస్ఐలు అఖిల్, రవికుమార్, వెంకటేష్ సిబ్బంది కలిసి పహడీ షరీప్ వద్ద తనిఖీలు నిర్వహించారు.ఈ దాడుల్లో ఖరీదైన 252 మద్యం బాటిళ్లను స్వాధీనంచేసుకున్నారు. ఈ మద్యం బాటిళ్ల విలువ రూ.12.60 లక్షల విలువగా ఉంటాయని అంచనా వేశారు. మద్యం బాటిళ్లను సరూర్‌నగంసెక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

**శంషాబాద్ డిటిఎఫ్ టీమ్ 135 మద్యం బాటిళ్ల స్వాధీనం..**

గోవా, హర్యానా ప్రాంతాలను వివిధ దారుల్లో కార్లలోను, ఇతర సామాగ్రి బ్యాగుల్లో తెలంగాణకు మద్యం దిగుమతి చేసుకున్నారనే సమాచారం శంషాబాద్ టిడిఎఫ్ టీమ్ సిఐ ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐలు దేవేందర్ రావు రాఘవేందర్ వెంకటేశ్వర రెడ్డి శ్రీనివాసులు సిబ్బంది, చేవెళ్ల ఎక్సైజ్ సిబ్బంది కలిసి 135 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ.6.75 లక్షల విలువ ఉంటుందాని అంచనా వేశారు. మద్యాం బాటిళ్లను చేవెళ్ల ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

**తొమ్మిది మద్యం బాటిళ్ల సీజ్..**

ఎస్‌టిఎఫ్‌సీ టీమ్ సిఐ వెంకటేశ్వర్లు సిబ్బంది కలిసి సుబాష్‌నగర్, ఎస్ ఆర్‌నగర్ ప్రాంతాల్లో ఎర్ర శశాంక అనే వ్యక్తి వద్ద తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడితో పాటుమద్యం బాటిళ్లను అమీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. మద్యం బాటిళ్ల విలువ రూ.45వేలుగా ఉంటుందని అంచనా వేశారు.

**9 మద్యం బాటిల్ల సీజ్..**

ఎస్‌టిఎఫ్‌డి 10 సిఐ నాగరాజు రైల్వే పోలీసులు కలిసి రైల్లో తనిఖీలు నిర్వహించగా తొమ్మిది ఢిల్లీ ఇతర ప్రాంతాలకు సంబంధించిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మద్యం బాటిళ్లను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం చేపట్టిన ఎన్‌డిపిఎల్ (నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్) పై ఈ నెల 30 వరకు దాడులు నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు రెండు రోజులుగా చేపట్టిన దాడుల్లో మద్యం పట్టుకున్నారు.మద్యం పట్టుకుంటున్న టీమ్‌లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ రెండుమార్లు మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకున్న సిబ్బందిని రంగారెడ్డి డిప్యూటి కమిషనర్ పి.దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్, డీటీఎప్ టీమ్‌ను శంషాబాద్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ కృష్ణ ప్రియలు అభినందించారు.

## అగ్రశ్రేణి పాఠశాలల్లో విశ్వవిశ్వాణి ఒకటి

కళాశాలల అధ్యక్షుడు రామకృష్ణ

ప్రజాపక్షం/శామీర్‌పేట : హైదరాబాద్‌లో అగ్రశ్రేణి వ్యాపార పాఠశాలలో విశ్వవిశ్వాణి కళాశాల ఒకటిగా ఉందని భవిష్యత్తులో నాయకులను ప్రపంచ సంస్థల విజయాన్ని సాధించడానికి అవసరమైన నైపుణ్యాలు, ఆవిష్కరణలు నైతిక విలువలతో సిద్ధం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని విశ్వవిశ్వాణి కళాశాలల అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. గురువారం విశ్వవిశ్వాణి కళాశాలలో మీడియాతో మాట్లాడారు. విశ్వవిశ్వాణి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ అండ్ కోయోలియా టెక్నాలజిస్ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి పారిశ్రామిక వేత్తల ను గుర్తించడానికి ఒక నిర్దిష్ట పోటీని ప్రకటించిందన్నారు. ఆగష్టు 2025 లో ప్రారంభమై సెప్టెంబర్ 19తో ముగిసిందన్నారు.

మొదటి దశ కోయోలియా టెక్నాలజిస్ సహకారంతో విశ్వవిశ్వాణి ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మెనేజ్‌మెంట్ వద్ద విద్యార్థి నడిచే ఇంక్యుబేషన్ సెంటర్ నావిస్ట హబ్‌ను స్థాపించడం జరుగుతుందన్నారు. హైద్రాబాద్‌లోని తూంకుంట విశ్వవిశ్వాణి కళాశాల వద్ద ఈ స్టార్టప్ హబ్ ద్వార మరింత ప్రత్యేకమైన ఉత్పత్తి, సేవా భావనలను ప్రేరేపిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తు కోసం సిద్ధంగా ఉన్న నాయకులను సృష్టించుటకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. శ్రీనివాస ఆచార్య ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకతను ప్రోత్సహించే లక్ష్యంతో పిజి, యుజి, ఇంటర్ విద్యార్థులను ఇగ్నిటియా–2025 ఇంటర్ కాలేజియాట్ స్టార్టప్ లో పాల్గొనడానికి ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో కోయోలియా సిఇఒ అవినాష్ కులకర్ణి ఉన్నారు.

## మహిళలకు పోలీస్ సేవలపై అవగాహన

ప్రజాపక్షం/చర్లపల్లి: ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (ఇసిఐఎల్)కంపెనీలో బుధవారం మహిళలకు పోలీస్ సేవలు, కార్యక్రమాల గూర్చి సిఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఇందులో గృహ హింస, షీ టీమ్స్,సైబర్ నేరాల గూర్చి వివరించి నల్గొండ జాగృతి పోలీస్ కళాబృందంచే తమ పాటల ద్వారా మహిళలకు అవగాహన కల్పించారు.



మహిళల భద్రత, సహాయం కోసం ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్ల గూర్చి వివరించారు. కుషాయిగూడ చైల్డ్ అండ్ విమెన్ వెల్ఫేర్(సిడిడబ్ల్యూ) టీమ్ షారోన్, సవితలు మహిళలకు సిడిడబ్ల్యు సేవల గూర్చి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, జాగృతి పోలీస్ కళా బృందం, సిడిడబ్ల్యు సిబ్బంది, ఇసిఐఎల్ డాక్టర్ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ వెదురు దినోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి


ప్రజాపక్షం/నాగారం: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని గోకుల్ కృష్ణ కాలనీ కమ్యూనిటీ హాలులో మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వెదురు దినోత్సవంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. మేదరి సంఘం ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. సంఘం నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డి, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, నాయకులను కండువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌యాదవ్, అనంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిమ్మల శ్రీనివాస్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రభుత్వ ఉత్తర్వులను సబ్ రిజిస్ట్రార్‌కు అందజేసిన ఎఎంసి చైర్మన్

ప్రజాపక్షం/శామీర్‌పేట: శామీర్‌పేట మండలంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మండల పరిషత్ కార్యాలయంలోకి తరలించాలని, పంచాయత్‌రాజ్ నుంచి ఉత్తర్వులు జారీ చేశారని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అన్నారు. గురువారం శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్‌ను శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలోకి మార్చుటకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆ పత్రాలను సబ్ రిజిస్ట్రార్‌కు బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అందజేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో నడిచిందని మండల పరిషత్ కార్యాలయం భవనం ఖాళీ కావడంతో ఆ భవనా న్ని, హాల్‌ను, గెస్ట్ రూమ్‌ను సబ్ రిజిస్టార్ కార్యకలాపాలకు వాడుకోవడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు



వచ్చాయని చెప్పారు. అరకొర వసతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లదీశారని ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయం భవనాలను సబ్ రిజిస్టార్‌కు కేటాయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, డైరక్టర్ బిక్షపతి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ తుంకి రమేష్, కాంగ్రెస్ నాయకులు గడ్డం రమేష్, ఊరడి వెంకటేష్, నర్సింలు, భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## 139మంది జిపిఒలు విధుల్లోకి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజాపక్షం/వికారాబాద్ : క్లస్టర్ వారీగా 139మంది జిపిఒలు ప్రత్యేక కౌన్సిలింగ్ ద్వారా పారదర్శకంగా జిపిఒలుగా కేటాయించడం జరిగింది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రామ పాలన అధికారులకు కౌన్సెలింగ్ నిర్వహించి జిల్లాలో భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారుల నియామకానికి శ్రీకారం చుట్టిందని, వారికి రాత పరీక్ష నిర్వహించి అర్హులైన వారికి ఈ నెల 5వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేసిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో జిల్లాకు సంబంధించిన 139మందికి క్లస్టర్ వారీగా మండలాలకు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. కౌన్సిలింగ్ ద్వారా నియమించిన వారందరికీ ఉత్తర్వులు జారీ చేస్తామని ,రేపటి నుండి విధుల్లోకి చేరాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డిఆర్‌డిఒ మంగ్లీలాల్ , తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో రక్తదాన శిబిరం ఏర్పాటు

ప్రజాపక్షం/కూకట్‌పల్లి: భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం కూకట్‌పల్లి బిజెపి కార్యాలయం వద్ద భారతీయ యువ మోర్చా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, జిల్లా ఇంచార్జీ మల్లారెడ్డిలు పాల్గొని రక్తదానం చేసిన దాతలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. సేవ హీ సంఘటన్ అనే ఆలోచనతో మోడీ దేశ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్నారని అన్నారు. ఈ రక్తదాన శిబిరం ద్వారా అనేక మంది ప్రాణాలు రక్షింపబడతాయన్నారు. సేవా కార్యక్రమాల్లో యువత ముందుండి మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి అసెంబ్లీ ఇంచార్జీ మాధవరం కాంతారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాశ్‌రావు, హర్షణపల్లి సూర్యారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, డివిజన్ అధ్యక్షులు అనంత నాగరాజు, వంశీరెడ్డి, యువమోర్చా నాయకులు హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్ కుమార్‌పై వేటు

ఫిర్యాదుపై నిర్లక్ష్యమే కారణం

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: విద్యార్థినిపై ర్యాంగింగ్ సంబంధించిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోకుండా కార్పొరేట్ స్కూల్ యాజమాన్యంతో కుమ్ముక్కయ్యాడన్న ఆరోపణలపై నాచారం ఇనస్పెక్టర్ రుద్వీర్ కుమార్‌పై వేటు పడింది. ఆయన స్థానంలో కె.ధనుంజయను నియమించారు. నాచారం చౌరాస్తాలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఓ విద్యార్థిపై తోటి విద్యార్థులు ర్యాంగింగ్ పేరిట ప్రయివేట్ పార్టులపై దాడి చేసారన్న ఆరోపణలపై బాధితుడి తల్లి దండ్రులు ఫిర్యాదు చేసారు. ఈ ఫిర్యాదు స్వీకరించిన ఇనస్పెక్టర్ రుద్వీర్‌కు మార్ స్కూల్ యాజమాన్యంతో సంప్రదింపులు చేసి తమ ఫిర్యాదుపై ఎలాం టి చర్యలు తీసుకోవటం లేదంటూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లారు. ఈ మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు విచారణ చేపట్టి ఇనస్పెక్టర్‌పై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. ఆయన స్థానంలో నియమితులైన ధనుంజయగౌడ్ గురువారం బాధ్యతలు చేపట్టారు.



రుద్వీర్ కుమార్



ధనుంజయగౌడ్

## నిబంధనలు పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

ప్రజాపక్షం/ఉప్పల్ : డబ్బుల కోసం నిబంధనలను సైతం తుంగలో తొక్కి గత కొంత కాలంగా విద్యుత్ శాఖ హబ్సిగూడా సర్కిల్, హబ్సిగూడా డివిజన్ లోని పలు సెక్షన్ లలో ఉన్న వికర్ సెక్షన్ కాలనిలలో రెండు అంతస్థుల నిర్మాణం చేసుకున్న నిర్మాణాలకు దాదాపు 4 నుండి 6 మీటర్లు అవసరం ఉండగా కొంత మంది విద్యుత్ శాఖ వారు 4 మీటర్ల కు మించితే ప్యానల్ బోర్డు ఏర్పాటు చేసుకోవాలని లేకుంటే కొత్త మీటర్ ఇవ్వడం లేదు అందుకే చాలా మందికి ఇష్టం లేకుండా ప్యానల్ బోర్డులు తీసుకునట్లు పలువురు వాపోతున్నారు. హబ్సిగూడా సర్కిల్ లోని ఒక వికర్ సెక్షన్ కి వెళితే అక్కడ ఏ గల్లీ చూసిన విద్యుత్ స్తంబాలకు ప్యానల్ బోర్డు వైర్లు కనిపిస్తాయి.ఇదంతా పై అధికారులకు తెలియకుండా జరుగుతుందా అని సందేహం కలుగుతోందని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ఈ ప్యానల్ బోర్డు లు వికర్ సెక్షన్



లో ఇవ్వరని తెలిసి కూడా ఆన్లైన్ లో అప్లై చేసి రిజెక్ట్ చేసి మరీ ప్యానెల్ బోర్డులు ఇస్తున్నారు. వై సిరీస్‌తో అప్లికేషన్ అప్లై చెయ్యదద్దు అనే నిబంధనలు కూడా మరచి ఇంటి యజమానులతో వై సిరీస్ తోనే అప్లై చేయిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది. ఈ సంవత్సరం ఒక రెండు నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో ప్యానెల్ బోర్డులు ఇచ్చిన ఘనత హబ్సిగూడా సర్కిల్ విద్యుత్ శాఖ వారికే దక్కుతుంది అని పలువురు ఆరోపణలు చేస్తున్నారు.ఇదే విషయం పై విద్యుత్ శాఖ ఏడీఈ రవీందర్‌ని వివరణ కోరగా ఈ ప్యానల్ బోర్డుల విషయంపై పూర్తి నివేదిక తీసుకుని విచారణ చేస్తామని తెలిపారు.



## దసరాలోపు ప్రజలకు దాహం తీర్చండి

కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీమంత్రి మల్లారెడ్డి

ప్రజాపక్షం/బోడుప్పల్ : ఫీర్జాదిగూడ నగర ప్రజలకు దసరాలోపు మంచి నీళ్ళు అందించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఫీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్ రావుకు మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీమేయర్ జక్క వెంకట్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఫీర్జాదిగూడ నగరంలోని పలు కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాజీ కార్పొరేటర్లు, ప్రజలు, స్థానిక నాయకులతో కలిసి కమిషనర్ త్రిలేశ్వర్ రావుకి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దసరా పండుగ లోపు ప్రజలకు మంచినీళ్లు అందించాలని అవసరమైన చోట నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, సిసి రోడ్లు, డ్రైనేజి వంటి మౌలిక సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన పనులు ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని అన్ని పనులకు టెండర్ వేశారని, మన సమస్యలు అన్ని ముందే అంచనా వేశారని దసరా లోపు అన్ని పనులు పూర్తిచేస్తారని తనదైన శైలిలో అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతురి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి, జావీద్ ఖాన్, జిలాని పాషా, కోనేటి వెంకట్, యాసారం శ్రీనివాస్, అమర్ పటేల్, బత్తుల కిరణ్ వివిధ కాలనీల నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే : చేవెళ్ల ఎమ్మెల్యే

ప్రజాపక్షం/నవాబుపేట్ : నవాబ్ పేట్ మండల కేంద్రం లోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్స్ లో నవాబ్ పేట్ మండలానికి సంభందించిన ఉత్తమ ఉపాధ్యాయులను స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య సన్మానించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ గారి చిత్రపటానికి ఉపాధ్యాయులు, నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత గురువులందరిదన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను విద్యా, నైతిక విలువలు చెప్పి మంచి పౌరులుగా తీర్చి దిద్దుతున్నారన్నారు. ప్రతి గురువు బాధ్యతతో పని చేయాలని సూచించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేసి, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చేర్మెన్ రాథోడ్ గీతాసింగ్, ఎంఈఓ అబ్దుల్ రెహమాన్, ఎంపీడీవో అనురాధ, ఏంసి డైరెక్టర్లు నర్సింహా రెడ్డి, ఖదీర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, మాజీ ఎంపిటిసి ఎగ్బల్, మాజీ సర్పంచ్ రావుగారి వెంకట్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగిరెడ్డి, ప్రభాకర్, అధికారులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రీల్




## 21న ఓజీ ట్రైలర్ విడుదల

పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం ఓజీ. సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్ ను ఈనెల 21న విడుదల చేయనున్నారు. ఉదయం పది గంటల ఎనిమిది నిమిషాలకు ట్రైలర్ ను విడుదల చేయనున్నారు. గ్యాంగ్ స్టర్, మాఫియా బ్యాక్ డ్రాప్ లో నిర్మిస్తున్న ఈ చిత్రంలో యాక్షన్ తో పాటు అందరిని ఆకట్టుకునే ఫ్యామిలీ డ్రామా ఉంటుందని నిర్మాత డీవీవీ దాన్నయ్య తెలిపారు. ఇప్పటివరకు విడుదల అయిన టీజర్, పాటలకు మంచి స్పందల లభించిందని, అలాగే ఈ సినిమాను కూడా ప్రేక్షకులు ఆదరిస్తారని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు.పవన్ కళ్యాణ్ సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాను ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతరపత్రాల్లో ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రీయ రెడ్డి, అభిమన్యుసింగ్ , ప్రకాష్ రాజ్, షాన్ కక్కర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం థమన్, డీఓపీ మనోజ్, ఎడిటర్ నవీన్ నూలి పని చేస్తున్నారు.

## నాన్నతో స్క్రీన్ షేర్ చేసుకోవడం జీవితంలో మరచిపోలేను



మంచు లక్ష్మి ప్రసన్న ప్రధాన పాత్రలో శ్రీలక్ష్మి ప్రసన్న పిక్చర్స్ అండ్ మంచు ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై రూపుదిద్దుకుంటున్న చిత్రం 'దక్ష ది డెడ్లీ కాన్స్పిరసీ'. ఈ సినిమాలో డాక్టర్ మంచు మోహన్ బాబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తండ్రీ కూతుళ్లు కలిసి మొదటి సారిగా ఈ చిత్రంలో నటించడం విశేషం. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వంశీ కృష్ణ మల్లా అందించారు. ఈ సినిమా ఈనెల 19న విడుదల అవుతున్న సందర్భంగా మంచు లక్ష్మి మీడియాతో మాట్లాడారు. 'దక్ష' సినిమా థియేటర్స్ లోకి వస్తోంది. నేను ఇష్టపడి, కష్టపడి, ప్రేమించి చేసిన చిత్రమిది. ఫస్ట్ టైమ్ నాన్న మోహన్ బాబుతో కలిసి నటించాను. ఆయనతో కలసి స్క్రీన్ షేర్ చేసుకోవడం జీవితంలో మరచిపోలేని అనుభూతిని మిగిల్చింది. నాన్న ఇందులో చాలా ముఖ్యమైన పాత్రలో కనిపిస్తారు. టైటిల్ లాగే 'దక్ష' సినిమా కూడా పవర్ ఫుల్ గా ఉంటుంది. ఎప్పటిలాగే నాపై మీ ప్రేమ ఉంటుందని నమ్ముతున్నాను. ఈ చిత్రంతో మా డైరెక్టర్ వంశీ కృష్ణకు మంచి సక్సెస్ దక్కాలి. అలాగే సముద్రఖని, సిద్దిక్, విశ్వంత్, చిత్రా శుక్లా..వీళ్లంతా తమ స్క్రీన్ ప్రెజెన్స్ , పర్ ఫార్మెన్స్‌తో 'దక్ష' సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారు. వీళ్లందరికీ థ్యాంక్స్ చెబుతున్నా. ఈనెల 19న 'దక్ష' సినిమా థియేటర్స్ లోకి వస్తోంది.మీ అందరినీ మా మూవీ ఆకట్టుకుంటుందని నమ్ముతున్నా. అన్నారు.మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మి , సముద్రఖని, సిద్దిక్, విశ్వంత్, చిత్రా శుక్లా, రంగస్థలం మహేశ్, జెమినీ సురేష్, తదితరులు నటించారు. ఈ చిత్రానికి సంగీతం: అచు రాజమణి, ఛాయాగ్రహణం: గోకుల్ భారతి, నృత్య దర్శకురాలు: బృంద, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వంశీ కృష్ణ మల్లా.

## 'కే -ర్యాంప్' మేకింగ్ వీడియో విడుదల



హీరో కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'కే ర్యాంప్' రిలీజ్ కౌంట్ డౌన్ మొదలైంది. ప్రేక్షకులకు హెవీ ఎంటర్ టైన్ మెంట్ ఇచ్చేందుకు మరో 30 రోజుల్లో ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. 'కే ర్యాంప్' మూవీ 30 డేస్ కౌంట్ డౌన్ బిగిన్ చేసిన సందర్భంగా సినిమా మేకింగ్ నుంచి స్పెషల్ వీడియో రిలీజ్ చేశారు. ఆన్ లొకేషన్ లో ఎంత ఫన్ ఉందో ఈ వీడియో ద్వారా తెలుస్తోంది. టీమ్ ఎంజాయ్ చేసిన ఇదే ఫన్ ను థియేటర్స్ లో ప్రేక్షకులకు అందించబోతోంది.'కే ర్యాంప్' సినిమాను నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్ల మీద నిర్మాత రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. 'కే ర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న థియేటర్ లో విడుదలకు సిద్ధమవుతోంది. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి యాక్షన్ పృథ్వీ, ఎడిటర్ ఛోటా కె ప్రసాద్, డీవోపీ సతీష్ రెడ్డి మాసం, సంగీతం చేతన్ భరద్వాజ్, కోప్రొడ్యూసర్‌బాలాజీ గుట్ట, రచన, దర్శకత్వం జైన్స్ నాని.

## 'బిచ్చగాడు' డైరెక్టర్‌తో 'వంద దేవుళ్ళు'

**'భద్రకాళి' నా కెరీర్‌లోనే బిగ్గెస్ట్ చిత్రం — విజయ్ ఆంటోనీ**



బిచ్చగాడు ఫేం తమిళ నటుడు విజయ్ ఆంటోని హీరోగా నటించిన తాజా చిత్రం 'భద్రకాళి'. సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో విజయ్ ఆంటోనీ విలేకరులతో చిట్ చాట్ చేశారు. భద్రకాళి పొలిటికల్ థ్రిల్లర్. కరెంట్ పొలిటిక్స్ ఇందులో కోర్ ఎలిమెంట్. నేను పొలిటికల్ మీడియేటర్ గా కనిపిస్తాను. సాదరణంగా రాజకీయాల్ని మనం సినిమాల్లో చాలా డ్రమెటిక్ గా చూస్తాం. కానీ ఈ సినిమాలో పొలిటిక్స్ చాలా నేచురల్ గా చూపించడం జరిగింది. రాజకీయాల్లో ఒక మీడియేటర్ పాత్ర ఎలా ఉంటుంది? ఒక పెద్ద పెద్ద స్కాం లో తన పాత్ర ఏమిటి? అనేది ఆడియన్స్ కి కొత్తగా చెప్పే ప్రయత్నం చేశాం. డైరెక్టర్ అరుణ్ ప్రభు అద్భుతమైన కథ తీసుకొచ్చారు. ఆయన ఇంతకు ముందు రెండు సినిమాలు చేశారు. అందులో 'అరవి' సినిమా నాకు చాలా ఇష్టం. ఆయన దర్శకత్వంలో నా 25వ సినిమా రావడం ఆనందంగా ఉంది ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో ఇది బిగ్గెస్ట్ మూవీ ఇది.నా ప్రతి సినిమాకి ఒకేలాగా కష్టపడతాను. ప్రతి సినిమా నాకు ఇంపార్టెంట్. ఐతే భద్రకాళి రిచ్ ప్రొడక్షన్ వాల్యూస్ తో తీసిన సినిమా. ఇది కథ, స్కేల్ పరంగా బిగ్గర్ మూవీ.పొలిటికల్ సినిమాల్లో ఇది ఒక డిఫరెంట్ మూవీ. ఇలాంటి పొలిటికల్ బ్రోకర్ క్యారెక్టర్ ఇప్పటివరకు రాలేదు. ఈ ప్రతి ఎలిమెంటు చాలా రియల్ గా కనిపిస్తుంది. మేకప్ లేకుండా నటించడం జరిగింది. ప్రతిదీ చాలా నేచురల్ గా తీశారు. ఇది రొటీన్ పొలిటికల్ సినిమా కాదు. అలాగే నాలుగు పాటలు ఉన్నాయి. ఆ నాలుగు కూడా సందర్భోచితంగా వచ్చే పాటలు కథకు అనుగుణంగానే వస్తాయి.ఈ చిత్రంలో తృప్తి రవీంద్ర వైఫ్ క్యారెక్టర్ లో కనిపిస్తారు. రియా పోలీస్ క్యారెక్టర్ చేస్తుంది. నన్ను క్యాచ్ చేయాలనుకునే క్యారెక్టర్ అది. రెండు క్యారెక్టర్స్ కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటాయి.సురేష్ బాబు గత చిత్రం మార్గాన్ ని చాలా అద్భుతంగా రిలీజ్ చేశారు. ఆ సినిమా చాలా మంచి విజయాన్ని అందుకుంది. నిర్మాత రామాంజనేయులు మేము మరోసారి సురేష్ ప్రొడక్షన్ వారితోనే కొలాబరేట్ అవ్వాలనుకున్నాను. వారు ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నారు. దాదాపు 300 పైగా థియేటర్స్ లో ఈ సినిమాని రిలీజ్ చేయబోతున్నారు.బిచ్చగాడు డైరెక్టర్ తో 'వంద దేవుళ్ళు' సినిమా చేస్తున్నాను. బిగ్ స్కేల్ మూవీ అది. తెలుగు తమిళ్లో రెండు భాషల్లో ఒకేసారి ఆ సినిమా రిలీజ్ అవుతుంది.

## 'గాలి' టీజర్ సాంగ్ విడుదల



సంధ్య ఫిలిం బ్యానర్‌పై రామ్ ప్రసాద్ గురజాడ, అంజలి, శ్రీకాంత్ పెరుమండ్ల, చిన్ని, రోజా రాణి, బివి సుబ్బా రెడ్డి నటీ నటులుగా నాటకారంగంలో వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత , నంది, గరుడ వంటి అవార్డులు పొందిన టి.రాము దర్శకత్వంలో నిర్మాత చందా లక్ష్మి నారాయణ నిర్మించిన సోషియో ఫాంటసీ చిత్రం 'గాలి'. ఈ చిత్ర టీజర్, పాటను ప్రసాద్ ల్యాబ్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన నిర్మాత సాయి వెంకట్, ఆల్ రౌండర్ స్టార్ బల్లెం వేణు మాధవ్, రచయిత తిరునగిరి శ్రీనివాస్, ప్రముఖ విద్యా వేత్త దరిపల్లి నవీన్ కుమార్ పాల్గొన్నారు. ఏ సందర్భంగా నిర్మాత లక్ష్మి నారాయణ మాట్లాడుతూ.. నాకు సినిమా ఫీల్డ్ కొత్త,అయినా రాము రాసుకున్న సోషియో ఫాంటసీ కథ నచ్చడంతో ఈ సినిమా చేయడం జరిగిందన్నారు. దర్శకుడు రాము మాట్లాడుతూ కలి పురుషుడుకి అమ్మ వారికి మధ్య జరిగే భీకర పోరాటమే ఈ 'గాలి' చిత్రం. సస్పెన్స్ ప్రధానంగా సాగే ఈ చిత్రాన్ని డిసెంబర్ 25 న విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం అన్నారు. నిర్మాత లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ దేవతా మూర్తి పాత్రలో నటించిన రోజా రాణి కలను నెరవేర్చడానికి వారి భర్త లక్ష్మి నారాయణ నిర్మాతగా మారి సినిమా చేయడం జరిగింది. సినిమా తీయడం అంటే అంత ఈజీ కాదు. అలాంటిది 'గాలి' పేరుతో వస్తున్న ఈ సోషియో ఫాంటసీ సినిమా దర్శక, నిర్మాతలకు గొప్ప విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.నటి రోజా రాణి మాట్లాడుతూ అమ్మ వారికి కలిపురుషనికి మధ్య జరిగే బీకర యుద్ధ కథతో వస్తున్న ఈ సినిమాలో అమ్మ వారు పాత్రలో నటిస్తున్నాను . ఇలాంటి కఠిన మైన పాత్రకు నన్ను ఎంచుకున్న దర్శక, నిర్మాతల అంచాలకు ఏ మాత్రం తగ్గకుండా నటించానని అనుకుంటున్నాను. ఇలాంటి మంచి చిత్రంలో నటించే అవకాశం రావడం నా అదృష్టం అన్నారు. హీరో రామ్ ప్రసాద్ గురజాడ, హీరోయిన్ అంజలి, రెండవ హీరోగా శ్రీకాంత్ పెరుమండ్ల, హీరోయిన్ చిన్ని, అమ్మవారిగా రోజా రాణి, కలి పురుషుడుగా బి.వి సుబ్బారెడ్డి, పోచమ్మగా సుందరమ్మ, సురభి శేష కుమారి, సురభి వీణ తదితరులు నటిస్తున్నారు.



## హైదరాబాద్‌ను పిల్లలకు సురక్షిత నగరంగా మార్చుతాం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పిల్లలకు హైదరాబాద్‌ను సురక్షిత నగరంగా మార్చుతామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో 'క్లాప్ ఫర్ చిల్డ్రెన్స్' పిల్లల భద్రత కోసం నగర స్థాయి కార్యాచరణ ప్రణాళికను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, యూనిసెఫ్ సంయుక్తంగా ప్రారంభించింది. దీనికి సంబంధించిన 'క్లాప్ ఫర్ చిల్డ్రెన్స్ పోస్టర్'ను హైదరాబాద్, సచివాలయంలో గురువారం మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల భద్రత ప్రణాళిక ద్వారా ప్రభుత్వ విభాగాలు, చట్టపరమైన సంస్థలు, సమాజం కలిసి పిల్లలు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదగేందుకు కృషి చేయనున్నాయన్నారు. కాగా చట్టపరమైన సంస్థలు, ఫ్రంట్‌లైన్ సేవలను బలోపేతం చేసి, మహిళా.శిశు సంక్షేమ, పోలీసు, ఆరోగ్యం, విద్య, కార్మిక,జిహెచ్ఎంసి వంటి విభాగాల సమన్వయంతో బుల్లీయింగ్, ఈవ్‌టీజింగ్, అసురక్షిత రవాణా, మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోనున్నారు. బాలల రక్షణ సెల్లు, విజిలెన్స్ కమిటీల ద్వారా డేటా ఆధారిత మానిటరింగ్ జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, యూనిసెఫ్ చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్ డాక్టర్ జెలాలెం బిర్హాను టాఫెస్సే తదితరులు పాల్గొన్నారు.

### ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా

## 'సమ్మక్క సారలమ్మ' గద్దెల ఆధునీకరణ

● మాస్టర్ ప్లాన్‌కు సిఎం ఆమోదం పొందగానే పనులు చేపడుతాం ● వంద రోజుల్లోగా పూర్తి చేసేలా కార్యాచరణ : మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ కుంభమేళాగా పిలుచుకొనే మేడారం జాతరకు సంబంధించి ఆదివాసీ గిరిజన సంస్కృతీ సాంప్రదాయాలకు అనుగుణంగా 'సమ్మక్క సారలమ్మ' గద్దెల ఆధునీకరణ, భక్తులకు సౌకర్యాలు వంటి ప్రాధాన్యతా అంశాలతో కూడిన రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు సిఎం ఆమోదం పొందగానే వెంటనే ఆధునీకరణ పనులు చేపడుతామని వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ పనులను వంద రోజుల్లోగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. హైదరాబాద్, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయం లోని తన కార్యాలయంలో రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివా స రెడ్డి 'మేడారం సమ్మక్క సారలమ్మ'మాస్ట ర్ ప్లాన్‌పైన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గద్దెలను అభివృద్ధి డిజైన్ , సమ్మక్క సారలమ్మ ప్రధాన ద్వారం డిజైన్ , ప్రహరీగోడ నిర్మాణానికి అవసరమైన రాతి డిజైన్ గద్దెల అభివృద్ధి తర్వాత అదనంగా ఎంత విస్తీర్ణం పెరుగుతుంది లాంటి తదిత ర అంశాలపైన సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను రెండు రోజుల్లో సమర్పించాలని కన్సల్టెన్సీని మంత్రులు ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు స్వయంగా మేడా రం వెళ్లి అక్కడి పూజారులు, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని గద్దెల డిజైన్ తయారు చేశారని, అమ్మ వార్ల ను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మాస్టర్ ప్లా న్ రూపొందించామన్నారు. భక్తుల సౌకర్యా ర్థం గద్దెల ప్రాంగణాన్ని విస్తరిస్తున్నామన్నా రు. తెలంగాణలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి గాంచిందని, ఇది గిరిజ న సంప్రదాయ రీతికి దర్పణం పడుతుందని ఆయన చెప్పారు. సమ్మక్క సారలమ్మల త్యాగం, ఔన్నత్యం మరింత చాటి చెప్పేలా ఆలయ ప్రాంగణం రూపకల్పన జరుగుతోందన్నారు. మేడారం ఆలయంతో పాటు ఆ పరిసర ప్రాంతాల్లోని అన్ని దేవాలయా ల ను శోభాయమానంగా తీర్చిదిద్దుతామని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో ముఖ్య మంత్రి ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరా జు, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైల జా రామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి,ఎస్‌టి,మైనార్టీ గురుకులాలలో విద్యా వ్యవస్థ పటిష్టం చేయాలి

- అధిక ఫలితాలు సాధించిన గురుకులాలను మోడల్ ఇన్‌స్టిట్యూట్లుగా అభివృద్ధి చేసి, ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలపాలి
- ఎస్‌సి, ఎస్‌టి,మైనార్టీ దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉన్నత విద్య, జాతీయ ప్రవేశ పరీక్షల (జెఇఇ,ఐఐటి,నీట్, యుపిఎస్‌ఇ, ఎస్ఎస్‌సి) కోసం ప్రత్యేక కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఎస్‌సి, ఎస్‌టి,మైనార్టీ దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. అధిక ఫలితాలు సాధించిన గురుకులాలను మోడల్ ఇనిస్టిట్యూట్లుగా అభివృద్ధి చేసి, ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలపాలన్నారు. హైదరాబాద్, సచివాలయంలో గురువారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ, కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్య సాషి ఘోష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి,మైనార్టీ గురుకులాలలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అధికారులు సమాయత్తం కావాలని సూచించారు. ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలను తక్షణమే కొత్త భవనాలను నిర్మించాలని, అలాగే పాత భవనాలకు మేజర్, మైనర్ మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. విద్యార్థుల చదువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత అధికారుల పైనే ఉందని స్పష్టం చేశారు. పరిపాలనలో ఎటువంటి గ్యాప్ లేకుండా సమర్థవంతంగా అమలు జరగాలని,కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ నిధుల విషయంలో చురుకుగా అనుసంధానం చేయాలని మంత్రి సూచించారు. డ్రాప్‌అవుట్ రేటు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మెంటర్‌షిప్, కౌన్సెలింగ్‌పైన దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థుల స్కిల్ డెవలప్‌మెంట్, డిజిటల్ లెర్నింగ్, టెక్నాలజీ యాక్సెస్ పై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో సూచనలు,సలహాలు నిర్మాణాత్మమైన అంశాలతో ఒక సమగ్రమైన నివేదికను త్వరలోనే సిఎంకు సమర్పిస్తామన్నారు. ఈ సమీక్షలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ దీపక్ జాన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, ట్రై కార్ చైర్మన్ బెల్ల య్య నాయక్, ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య , గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కె. తిరుపతి, వికలాంగుల సమాఖ్య చైర్మన్ ముత్తినేని వీరయ్య, వా క్ఫ్ బోర్డు చైర్మన్ తారీక్ అన్సారీ, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ టిజిఎం డబ్ల్యుఆర్‌ఇఐఎస్ వైస్ ప్రెసిడెంట్, చైర్మెన్ మహమ్మద్ ఖురేషి, తెలంగాణ ఉర్దూ అకాడమీ అధ్యక్షులు తాహిర్ బిన్ హమదన్, హజమతుల్లా హుస్సేని, ముఖ్యమంత్రి ఒఎస్‌డి వేముల శ్రీనివాస్, ఎస్‌సి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, మహిళ, దివ్యాంగుల , సీనియర్ సిటిజన్ శాఖ ప్రత్యేక కా ర్యదర్శి అనితా రామ చంద్రన్ ,ఎస్‌సి డిడి కమిషనర్ క్షితిజ , మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎం.డి క్రాంతి వెస్లీ, ఎస్‌సి గురుకుల కార్యదర్శి కృష్ణా ఆది త్య, గిరిజన గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి, ది వ్యాంగుల శాఖ డైరెక్టర్ శైలజ, మైనార్టీ గురుకుల కార్యదర్శి షఫియుల్లా తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

యూరోలింక్స్ ఆయుధ కర్మాగార కార్యకలాపాలను ప్రదర్శకులు స్తంభింపజేశారు. లక్షలాదిమంది ప్రజలు, కార్మికులు దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో వీధుల్లోకి వచ్చి మేక్రాన్ ఆర్థిక విధానాలపై తీవ్ర నిరసన తెలియజేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 250 కంటే ఎక్కువ ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. పాఠశాలలు, కార్యాలయాలు మూతపడ్డాయి. రవాణా నిలిచిపోయింది. జనజీవనం స్తంభించింది. పారిస్‌లో ప్రధానంగా ఆర్ఎటిపి రవాణా విభాగ కార్యకలాపాలకు తీవ్ర విఘాతం కలిగింది. 90 శాతం ఫార్మసీలు మూతపడ్డాయి. సమ్మెకుముందు సోషలిస్ట్‌పార్టీ నాయకులు కొత్త ప్రధానమంత్రి లెకోర్నును కలుసుకుని బడ్జెట్‌లో ప్రజలకు భారీ రాయితీలు ఇవ్వాలని కోరారు. ఫ్రాన్స్‌లో ఆర్థిక సమస్యల పరిష్కారంలో మేక్రాన్ ప్రభుత్వం విఫలమవుతూ ఉండటంతో దేశంలో రోజురోజుకూ ఆయనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం పెరుగుతోంది. 2017లో అధికారం చేపట్టినప్పటినుండీ అధ్యక్షుడు మేక్రాన్ ఇప్పటివరకూ ఏడుగురు ప్రధానమంత్రులను మార్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్మికులు, మెట్రో ఉద్యోగులు, రవాణరంగ కార్మికులు, ఆరోగ్యరంగం ఉద్యోగులు 2026 ముసాయిదా బడ్జెట్‌ను కార్మిక సంఘాలు తీవ్రంగా ప్రతిఘటిస్తూ వీధుల్లోకి వచ్చారు. దేశవ్యాప్తంగా 10,00,000 లక్షలమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనల్లో పాల్గొన్నారని కార్మిక సంఘాలు తెలిపాయి. ఫ్రాన్స్‌లో ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడంలో విఫలమవుతున్న మేక్రాన్ ప్రభుత్వంలో ఏడాదికాలంలోనే ముగ్గురు ప్రధానమంత్రులు మారారు. కొత్తగా మేక్రాన్ అనుంగు మిత్రుడు సెబాస్టియన్ లెకోర్ను ఈనెలలోనే బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకంటే ముందు తొమ్మిది నెలలు పనిచేసిన ప్రధానమంత్రి ఫ్రాంకోయిస్ బైరోన్ రాబోయే బడ్జెట్‌లో ప్రజలకు ఖర్చుచేయాల్సిన మొత్తంలోంచి 44 మిలియన్ యూరోలను కోతపెడుతూ ప్రతిపాదన చేసి చివరకు రాజీనామాతో కనుమరుగయ్యారు. సెప్టెంబరు 8వ తేదీన ఆయన ప్రభుత్వం ప్రజాప్రతినిధుల సభ విశ్వాసం కోల్పోయి రాజీనామా చేసింది.

## ఇడి సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ–ఎన్‌సిఆర్‌లలో ఉన్న 20కి పైగా ప్రాంతాలలో సోదాలు నిర్వహించారు. ఈ మద్యం అవినీతిలో భారీ ఎత్తున అక్రమ ఇన్‌వాయిస్‌ల ద్వారా అనేకమందికి ముడుపుల పందేరం జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంతమంది నిందితుల ప్రాంగణాలలో కూడా ఇ.డి.అధికారులు సోదాలు చేశారు. ఆరేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, శ్రీజ్యూవెల్లరీ ఎగ్జింప్, ఎన్.ఆర్.ఉద్యోగ్ ఎల్ఎల్‌పి, ద ఇండియన్ ఫ్రూట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (చెన్నై), వెంకటేశ్వర ప్యాకేజింగ్, సువర్ణ దుర్గ బాటిల్స్, రావూ సాహెబ్ బూరుగు మహదేవ్ జ్యూవెల్లర్స్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ అండ్ మోహన్ లాల్ జ్యూవెల్లర్స్ (చెన్నై) తదితర ప్రాంతాలలో ఈ సోదాలు నిర్వహించినట్లు ఇ.డి అధికారులు గురువారం చెప్పారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటివరకూ మూడు ఛార్జిషీట్లను నమోదు చేశారు. వైఎస్‌ఆర్‌సిపి లోక్‌సభ ఎంపి పి.వి.మిథున్ రెడ్డి వంటి ప్రముఖులను ఈ కేసులో ఇప్పటివరకూ అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ కూడా సగటున నెలకు రూ.50 నుండి 60 కోట్లు మేరకు ముడుపులు అందుకున్నవారిలో ఉన్నారని ఛార్జిషీటులో పోలీసులు నమోదు చేశారు. ఐతే ప్రాసిక్యూషన్ చేసిన ఫిర్యాదులో ఆయన పేరును మాత్రం ప్రస్తావించలేదు. 2019 జులై నెలలో కొత్త మద్యం విధానానికి సంబంధించి జరిగిన ఒక సమావేశానికి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ అధ్యక్షత వహించారని కూడా పోలీసులు ఛార్జిషీటులో ఆరోపించారు. ఈ విధానం కింద మద్యం దుకాణాలను ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌బిసిఎల్) ఆధ్వర్యంలో నడుస్తాయి. చాలా కిందిస్థాయి వ్యక్తుల ద్వారా ఈ ముడుపుల ధనాన్ని అక్రమ మార్గాల్లో చాలా వ్యవస్థాగత పద్ధతులలో తరలించారని కూడా ఛార్జిషీటులో పోలీసులు ఆరోపించారు. 2019 జులై 29వ తేదీన జరిగిన సమావేశంలో నాటి ముఖ్యమంత్రి జగన్ ఎన్ని దుకాణాలు ఏర్పాటు చేయాలి, ఎన్ని దుకాణాలను అద్దెకు తీసుకోవాలి, ఎంతమంది రవాణా ఇన్‌ఛార్జిలను ఏర్పాటు చేయాలి వంటి విషయాలను చర్చించారని కూడా పేర్కొన్నారు. ఎపిఎస్‌బిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఆర్‌టిఎస్ అధికారి డి.వాసుదేవరెడ్డి నియామకం విషయంలో జగన్ కీలకపాత్ర పోషించారని కూడా పోలీసులు ఛార్జిషీటులో ఆరోపించారు. మాజీ ఉన్నతాధికారి రజత్ భార్గవ ఎపిఎస్‌బిసిఎల్‌లో అక్రమాలపై అనేకసార్లు ముఖ్యమంత్రి కార్యాలయాన్ని అప్రమత్తం చేశారని, ఐనప్పటికీ ముఖ్యమంత్రి కార్యాలయం ఆయన మాటలను లెక్కచేయలేదని ఛార్జిషీటులో పోలీసులు పేర్కొన్నారు. ఐతే వైఎస్‌ఆర్‌సిపి నాయకులు దీనిపై స్పందిస్తూ, ఛార్జిషీటులో పోలీసులు పేర్కొన్న విషయాలన్నీ ఆధార రహితాలని, పచ్చి అబద్ధాలని కొట్టిపారేశారు.

## కేంద్రం ఆలోచించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదివాసీల సమస్యలు తెరమీదకు ప్రస్తావనకు రావచ్చని, అలాంటప్పుడు కేంద్రం ఒక మెట్టు దిగి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కందిమళ్ల ప్రతాప రెడ్డి మాట్లాడుతూ మావోయిస్టులు ఎవరి కోసం పనిచేస్తున్నారనే విషయాన్ని కూడా కేంద్రం ఆలోచించాలన్నారు. ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాల జీవితాలు బాగుపడాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలని, ఆకలి బాధలు, అవినీతి, కల్తీ పోవాలని కోరుకొంటున్న వ్యక్తులను నేరస్థులుగా చూడటం సమంజసం కాదన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం కూడా చర్చల ద్వారా పరిష్కారమవుతుందని, మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినా స్పందించని కేంద్రం దురుద్దేశం ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో నిరుద్యోగం, ఆకలి బాధలు, కల్తీ, అవినీతి, విద్యను వ్యాపారంగా మార్చి దోచుకొంటున్నారని మండిపడ్డారు. లోపల ఉండాల్సిన వారు బయట ఉంటున్నారని, బయట ఉండాల్సిన వారు లోపల ఉంటున్నారని విమర్శించారు. కేంద్రంలో 72 మంది కేంద్ర మంత్రులుంటే 40మందిపై క్రిమినల్ కేసులున్నాయని, వీరిలో 19 మందిపై తీవ్ర కేసులున్నాయన్నారు. దేశవ్యాప్తంలో 643 మంది ఎంఎల్ఎలలో 342మంది ఎంఎల్ఎ(47శాతం) లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో న్యూ డెమోక్రసీ నేత చలపతిరావు, శాంతి చర్చల కమిటీ ప్రతినిధి అజయ్ బాల్నే పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president Palla Venkat Reddy, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 Editor : Makkena Subbarao, Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com